అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 17-3-2023 సమగ్ర తెలుగు దినపత్రిక www.navatelangana.com

సంపుటి : 09 | సంచిక : 75 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



అగ్నికి ఆరుగురు ఆహుతి

సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం

- మిన్నంటిన బాధితుల ఆర్తనాదాలు
- సెల్‌ఫోన్ల లైట్లతో సంకేతాలు
- బాధితులను రక్షించేందుకు తీవ్రంగా శ్రమించిన రెస్క్యూ సిబ్బంది



నవతెలంగాణ-బేగంపేట

రూబీ హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదం ఘటన మరువక ముందే సికింద్రాబాద్‌లో మరో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం సంచలనం రేపింది. సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది.. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మరికొంత మంది ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 7.30గంటల సమయంలో స్వప్నలోక్ కాంప్లెక్స్ బిల్డింగ్ 5,6,7,8వ అంతస్తుల్లో భారీగా మంటలు చెలరేగాయి. దాంతో వ్యాపారులు, సిబ్బంది, కొనుగోలుదారులు, ఆందోళనతో బయటకు పరుగులు తీశారు. నిమిషాల వ్యవధిలోనే దట్టమైన పొగ అలుముకోవడంతో.. అంతస్తుల్లో చిక్కుకుపోయిన వారు హాహాకారాలు చేశారు. కొంతమంది మెట్ల మార్గంలో భవనంపైకి చేరుకుని రక్షించండంటూ కేకలు ...6లో

మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఏకగ్రీవం



సీఎంకు దేశపతి,చల్లా, నవీన్‌కుమార్ కృతజ్ఞతలు





వివరాలు 3లో..

మనీశ్ సిసోడియాపై సీబీఐ మరో కేసు

జైలుకు పరిమితం చేసేందుకు కుట్ర : ఆప్

న్యూఢిల్లీ : దేశాన్ని కుదిపేస్తోన్న ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టు అయి తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాపై మరో కేసు నమోదైంది. ఢిల్లీ ఫీడ్‌బ్యాక్ యూనిట్‌లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సీబీఐ సిసోడియాపై కేసు నమోదు చేసింది. చట్ట వ్యతిరేకంగా ఫీడ్‌బ్యాక్ యూనిట్‌ను రూపొందించి అమలు చేయడం ...5లో

దేశ వ్యతిరేక ప్రసంగం చేయలేదు

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశా

- సభలో అనుమతిస్తే మాట్లాడతా
- ఇది ప్రజాస్వామ్యానికి పరీక్ష : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : తానెలాంటి దేశ వ్యతిరేక ప్రసంగం చేయలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. గురువారం ...5లో


ప్రవీణ్ పెన్‌డ్రైవ్‌లో మరో

ఐదు ప్రశ్నాపత్రాలు

లీకేజీ కేసులో మరిన్ని సంచలనాలు ● దర్యాప్తు వేగవంతం

- సిట్ ఎదుట అంగీకరించిన నిందితులు ?
- డబ్బుల గొడవతోనే విషయం బయటకు?
- ఒక్కొక్కరి నుంచి రూ.10లక్షలు ఇచ్చేవిధంగా ఒప్పందం
- పూర్తి వివరాలకు నిందితులను కస్టడీకి కోరిన పోలీసులు

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసు దర్యాప్తును సిట్ వేగవంతం చేసింది. ఈ నెల 11న టీఎస్‌పీఎస్సీ అధికారులిచ్చిన ఫిర్యాదుతో బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రధాన నిందితుడు ప్రవీణ్ కంప్యూటర్ నుంచి మొత్తం ఐదు ప్రశ్నాపత్రాలు తీసుకున్నట్టు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను సేకరించిన అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్ అనంతరం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ పనిచేస్తున్న వారినుంచి కీలక సమాచారం సేకరించినట్టు తెలిసింది.





నవతెలంగాణ-సిటీబ్యూరో

సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో రేణుక పథకం ప్రకారం ప్రవీణ్‌ను కలిసిందని తెలుస్తోంది. ప్రవీణ్‌తో రూ.10లక్షల బేరం కుదుర్చుకున్న రేణుక ఆ తర్వాత ఒక్కొక్క అభ్యర్థి నుంచి అందినకాడికి దండుకోవాలని ఆలోచన చేసినట్టు తెలిసింది. పేపర్ లీకేజీ వ్యవహారంలో ప్రవీణ్ నెట్‌వర్క్ అడ్మిన్‌గా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అట్ల రాజశేఖర్‌రెడ్డితో చేతులు కలిపినట్టు తెలుస్తోంది. ఈ నెల 2న పేపర్స్ లీక్ చేసినా చివరకు రాజశేఖర్‌కు డబ్బులు చెల్లించలేదని తెలిసింది.


డబ్బుల వద్ద గొడవ..

ఒప్పందం ప్రకారం ప్రవీణ్‌కు రూ.5లక్షలు చెల్లించిన రేణుక.. అసిస్టెంట్ ఇంజినీర్ పరీక్ష ప్రశ్నాపత్రం ఇచ్చిన తర్వాత మరో రూ.5లక్షలు చెల్లించింది. అప్పటికే మేడ్చెల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాస్ ద్వారా నీలేశ్, శ్రీను రేణుకకు పరిచయమయ్యారు.

ఒక్కొక్కరితో రూ.10లక్షల ఒప్పందం చేసుకుంది. ఇద్దరు కలిసి రూ.13లక్షల 50వేలు చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని పరీక్ష తర్వాత చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో పరీక్షకు ముందురోజు ఇద్దరిని వనపర్తిలోని తన ఇంటికి తీసుకెళ్లింది. తన తమ్ముడు రాజేశ్‌నాయక్ పై అంతస్తులో ఉండగా.. అక్కడే వారితో ప్రశ్నలకు జవాబులను ప్రాక్టీస్ చేయించింది. 5న నిర్వహించిన అసిస్టెంట్ ఇంజినీర్ పరీక్షకు భర్తతో కలిసి తన కారులోనే ఆ ఇద్దరు అభ్యర్థులను హైదరాబాద్‌కు తీసుకెళ్లి పరీక్ష రాయించుకొని తీసుకొచ్చింది. ఆ తర్వాత మిగిలిన డబ్బులు చెల్లించాలని రేణుక డిమాండ్ చేసింది. అయితే తమ వద్ద డబ్బులేదని, ఇవ్వలేమనడంతో వారి మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలుస్తోంది. తీవ్ర స్థాయిలో గొడవ జరగడంతో ఆవేశానికి లోనైన నీలేశ్‌నాయక్ డయల్ 100కు ఫోన్ చేసి విషయం పోలీసులకు చెప్పాడని తెలుస్తోంది. దాంతో వీరి బండారం మొత్తం వెలుగులోకి వచ్చింది.

మహిళల సన్నిహితంపై ప్రత్యేక దృష్టి

2017 నుంచి ప్రవీణ్ మొబైల్ ఫోన్ డేటాను పోలీసులు సేకరించారు. అందులో కొంతమంది మహిళలు ప్రవీణ్‌తో సన్నిహితంగా వ్యవహరించినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గుర్తించినట్టు సమాచారం. కొందరు మహిళలు అర్థనగ్నంగా, మరికొందరు నగ్నంగా చాటింగ్ చేసినట్టు గుర్తించారు. ప్రవీణ్‌తో వారికున్న లింక్ ఏంటని సిట్ అధికారులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. సిట్ వారందరినీ విచారణకు పిలుస్తుందా లేదా తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా, నిందితుడు ప్రవీణ్ ఏఈ ప్రశ్నాపత్రాన్ని రేణుకకు విక్రయించగా, మిగిలిన ప్రశ్నాపత్రాలను ఎవరికి విక్రయించాడనే దానిపై సిట్ అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. అయితే ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉండటంతో ఎలాంటి వివరాలూ వెల్లడించలేమని సిట్ అధికారులు ...2లో



అదానీ, హిండెన్‌బర్గ్ వ్యవహారంపై 18 విపక్ష పార్టీల నిరసన-నోరు విప్పని ప్రధాని మోడీ!!

ప్రతిపక్షాల భారీ మానవహారం

పార్లమెంట్ ఆవరణంలో దద్దరిల్లిన నినాదాలు

- స్తంభించిన పార్లమెంట్

న్యూఢిల్లీ : అదానీ గ్రూపు అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నేతలు భారీ మానవహారం చేపట్టారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపీలు ప్లకార్డులు పట్టుకొని మానవహారం నిర్వహించారు. మోడీ ...5లో

ఈడీ విచారణకు కవిత గైర్హాజరు

చట్ట ప్రకారం విచారణ జరగట్లేదు..

అందుకే హాజరు కాలేదు.. : కవిత తరపు న్యాయవాది సోమా భరత్

- 20న హాజరుకావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మళ్లీ నోటీసులు



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నాటకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం ఈడీ ముందు హాజరుకాలేదు. తన నిర్ణయాన్ని తెలియజేస్తూ ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్‌కు రాసిన ఆరు పేజీల లేఖను బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది సోమా భరత్ కుమార్‌ను ఈడీ కార్యాలయానికి పంపారు. తన అనారోగ్య కారణాలతో పాటు సుప్రీంకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున తాను విచారణకు హాజరు కాలేనని తెలిపారు. దీంతో 20న వ్యక్తిగతంగా హాజరుకావాలని కవితకు ఈడీ తాజాగా సమన్లు జారీ చేసింది.

ఈడీకి పంపిన లేఖలో 'మీరు ఇచ్చిన నోటీసుల్లో వ్యక్తిగత హాజరుపై స్పష్టత లేనందున.. నా ప్రతినిధిని పంపుతున్నాను. సుప్రీంకోర్టులో జరిగే విచారణలు పవిత్రమైనవి కాబట్టి, సమన్లకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవడానికి ముందు సుప్రీంకోర్టు విచారణ కోసం వేచి ఉండాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. 'మహిళలను ఆఫీస్‌కు పిలిపించి విచారించకూడదు. నేను ఆడియో, వీడియో మోడ్‌లో విచారణకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నాను. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తునకు నేను సహకరించాను. ఈడీ ప్రశ్నలకు నాకు తెలిసిన మేరకు సమాధానాలిచ్చాను. ఆ రోజు రాత్రి 8 గంటల వరకు విచారించారు. మళ్లీ విచారణకు రావాలని సమన్లు ఇచ్చారు. అధికారులు నా నివాసానికి వచ్చి విచారించవచ్చని ...5లో



అకాల వడగండ్ల వర్షం

దెబ్బతిన్న పంటలు.. మంచు తుఫానుగా వికారాబాద్ జిల్లా

నవతెలంగాణ-విలేకరులు

ఉత్తర దక్షిణ ద్రోణి ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి భారీ వడగండ్ల వాన దంచికొట్టింది. ఈదురుగాలులతో కూడిన వానతో ఎటుచూసినా వడగండ్లు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. వికారాబాద్ జిల్లాలో కనీవినీ ఎరుగని రీతిలో వడగండ్ల వాన కురవడంతో మంచు తుఫాను వచ్చిందా అన్నట్టుగా కనిపిస్తోంది. కాగా, భారీ వడగండ్ల వానకు పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఆస్తినష్టం జరిగింది. వాహనాలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దాంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాగా, వడగండ్ల వానతో తడిసి రంగు మారిన మిర్చి పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

వికారాబాద్ జిల్లాలో కురిసిన వడగండ్ల వర్షం జిల్లా రైతాంగాన్ని అతలాకుతలం చేసింది. జిల్లాలోని మర్పల్లి, కోట్‌పల్లి, పూడూర్, పరిగి మండలాల్లో ఏకధాటిగా గంట పాటు కురిసిన వడగండ్లతో ఆ ప్రాంతం మొత్తం నేలపై మంచు గడ్డలు పరుచుకున్నాయి. ఈ ప్రాంతంలోని వందలాది ఎకరాల్లో మామిడి, వరి పంటలు దెబ్బతిన్నాయి. పిందె దశలో ఉన్న మామిడి నేలమట్టమైంది. వరి పూత దశ నుంచి కంకిగా మారే దశలో నేలరాలింది. మొక్కజొన్న, జొన్న, అరటి, కూరగాయల పంటల నేలమట్టమయ్యాయి. ముఖ్యంగా మర్పల్లి మండలంలో భారీగా వడగండ్లు పడటంతో పాత ఇండ్లు దెబ్బతిన్నాయి. ఇండ్ల ఎదుట నిలిచిన వాహనాలు ధ్వంసయ్యాయి. రంగారెడ్డి జిల్లాలో యాచారం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ ప్రాంతాల్లోనూ భారీ





వర్షం కురిసింది. యాచారం మండలం మంతన్‌గౌరెల్లిలో ఫౌల్ట్రీ ఫామ్స్, ఇండ్లు, కార్లు ధ్వంసమయ్యాయి. వరి పంట వంగిపోయింది. వడగండ్లు పడటంతో ఇద్దరు మహిళల తలకు, పలువురి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కురిసిన వడగండ్ల వాన బీభత్సం ...5లో

> రెండ్రోజులు మోస్తరు నుంచి
>
> **భారీ వర్షాలు**
>
> 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు 2లో..



నేటినుంచి సీపీఐ(ఎం) జనచైతన్య యాత్ర

వరంగల్‌లో ప్రారంభించనున్న సీతారాం ఏచూరి

- 29న హైదరాబాద్‌లో ముగింపు సభకు ప్రకాశ్ కరత్
- రాజ్యాంగాన్ని రక్షిద్దాం...దేశాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో ప్రజల్లోకి
- ప్రజాస్వామ్యం, లౌకికత్వం, ఫెడరలిజం, సామాజిక న్యాయ పరిరక్షణే లక్ష్యం
- బీజేపీ మతోన్మాదం, కార్పొరేట్ విధానాలపై పోరాటం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో శుక్రవారం నుంచి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ 'జనచైతన్య యాత్ర'కు శ్రీకారం చుట్టనుంది. తెలంగాణలోని 33 జిల్లాలు పర్యటిస్తూ ఈ బస్సుయాత్రలు జరగనున్నాయి. మొదటి యాత్రను శుక్రవారం వరంగల్‌లో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభిస్తారు. వరంగల్‌లోని ఆజంజాహిమిల్స్ గ్రౌండ్‌లో సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఏచూరితోపాటు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, బృంద నాయకులు పోతినేని సుదర్శన్ పాల్గొని ప్రసంగిస్తారు. ఈనెల 23న ఆదిలాబాద్‌లో రెండో యాత్రను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రారంభం చేస్తారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య ఈ యాత్రకు నాయకత్వం వహిస్తారు. ఈనెల 24న నిజామాబాద్‌లో మూడో యాత్రను ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ ఎ విజయరాఘవన్ ప్రారంభిస్తారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ ఈ యాత్రకు సారథ్యం వహిస్తారు. ఈనెల 29న ...5లో

మతోన్మాదం దేశానికి విఘాతం

జయహో..జన చైతన్య యాత్ర పాటల సీడీ ఆవిష్కరణలో వక్తలు



వివరాలు 5లో..

నవతెలంగాణ

రెండ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు

- పలుచోట్ల వడగండ్ల వాన పడే అవకాశం
- 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- వికారాబాద్ జిల్లాలో అనేక ప్రాంతాల్లో వడగండ్ల వర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే రెండ్రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి నాగరత్న తెలిపారు. పలు చోట్ల 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కూడా పడొచ్చని హెచ్చరించారు. బంగ్లాదేశ్ పరిసరాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తా వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి ఏర్పడింది. దక్షిణ తమిళనాడు మీదుగా కర్నాటక, గోవా, ఉత్తర కొంకణ్ వరకు మరొక ద్రోణి నెలకొంది. గురువారం రాష్ట్రంలో పలు చోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పడ్డాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయింది. పగటి పూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల నుంచి ఐదు డిగ్రీల మేరకు తగ్గాయి.

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులో అత్యధికంగా 4.6 సెంటీమీటర్ల వర్ష పాతం రికార్డయింది. గురువారం రాత్రి 9 గంటల వరకు రాష్ట్రంలో 300కిపైగా ప్రాంతాల్లో వర్షం పడినట్టు తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ప్రకటించింది. వికారాబాద్ జిల్లాలో పలుచోట్ల వడగండ్ల వాన పడింది. భూమిపై తెల్లటి రాళ్ల కుప్పపోసినట్టు వడగండ్లు పడ్డాయి. శుక్రవారం పలు జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వర్షం, అక్కడక్కడా వడగండ్లు కూడా పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతా వరణ కేంద్రం ప్రకటించింది. శుక్ర, శనివారాలకు సంబంధించి పలు జిల్లా లకు ఎల్లో హెచ్చరికను జారీ చేసింది. ఆ జాబితాలో నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, నల్లగొండ, వరంగల్, హన్మకొండ, మహబూబా బాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాలు ఉన్నాయి.

వారం రోజుల్లో క్యాన్సర్ ఆస్పత్రి కొత్త బ్లాక్ ప్రారంభోత్సవం

- అందుబాటులోకి రానున్న 300 పడకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రోజు రోజుకు క్యాన్సర్ రోగుల సంఖ్య పెరిగిపోతున్నది. ప్రభుత్వం చేపడుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల్లో రెండు నుంచి మూడు శాతం మందిలో క్యాన్సర్ బయటపడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లు అత్యధికంగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో గత నాలుగైదు నెలలుగా ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రజల వద్దకే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రత్యేక స్క్రీనింగ్ వాహనం ద్వారా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, హైదరాబాద్ తదితర జిల్లాల్లో స్క్రీనింగ్ క్యాంప్‌లు నిర్వహించారు.

ప్రయివేటులో వేలాది రూపాయలు ఖర్చయ్యే మమ్మోగ్రఫీ, పాప్ స్మియర్, అల్ట్రాసౌండ్ అబ్డామన్ వంటి పరీక్షలను ప్రజల ఇంటి వద్దే చేస్తుండడం ఫలితాలని స్తున్నది. రోగ నిర్ధారణ పరీక్షల్లో క్యాన్సర్ ఉన్నట్టు తేలిన వారికి తదుపరి చికిత్సను హైదరాబాద్ రెడ్‌హిల్స్ లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో అంది స్తున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న వారి సంఖ్య రోజు వారీగా 500 నుంచి 600 వరకూ ఉంటున్నది. దీంతో ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న 450 బెడ్లు సరిపోవడం లేదు. ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల్లో నూతనంగా నిర్మించిన 300 పడకల బ్లాక్‌ను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పేద రోగులకు 750 బెడ్లు అందుబాటులోకి రానున్నాయి. కొత్త బ్లాకులోకి మెడికల్ ఆంకాలజీ సేవలైన పీడియాట్రిక్ ఆంకాలజీ, అడాల్ సెంట్ వార్డు, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, డే కేర్ కీమోథెరపీ వంటి వాటిని తరలించనున్నారు. ఇప్పటికే కాంట్రాక్టు ప్రాతిపదిన 92 మంది డాక్టర్లు, నర్సులను నియమించుకోగా, మరో 252 మంది రెగ్యులర్ స్టాఫ్ కోసం ప్రభుత్వం అనుమతించింది. మెడికల్ బోర్డు ద్వారా వీటిని భర్తీ చేయనున్నారు.



సకాలంలో గుర్తించాలి ... డాక్టర్ జయలత

క్యాన్సర్ రోగాన్ని సకాలంలో గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసేందుకు కృషి చేస్తున్నామని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జయలత ఈ సందర్భంగా తెలిపారు. ఐదు నెలల నుంచి స్క్రీనింగ్ వాహనం ప్రతి రోజూ వేలాది మందికి పరీక్షలు చేస్తూ జిల్లాల్లో సేవలంది స్తున్నదని చెప్పారు. అనుమానిత లక్షణాలున్న వారు వెంటనే పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలని సూచించారు.

బహుజన సాహిత్య జాతీయ అకాడమీ అవార్డు గ్రహీతలకు సన్మానం

- మంత్రి కొప్పుల అభినందనలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బహుజన సాహిత్య జాతీయ అకాడమీ అవార్డు గ్రహీతలను రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సన్మానం చేశారు. పెద్దపల్లి జిల్లా మందమర్రికి చెందిన వద్దాది ప్రమీల శైలజ నాట్యరత్న అవార్డుకు ఎంపిక కాగా, మంథని మండలం గుంజపడుగు కు చెందిన కాశిపేట సంతోష్ మహాత్మ జ్యోతిభాపులే జాతీయ అవార్డ్‌కు ఎంపిక అయ్యారు. ఈ నెల 12న తిరుపతిలో నిర్వహించిన బహుజన రైటర్స్ సౌత్ ఇండియా ఆరో కాన్ఫరెన్స్ సందర్భంగా అవార్డు పొందారు. గురువారం నాడు ప్రమీల శైలజ, సంతోష్ కుమార్‌ను హైదరాబాద్‌లో మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శాలువా కప్పి సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించాలని కోరారు.

ప్రవీణ్ పెన్‌డ్రైవ్‌లో మరో ఐదు ప్రశ్నాపత్రాలు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు.

కంప్యూటర్ నుంచి ఐదు ప్రశ్నాపత్రాలు

ఏఈ ప్రశ్నాపత్రం మాత్రమే లీకైందని గుర్తించిన టీఎస్‌పీఎస్సీ అధికారులు మార్చి 5న జరిగిన అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రవీణ్ దగ్గర ఉన్న పెన్ డ్రైవ్‌లో మరికొన్ని ప్రశ్నాపత్రాలు కూడా ఉన్నట్టు సిట్ అధికారులు అనుమానించారు. దాంతో 9మంది నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లతోపాటు పెన్‌డ్రైవ్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. వాటిని విశ్లేషించి కంప్యూటర్ నుంచి ఏఈ ప్రశ్నాపత్రంతోపాటు టౌన్‌ప్లానింగ్, వెటర్నరీ అసిస్టెంట్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రశ్నాపత్రాలను కూడా ప్రవీణ్ కొట్టేసినట్టు సిట్ గుర్తించింది. ఒప్పందం ప్రకారం రాజశేఖర్ కంప్యూటర్ లాన్‌లో మార్పులు చేశాడని అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. పూర్తి వివరాలను రాబట్టేందుకు నిందితులను కస్టడీకి ఇవ్వాలని అధికారులు కోర్టును కోరారు. నిందితులను పోలీసు కస్టడీకి తీసుకుని ప్రశ్నిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని ఓ సీనియర్ పోలీస్ అధికారి అభిప్రాయపడ్డారు.

2016 గ్రూప్-1 మెయిన్స్ పేపర్లను బయటపెట్టాలి

- పలువురి అభ్యర్థుల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2016 గ్రూప్-1 మెయిన్స్ రాసిన అభ్యర్థుల జవాబు పత్రాల ను బయటపెట్టాలని పలువురు అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని డిమాండ్ చేస్తున్నారు. అప్పుడు మెయిన్స్ పరీక్ష మార్కులు ట్యాంపరింగ్ అయ్యాయంటూ పెద్దఎత్తున నిరసనలొచ్చాయని తెలిపారు. ఫలితాలు వచ్చిన సమయంలో టీఎస్‌పీఎస్సీలోనే కంప్యూటర్‌లో పొరపాటు దొర్లిందని గుర్తు చేశారు. ఆ తర్వాత ఫలితాలు తారుమారయ్యాయి. అయితే ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి అప్పటి నుంచి టీఎస్‌పీఎస్సీలోనే పని చేస్తున్నారు. కాబట్టి అప్పుడు గ్రూప్-1 మెయిన్స్ రాసిన అభ్యర్థుల్లో ఇంకా అనుమానాలున్నాయి. కాబట్టి 2016 మెయిన్స్ రాసిన అభ్యర్థులందరి మా ర్కులు, ముఖ్యంగా దిద్దిన జవాబు పత్రాలను బయటపెట్టాలని కోరుతున్నారు. దిద్దిన పేపర్లు మార్కులు, టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన మార్కులు వేర్వేరుగా ఉంటాయని చాలా మంది అభ్యర్థుల్లో అనుమానాలున్నాయి. కంప్యూటర్‌లో మెరిట్ లిస్ట్ తయారు చేసేటప్పుడే మార్కులు తారుమారాయ్యాయన్నది వారిలో ఉన్న ప్రధాన అనుమానం. దాన్ని నివృత్తి చేసేందుకు టీఎస్‌పీఎస్సీ తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అర్హులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి

సొంత జాగా ఉన్నోళ్లకు రూ.15 లక్షలివ్వాలి

- రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్రం రూ.10 లక్షలు భరించాలి : సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి డిమాండ్
- 58 జీవో ప్రకారం పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి
- వ్యకాస రౌండ్‌టేబుల్‌లో ఏకగ్రీవ తీర్మానం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సొంత జాగా ఉన్నోళ్లకు ఇంటినిర్మాణం కోసం గృహలక్ష్మి కింద రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.మూడు లక్షలు సరిపోవని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు భరించి రూ.15 లక్షలు ఇవ్వాలని కోరారు. జీవో నెంబర్ 58ని వెంటనే అమలు చేసి పేదల గుడిసెలకు పట్టాలివ్వాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75 ఏండ్లుగా పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలిస్తామంటూ ఆర్భాటంగా ప్రకటించాయని చెప్పారు. ఎన్నికల సందర్భంగా వాగ్దానాలివ్వటం, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం షరామామూలుగా జరుగుతున్నదని అన్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పేదలు పోరాడితే కొంతమేరకు అమలు చేస్తున్నారని వివరించారు. అయినా 75 ఏండ్ల స్వాతంత్ర్య భారతంలో పేదలు సొంతింటి కలను నెరవేర్చుకోలేకపోతున్నారని విమర్శించారు. ఇంటిస్థలం లేనివారికి జాగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పేదలందరికీ న్యాయం చేయాలని కోరారు. గుడిసెలను ఖాళీచేయిస్తే ఈ ప్రభుత్వమే ఖాళీ అవుతుందని హెచ్చరించారు. 'జీవోనెంబర్ 58 ప్రకారం పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలి. ఆ భూములను క్రమబద్ధీకరించాలి. రాష్ట్రంలో 30 లక్షలకుపైగా కుటుంబాలకు ఇండ్లు లేని పేదలున్నారు. అందరికీ ఇండ్లస్థలాలు కేటాయించాలి. శుక్రవారం నుంచి ఈనెల 19 వరకు ఇండ్ల స్థలాల కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తాం. ఈనెల 20 నుంచి 31 వరకు కలెక్టర్ కార్యాలయాల్లో లబ్దిదారులతో దరఖాస్తులు పెట్టించి ధర్నాలు చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే వచ్చేనెల 10 నుంచి ప్రత్యక్ష ఉద్యమానికి శ్రీకారం చుడతాం.'అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. అధ్యక్షత వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, తెలంగాణ వ్యవసాయ మహిళా కూలీల కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ పద్మ మాట్లాడుతూ రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసిన భూములను ప్రభుత్వం 59 జీవో ద్వారా క్రమబద్ధీకరిస్తున్నదని విమర్శించారు. పేదలు గుడిసెలు వేసుకుంటే వాటిని 58 జీవో ద్వారా క్రమబద్ధీకరించడం లేదన్నారు. ఇంకోవైపు సొంత జాగా ఉన్నోళ్ల ఇంటి నిర్మాణం కోసం రూ.మూడు లక్షలిస్తే సరిపోవనీ, సిమెంటు, ఇసుక, ఇనుము ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. గృహలక్ష్మి కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను అదానీకి దోచిపెడుతున్న మోడీ

దొరల చేతిలో ఉన్న తెలంగాణ విముక్తి చెందాలి : సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఇచ్చోడ

ప్రజల ఆస్తులు, దేశ సంపదను తన స్నేహితుడైన అదానీకి ప్రధాని మోడీ దోచిపెడుతున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అదానీ కేవలం పదేండ్లలోనే అతి కుబేరుడిగా మారారని తెలిపారు. దేశాన్ని కాపాడటం కోసమే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో పాదయాత్ర చేపట్టారని గుర్తుచేశారు. ఆ పార్టీ చేపట్టిన 'హాథ్ సే హాథ్' జోడో పాదయాత్రకు కొనసాగింపుగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పేరుతో ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్రీ గ్రామంలో పాదయాత్ర ప్రారంభించారు. తొలి రోజున చేపట్టిన ఈ యాత్రకు ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావిద్, రోహిత్ చౌదరి హాజరయ్యారు. వేలాది మంది కార్యకర్తలు, నాయకులతో కలిసి గురువారం పిప్రీలో ప్రారంభించిన ఈ పాదయాత్ర రాత్రి ఇచ్చోడకు చేరుకుంది. అక్కడ ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర ఉద్దేశాన్ని ప్రతి ఇంటికి చేరవేయడంలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఈ యాత్ర చేపడుతు న్నట్టు తెలిపారు. నీళ్లు, నియమకాలు, నిధులు, ఆత్మగౌరవం కోసం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం దొరల చేతిలో బందీ అయిందన్నారు. వారి నుంచి విముక్తి పొందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.1.25లక్షల కోట్లు లూటీ చేశారని, ఒక్క ఎకరానికి కూడా నీరు పారడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనే అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించినట్టు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వైన్ షాపులు బంద్ చేస్తామని చెప్పారు. అంతకుముందు రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మాట్లాడుతూ.. దేశాన్ని రక్షించేందుకే రాహుల్‌గాంధీ పాదయాత్ర చేపట్టారని గుర్తుచేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని ఆరోపించారు. యాత్రలో మంథని, భద్రాచలం ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, పోదెం వీరయ్య, మాజీ పీసీసీ అధ్యక్షులు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీలు రాములునాయక్, ప్రేమ్‌సాగర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యులు గండ్రత్ సుజాత, నాయకులు వన్నెల అశోక్, ఆడె గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రం నారాయణరెడ్డి సేవలు మరువలేనివి

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు





నవతెలంగాణ-చౌటుప్పల్

గుర్రం నారాయణరెడ్డి ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రం(ఎస్వీకే) మేనేజింగ్ కమిటీ సభ్యులు గుర్రం బుచ్చిరెడ్డి తండ్రి నారాయణరెడ్డి మృతదేహాన్ని గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలోని బొర్రోళ్లగూడెంలో సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడారు. మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు, జ్యోతి, సాగర్, జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.జహంగీర్, హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎస్వీకే సెక్రటరీ ఎస్.వినయకుమార్, నాయకులు రవి, సోమయ్య, బండారు రవి కుమార్, కాడిగల్ల భాస్కర్, నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, ఐలూ జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి, నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, ఎమ్‌డి.పాషా, గంగదేవి సైదులు, బండారు నర్సింహా, కోట రామచంద్రారెడ్డి, బొంతల ఉపేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, గుండ్ల మహేశ్, మంత్రి యాదయ్య తదితరులు నివాళి అర్పించారు.



షాపూర్: మహారాష్ట్రలోని షాపూర్‌లో నాసిక్ నుంచి విధానసభ (ముంబయి) వరకు రైతు పాదయాత్ర

ఉక్కు సంకల్పం..

అరికాళ్లు పగిలినా.. పాదాలు రక్తమోడినా.. ఆగని రైతు 'మహా' పాదయాత్ర



ముంబయి: అరికాళ్లు పగిలినా, పాదాల నుంచి రక్తం కారుతున్నా.. ఏ మాత్రం లెక్కచేయకుండా మహారాష్ట్ర రైతులు కదం తొక్కుతున్నారు. ఐదు రోజుల కిందట నాసిక్ నుంచి ముంబయి వరకు 200 కిలోమీటర్ల మేర తలపెట్టిన మహా పాదయాత్రను కొనసాగిస్తున్నారు. పలు డిమాండ్లతో అన్నదాతలు ఈ యాత్రను ప్రారంభించారు.

ఉల్లిరైతులకు క్వింటాకు రూ.600 తక్షణమే అందించాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, ఇలా పలు డిమాండ్లను వారు ప్రభుత్వం ముందు ఉంచారు. ధరలు భారీగా పడిపోవడంతో ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే అధిక ఉత్పత్తి వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే అన్నారు. అలాగే క్వింటాకు రూ.300 మేర పరిహారం ప్రకటించారు. ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ఈ మార్చ్ జరుగుతోంది. ఇందులో రైతన్నలతో పాటు గిరిజన సంఘాల సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొంటున్నారు. వీరితో చర్చలు జరిపేందుకు మహారాష్ట్ర ఇద్దరు మంత్రులను నియమించింది. వారు ఇప్పటికే రైతు ప్రతినిధులను కలిశారు. అలాగే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి గురువారం వారితో సమావేశం కానున్నారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించాలంటూ విపక్షాలు కోరుతున్నాయి. దీనిపై ప్రభుత్వం అసెంబ్లీలో స్పందించింది. 'వారు 14 డిమాండ్లతో ఈ పాదయాత్ర చేస్తున్నారు. చట్టపరిధిలో ప్రభుత్వం వాటన్నింటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుంది' అని తెలిపింది.

'మా డిమాండ్లను నెరవేర్చుకునేందుకు మేం ఇలా నడుస్తూనే ఉంటాం' అని ఓ మహిళ వెల్లడించింది. కొందరి చెప్పులు తెగిపోయినా,,అలానే నడవటానికి సన్నద్ధమవుతున్నారు. కాళ్లకు గాయాలవుతున్నా..నీరసించినా..ఉక్కు సంకల్పం వారిని ముందుకు నడిపిస్తోంది.

ఉత్కంఠగా ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

- ఏవీఎన్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి,మాణిక్‌రెడ్డి మధ్య పోటీ
- ఎలిమినేషన్ రౌండ్‌తోనే ఫలితం వచ్చే అవకాశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపు ఉత్కంఠగా సాగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఎన్నికల సంఘం నిర్ణయించిన మ్యాజిక్ ఫిగర్ 12,709 ఓట్లు ఎవరికీ రాకపోవడంతో ఎలిమినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నియోజకవర్గంలో 29,720 ఓట్లకుగాను 25,868 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 25,416 ఓట్లు మాత్రమే చెల్లాయి. 452 ఓట్లను చెల్లని ఓట్లుగా గుర్తించారు. వీటిలో ఏవీఎన్ రెడ్డికి 7,505, గుర్రం చెన్నకేశవరెడ్డికి 6,584, పాపన్నగారి మాణిక్‌రెడ్డికి 4,569 ఓట్లు వచ్చాయి. దాంతో మొదటి స్థానంలో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి, రెండో స్థానంలో పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి, మూడో స్థానంలో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి ఉన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో ఎలిమినేషన్ రౌండ్ ప్రారంభించారు. మొదటి ప్రాధాన్యతతోపాటు 14వ ఎలిమినేషన్ రౌండ్ పూర్తయ్యేసరికి ఏవీఎన్‌రెడ్డికి 7,899 ఓట్లు, చెన్నకేశవ రెడ్డికి 6,810, పాపన్నగారి మాణిక్‌రెడ్డికి 4,880 ఓట్లు వచ్చాయి.



మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఏకగ్రీవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల పరిశీలన పూర్తయ్యే నాటికి నాలుగు నామినేషన్లు దాఖలు కాగా స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగిన కమల నామినేషన్ తిరస్కరణకు గురయింది. మిగిలిన బీఆర్‌ఎస్ అభ్యర్థులు చల్లా వెంకటరామిరెడ్డి, దేశపతి శ్రీనివాస్, కూర్మయ్యగారి నవీన్‌కుమార్‌ల నామినేషన్లు మాత్రమే చెల్లుబాటైనట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. అనంతరం గురువారం సాయంత్రం 4 గంటలకు నామినేషన్ల గడువు ముగియటంతో ఆ ముగ్గురూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. తమకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించినందుకు వెంకటరామిరెడ్డి, దేశపతి శ్రీనివాస్, నవీన్‌కుమార్ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పెవరిది..? శిక్షెవరికి...?

సంపాదకీయం

ఇల్లొదిలి... ఊరొదిలి... కష్ట నష్టాలకోర్చి... రాత్రనక పగలనక పుస్తకాలతో కుస్తీ పట్టిన వేలాది మంది అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు నడి సంద్రంలో మునిగిపోయింది. తమ పిల్లలకు సర్కారీ కొలువులొస్తాయని ఆశించిన తల్లిదండ్రుల ఆశలు 'లీకేజీ' అనే ఒక్క దెబ్బతో అడియాశలయ్యాయి. డబ్బు, వలపు కోసం తన 'ప్రావీణ్యాన్ని' అంతా

ప్రధానంగా గ్రూప్ -1 పరీక్షపై టీఎస్‌పీఎస్సీ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నదనే ఉత్కంఠ నెలకొన్నది. పేపర్ లీకేజీ జరిగిన తీరుపైనా, ఇందులో టీఎస్‌పీఎస్సీ నిర్వాకంపైనా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగటంతో సర్కారు తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననేది ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మారింది. మరోవైపు టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మెన్‌తోపాటు అందులోని సభ్యులు సైతం తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారంటూ అధికారిక వర్గాలు చెబుతున్న క్రమంలో ఈ అంశంలో సర్కారు నిర్ణయం కోసం వేలాది మంది కళ్లల్లో ఒత్తులేసుకుని చూస్తున్నారు.

రంగరించి టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాన్ని లీకు చేసిన ఓ దుర్మార్గుడు ఇప్పుడు నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నాడు. కాషాయ పరివారపు కార్యకర్త ఒకడు ఈ తతంగాన్ని దగ్గరుండి నడిపించాడనే వార్తల నేపథ్యంలో ఈ మొత్తం వ్యవహారం రాష్ట్రాన్ని ఓ కుదుపు కుదిపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విభాగాల్లోని అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షను సైతం పబ్లిక్ సర్వీస్ కమిషన్ రద్దు చేయటమనేది ఆయా అభ్యర్థులకు తీరని వేదనను మిగిల్చింది.

ఈ క్రమంలో రాష్ట్రంలో ఉద్యోగ పరీక్షల నిర్వహణ ఎంత లోప భూయిష్టంగా ఉందనే విషయం విదితమవుతున్నది. ఇదే కాదు.. 2016లో ఎమ్‌సెట్ ప్రశ్నాపత్రం లీకేజీ, 2019లో ఇంటర్ పరీక్షా ఫలితాల్లో అవకతవకలు, ఫలితంగా 29మంది విద్యార్థుల ఆత్మహత్యలు తెలంగాణ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. అయినా అలాంటి అనుభవాల నుంచి ఏలికలు గుణపాఠాలు నేర్వకపోవటం అత్యంత శోచనీయం. సరళీకృత ఆర్థిక విధానాల అమలు నేపథ్యంలో ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల లాభాపేక్ష వల్ల ఎల్‌కేజీ నుంచి ఇంటర్, బీటెక్, ఎమ్‌టెక్ దాకా మార్కులు, ర్యాంకులు, డబ్బుల చుట్టే విద్యా విధానం నడవటం ఈ దుస్థితికి ప్రధాన కారణం.



అయితే ఇప్పుడు కొనసాగిన లీకేజీ వ్యవహారం మాత్రం అందుకు భిన్నంగా, పూర్తిగా ప్రభుత్వం, పబ్లిక్ సర్వీస్ కమిషన్ వైఫల్యమే. ఈ తతంగంతో సంబంధమున్న ప్రవీణ్, రాజశేఖర్, గురుకుల టీచర్ రేణుక, ఆమె భర్త పక్కా ప్లాన్ ప్రకారమే పేపర్లను లీక్ చేసి అభ్యర్థులకు వాటిని అమ్ముకున్నారు. సంబంధిత వ్యవహారం గుట్టు రట్టయింది. ఇక్కడ అత్యంత ఆశ్చర్యకరమైన విషయమేమంటే... రద్దయిన ఏఈ పరీక్షా పత్రంతోపాటు ప్రవీణ్ పెన్ డ్రైవ్‌లో మరో మూడు పేపర్లు ఉండటం. టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంటు పోస్టులకు సంబంధించిన పేపర్లు సదరు పెన్‌డ్రైవ్‌లో ఉన్నట్టు పోలీసులు గుర్తించటంతో టీఎస్‌పీఎస్సీ ఉన్నతాధికారులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఆ తర్వాత ఈ తతంగంపై సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించటాన్నిబట్టి ఈ స్కామ్ తీవ్రత ఏ పాటిదో తెలుస్తున్నది.

ఈ క్రమంలో వరసగా, రోజుకోటిగా వెలుగు చూస్తున్న లీకేజీ లీలలతో ఈ వ్యవహారం ఇంకా ఎన్ని మలుపులు తిరుగబోతున్నదనే ఆందోళన నిరుద్యోగ అభ్యర్థులను వెంటాడుతున్నది. ప్రధానంగా గ్రూప్ -1 పరీక్షపై టీఎస్‌పీఎస్సీ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నదనే ఉత్కంఠ నెలకొన్నది. పేపర్ లీకేజీ జరిగిన తీరుపైనా, ఇందులో టీఎస్‌పీఎస్సీ నిర్వాకంపైనా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగటంతో సర్కారు తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననేది ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మారింది. మరోవైపు టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మెన్‌తోపాటు అందులోని సభ్యులు సైతం తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారంటూ అధికారిక వర్గాలు చెబుతున్న క్రమంలో ఈ అంశంలో సర్కారు నిర్ణయం కోసం వేలాది మంది కళ్లల్లో ఒత్తులేసుకుని చూస్తున్నారు. ఏతావాతా తేలిందేమంటే ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిసి చేసిన తప్పునకు లక్షలాది మంది నిరుద్యోగులు బలయ్యారు. వారి జీవితాలు ఇప్పుడు అగమ్యగోచరంగా మారాయి. ఎవరో చేసిన తప్పునకు వారు శిక్షననుభవిస్తూ మౌనంగా, దీనంగా రోదిస్తున్నారు. అందువల్ల ఈ వ్యవహారాన్ని ఊరికే వదలకూడదు. నిందితులను రిమాండ్‌కు పంపటంతో సరిపెట్టకుండా నియామకాల విషయంలో అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మెన్, కమిషన్, కార్యదర్శి, మొత్తం సభ్యుల పాత్రపైనా సమగ్ర విచారణ జరిపించాలి. తద్వారా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడగలుగుతాం. లేదంటే నాలుగు రోజుల తర్వాత మళ్లీ ప్రశ్నాపత్రం లీకేజీలు, ఆ తర్వాత కేసులు, అటు తర్వాత నిందితులు బయటికి రావటం షరా మామూలుగా జరిగిపోతాయి. అంతిమంగా నష్టపోయేది, బలయ్యేది పేద పిల్లలే.. ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసే అభాగ్యులే.

హేతువాద కవిత్వం రాసిన సంప్రదాయ కవి

వానమామలై వరదాచార్యుల గూర్చి ఎవరు చెప్పినా ఆయన 'పోతన చరితము' గురించి చెపుతారు. పోతన భాగవతం రాస్తే, పోతన చరిత్రను వానమామలై రాశారని, అదీ అద్భుతంగా రాశారని, భోగినీ విలాసము అత్యద్భుతమనీ చెపుతారు. నాట్యానికి తన కావ్యంలో అత్యంత ప్రాధాన్యమిచ్చారని నటరాజ రామకృష్ణ లాంటి వారే సెలవిచ్చారు. భక్తి భావనకు, ఆధ్యాత్మిక చింతనకు, సంప్రదాయానికి, పద్యనిర్వహణా దక్షతకు వానమామలై రచనలు పెద్దపీట వేశాయి. ఈ విషయంలో దివాకర్ల నుండి విశ్వనాథ వరకు, బి. రామరాజు నుండి సినారె వరకు అందరూ కొనియాడిన వారే. వ్యక్తిగతంగా ఆయనతోను, ఆయన రచనలతోనూ పరిచయం లేని నేను, చాలా కాలం ఆయన రచనలు చదవలేదు. నాకు పద్య కవిత్వంతో పరిచయం లేకపోవడం ఒక కారణమైతే, నేను ఇష్టపడే అంశాలు ఆయన రచనల్లో కనిపిస్తాయో లేదో అన్న అనుమానం మరొక కారణం కావొచ్చు. ఏమైనా కాలం గడిచిపోయింది. ఇటీవల ఆయన శత జయంతి ఉత్సవాలు రాష్ట్రమంతటా ఘనంగా జరుగుతూ ఉండటం, ఆయన పుస్తకాలు పునర్ముద్రణ జరుగుతూ ఉండటం వల్ల అసలు ఈ కవి రాసిందేమిటి? అని 'మణిమాల' తిరగేశాను. ఇది తిరగేయాల్సింది కాదు శ్రద్ధగా చదవాల్సిన గ్రంథమని అనిపించింది. పద్యాలు అర్థం చేసుకోగలిగే భాషా పటిమ లేకపోయినా పట్టుబట్టి చదివాను.



డాక్టర్ దేవరాజు మహారాజు

సంప్రదాయవాది, ఆచారాలు బాగా పాటించే కుటుంబ నేపథ్యంలోంచి ఎదిగి, తెలుగు భాషపై పట్టు సాధించి పద్యకవితను పరుగులు పెట్టించిన వారు వరదాచార్యులు. తన చట్రంలోంచి ఒక్కసారిగా బయటపడి ప్రగతిశీల భావజాలంతో సామాజిక, వైజ్ఞానిక, ఆరోగ్య విషయాలు తడుముతూ కవిత చెప్పారు. 1912లో పుట్టిన వానమామలై రజాకార్ల అఘాయిత్యాలు జరిగిన దశలో సుమారు ముప్పయ్యేళ్ళ యువకుడు. ఆయన నిజాం ప్రభుత్వంలోని అవలక్షణాల్ని ఎండగట్టక ఎలా ఉంటారూ? "నిజాం రాష్ట్రపు బీద వెట్టివాడు" అనే కవితలో ఆయన ఆనాటి వెట్టి చాకిరిని నిర్ద్వంతంగా నిరసించారు.

ఈ రోజుల్లో సాహిత్యం చదివేవారే తక్కువ. అందులో కవిత్వం చదివేవారు ఇంకా తక్కువ. అందులో మళ్ళీ పద్య కవిత్వం చదివి ఆనందించేవారు మరీ మరీ తక్కువ. కొందరు కవుల గూర్చి పదే పదే చర్చించడం, మరి కొందరి గూర్చి పూర్తిగా మరిచిపోవడం మన తెలుగు సాహిత్య రంగంలో కొత్తేమీ కాదు. ఆ రకంగా చూస్తే వానమామలై కవిత్వంపై లోతైన చర్చ జరగలేదని అనిపించింది. కొత్త కోణంలో కొత్త అంశాన్ని విశ్లేషించుకునే పని అసలే జరగలేదు.

'మణిమాల'లో అన్నింటిలోకి 'పాకీవాడు' శీర్షికతో రాసిన కవిత అత్యుత్తమమైందని నా భావన. సెప్టిక్ సిస్టం బాగా వాడుకలోకి వచ్చిన తర్వాత పాకీవాడు కనుమరుగయ్యాడు. కానీ, కొన్నేళ్ళ క్రితం ఆ వ్యవస్థ వాడుకలో ఉంది. దాశరథి బాల్యంపై రాసిన కవిత, తిలక్ పోస్ట్‌మాన్ సుబ్బారావు కవిత, కరుణశ్రీ పుష్పవిలాపం, శ్రీశ్రీ భిక్షుకి కవితల స్థాయిలో వానమామలై 'పాకీవాడు' కవిత ఉంది. అసలు ఆ ఇతివృత్తం తీసుకుని కరుణ రసాత్మకంగా, సామాజికాంశాల్ని కలబోసుకుని కవిత రాయడం గొప్ప విషయం. జగతే తన ఇల్లని, జగతిలోని వారంతా తన కుటుంబ సభ్యులనుకుని ఈ చేయి ఆ చేయి అనే భేదం లేకుండా ఇల్లిల్లూ తిరిగి మల, మూత్రాలు ఎత్తిపోసే పాకీవాడిని చూసి సంఘ సంస్కర్తలు సిగ్గు దెచ్చుకోవాలి అని అంటారు.

"జగతియె నాదునిల్లనుచు సర్వ జనమ్ములు నా కుటుంబ మం
చగపడు చోట్ల నెల్లగల నా కసవంతయు నెత్తిపోయి చుం
దగ నిలునిల్లు సొచ్చి యతి దారుణ శాంత్యసి బూని దొడ్లలో
నగపడు దుష్ట మూత్ర మలినాదులనే గతి పేరు మాపెదో?"

పొట్ట గడవడానికి ఈ వృత్తే చేయాలా? కాయలు, గడ్డలు లేవా తిని బతకడానికి? అని ప్రశ్నిస్తారు. రాజు, గృహిణి, కన్నతల్లి, కవి లాంటి వారికన్నా పాకీ మనిషిని ఉన్నత స్థానంలో నిలిపారు వానమామలై.

అలాగే 'తృణము' అనేది వైజ్ఞానికాలకాలతో వెలువడి బలమైన కవిత **"సాగరుడే పయికెక్కి వచ్చినా / నిని పడి గప్పి ప్రాణమిడినీ కిడుమల్ సుజనుం గలంచునే? – అని అంటారు కవిత ముగింపులో వత్యంత ప్రీతితోడ / తృణమ! నీ ప్రాణ వాయువే మనసు గలదొ"** అంటారు. సూర్యుడి వేడికి సముద్రపు నీరు ఆవిరై పైకి వెళ్ళి వర్షంగా కురిసి నేల మీద పత్రహరితాన్ని కాపాడటం, అది జీవులకు ప్రాణవాయువు నందించడం వర్ణించారు కవి. 'పాలేరు' శీర్షికతో రాసిన పద్యాలు కూడా కళ్ళకద్దుకోవాల్సినవి. గ్రామీణ భారతాన్ని చిత్రించిన కవితలో మొదట అంటారు..

"క్రు గాదది జీవ గణ కాయముల నిల్వ /
గల యమృతపు ఓవగ్ర గాని"
"కాదె నీ యెద్దు పోటు రక్తపు చుక్క
నృపుని మకుటాన వెల్గెడి కెంపు ముక్క" రైతులేనిదే రాజు మన లేడు కదా? మరోచోట 'గంటము – క్రు' కవితలో కవిరాజు గంటాన్ని, కర్షకుడి క్రును ప్రస్తుతించారు. ఆ రెండూ ఒక తల్లి బిడ్డలేనని చెబుతారు.

"కవిరాజు గంటమ్ము కర్షకుని కఱ్ఱు
కవిరాజు కర్షకుడు, కంటి పాపలు నాకు
... ఇవి రెండు నొక తల్లి కవల బిడ్డలు గాదె"

వానమామలై వరదాచార్యులు సామాజి కాంశాలతో పాటు విద్య, వైద్య, ఆరోగ్య, వైజ్ఞానిక అంశాలపై కూడా దృష్టి సారించారు. 'చుట్ట గాల్పు' 'గెలిసేతు' కవితలు పొగతాగుట హానికరం అనే ప్రకటన వలె పని చేస్తాయి. అంతే కాదు వైజ్ఞానిక అవగాహన కలిగిస్తాయి. **"పయిన బూడిది చేయు పట్టుదలయె కాని / చవి యుండునే జుట్ట జప్పరింప / ఆరోగ్యమునకు నిప్పంటించు కొనుటె పో / సిగరెట్టు కాల్చుట చిన్న పనియె / శ్వాస కోశామయ శక్తులన్ పాటించు కొనుటెగా / తెగత్రావి ముక్కుతో పొగవిడుచుట / దొండపండు బొల్పదవుల నుండ నీక / కాకి ముక్కుతో గమ్మరి కారు మొనల / తోడ వియ్యంబు లందుంచు వీడరాని / చుట్టరికము గల్పించుటె చుట్ట బీల్చు"** అలాగే 'గెలి సేతు' కవిత ప్రారంభంలో **"పైస బూడిద సేయు ఫర్మాయుషీ చుట్ట / గాల్ప దబ్బేతయో కాల్పవలె నూరు"** కవితలోని వ్యంగ్య వైభవం అర్థం చేసుకుని ఆనందించాల్సిందే!

భక్తి భావనలో పూర్తిగా మునిగిపోయిన కవి, సంప్రదాయవాది, ఆచారాలు బాగా పాటించే కుటుంబ నేపథ్యంలోంచి ఎదిగి, తెలుగు భాషపై పట్టు సాధించి పద్యకవితను పరుగులు పెట్టించిన వారు వరదాచార్యులు. తన చట్రంలోంచి ఒక్కసారిగా బయటపడి ప్రగతిశీల భావజాలంతో సామాజిక, వైజ్ఞానిక, ఆరోగ్య విషయాలు తడుముతూ కవిత చెప్పారు. 1912లో పుట్టిన వానమామలై రజాకార్ల అఘాయిత్యాలు జరిగిన దశలో సుమారు ముప్పయ్యేళ్ళ యువకుడు. ఆయన నిజాం ప్రభుత్వంలోని అవలక్షణాల్ని ఎండగట్టక ఎలా ఉంటారూ? "నిజాం రాష్ట్రపు బీద వెట్టివాడు" అనే కవితలో ఆయన ఆనాటి వెట్టి చాకిరిని నిర్ద్వంతంగా నిరసించారు.



"కరకు తురక యాఫీసర్ల కాళలందు / బడుచు వంగి సలామని వాకొనుచును / పొట్టకేమి లేకయు వారి తిట్టుల బడి / వెలయుదే నయిజాం బీద వెట్టివాడ!" మరో చోట అంటారు.. **"కందు యే యవయవమున గానరాక / నేడు నెత్తురు బొట్టుల నీవెత్రావి"** అని వెట్టి పని చేసేవాడి త్యాగాన్ని ఎత్తి చూపుతారు. కవిత చివరలో మరో చోట నిరంతరం పనిలో నిమగ్నమై ఉండే అతను ఇంట్లో భార్యాపిల్లలకు బంధువు వలె కనిపిస్తాడట! **"బత్తెమును జీవితమును లేని బంటు వగుచు / బతికి ఉన్నంత కాలము బానిసవై / ఆలు బిడ్డలకు బందుగువోలె నుండి / నీ గృహస్థతా ధర్మము నెఱపునట్టి / వీరుడా! నయిజాం బీద వెట్టివాడ"** బాధ్యత గల ఏ కవైనా తన చుట్టూ జరుగుతున్న అరాచకాల్ని ఎండగట్టక మానడు. ఎంత సంప్రదాయవాదైనా వానమామలై సామాజిక కాంశాల విషయానికి వచ్చేసరికి తీవ్రంగా స్పందించిన తీరు ఈ తరానికి, ముందు తరాలకూ ఆదర్శప్రాయమవుతుంది.

యాదృచ్ఛికంగా వరదా చార్యులు కూడా చాలా కాలం మిత్రులకు కనబడలేదు. హైదరాబాదు, కోఠిలోని శ్రీకృష్ణదేవరాయ భాషా నిలయంలో సాహిత్య సభ జరుగుతూ ఉంటే అనూహ్యంగా ఆయన అక్కడ ప్రత్యక్షమయ్యారట! కొందరు మిత్రులు ఎదురెళ్ళి "మీరు కూడా పోయారనే అనుకున్నాం" అని అన్నారట! అప్పుడు వానమామలై "నేను పోతనా?" అని అన్నారట. అంటే అందరిలాగా నేను బెజవాడ పారిపోతానా పోను - అని అర్థం! అప్పటి నుండి 'పోతన' నామం మరింత బలపడింది అని చెపుతారు. ఒక సంప్రదాయ కవి హేతువాదం వైపు నిలబడినందుకు మనం సంతోషించాలి!

అలాగే మరొక సామాజిక దురాచారాన్ని తీసుకుని "వితంతు బాలిక" రాశారు. ఇదీ గొప్ప కవితే! గురజాడ అప్పారావు 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' కవిత్వ స్థాయి దీనికి ఉంది. అంతటి గుర్తింపు దీనికి రావాల్సింది. బాల్య వివాహాల్ని నిరసిస్తూ, బాల్య వితంతువుల దుర్భరమైన జీవితాన్ని కళ్ళకు కట్టించారు. అది మంగళసూత్రమో ఉరితాడో తెలియని వయసు. వారు బ్రాహ్మణులో దొంగలో తెలియదు. అవి మంత్రాలో తిట్లో తెలియదు. ఏదీ తెలియని ఆ చంటిపాపకు 'ముండా' అని ముద్రవేసి ఎందుకు చంపుతారూ? అని ఆక్రోషించాడు కవి. **"బట్ట విడిచి వైచి బరిమేన తిరిగెడి / చంటిపోరికేమి సకల శాస్త్ర / సారవేత్తలైన మీరలుపెండిలి / సేయుటేమి చాల సిగ్గు సిగ్గు"** అని ఆగ్రహించారు. అక్రమ సంతానాన్ని ఫుట్‌పాత్‌లపై విడిచి వెళ్ళడం, పసికూనల్ని పెంట దిబ్బలపై పారేసి పోవడం ఈ రోజుల్లో చూస్తున్నాం గానీ, ఈ కవి ఒక అర్థ శతాబ్ది క్రితమే ఈ పద్యం చెప్పారు. **"కొందఱో అంకుటాంద్రయి కులములోనే బయట పడకుండ చాటు గర్భముల నెన్నొ /కడకు దిగద్రాలియో లేక కన్న బిడ్డల / పిసికి పాతిపెట్టుట లేని వినబడవొకొ?"**

సంప్రదాయ పద్య కవిత్వం రాసిన కవి, అందులోంచి బయటపడి పురోగమన పథంలో వచన కవిత్వం కూడా రాయగలగడం హర్షించదగింది. కాలంతో పాటు నడవని మహా కవులు మనకు ఉన్నారు. వారితో పోలిస్తే వానమామలై ఎంతో నయం కదా? పోతనపై కావ్యం రాసినందుకు ఆయన 'అభినవ పోతన' అయ్యారు. రజాకార్ల బాధలు పడలేక చాలా మంది ఆరోజుల్లో బెజవాడ (విజయవాడ) వెళ్ళి తలదాచుకున్నారు. యాదృచ్ఛికంగా వరదా చార్యులు కూడా చాలా కాలం మిత్రులకు కనబడలేదు. హైదరాబాదు, కోఠిలోని శ్రీకృష్ణదేవరాయ భాషా నిలయంలో సాహిత్య సభ జరుగుతూ ఉంటే అనూహ్యంగా ఆయన అక్కడ ప్రత్యక్షమయ్యారట! కొందరు మిత్రులు ఎదురెళ్ళి "మీరు కూడా పోయారనే అనుకున్నాం" అని అన్నారట! అప్పుడు వానమామలై "నేను పోతనా?" అని అన్నారట. అంటే అందరిలాగా నేను బెజవాడ పారి పోతానా పోను – అని అర్థం! అప్పటి నుండి 'పోతన' నామం మరింత బలపడింది అని చెపుతారు. ఒక సంప్రదాయ కవి హేతువాదం వైపు నిలబడినందుకు మనం సంతోషించాలి!

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



కేంద్ర విధానాలతో విద్యుత్ భారాలు


(నిన్నటి సంచిక తరువాయి)

బొగ్గు దిగుమతులు, పునరుత్పాదక ఇంధన వనరుల భారం

మోడీ సర్కార్ ఆరు శాతం వరకు విదేశీ బొగ్గును స్వదేశీ బొగ్గుతో కలిపి విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని చెప్పింది. విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ గత జనవరిలో విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి తోడు వాటి అవసరాలలో 10 నుండి 15శాతం వరకు స్వదేశీ బొగ్గును రైలు – రోడ్ – రైలు పద్ధతిలో రవాణా చేసుకోవాలని కూడా గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలను, ఎన్టీపీసీని ఆదేశించింది. దీనివల్ల బొగ్గు రవాణా ఖర్చులు, రైల్వే యార్డులు, షిప్‌యార్డ్‌లో బొగ్గును దించటం, మళ్ళీ ఎక్కించటం, తదితర అనవసర ఖర్చులు తడిచి మోపెడవుతాయి. థర్మల్ విద్యుత్ ఛార్జీలు పెరుగుతాయి. ఆయా విద్యుత్ ఉత్పత్తి సంస్థలు వాటి ప్రాజెక్టులకు కేటాయించ బడిన బొగ్గును సాధ్యమైన మేరకు త్వరితంగా, తక్కువ ఖర్చుతో రవాణా చేసుకునే మార్గాలను ఎంచుకోకుండా మోడీ ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎందుకు నిర్దేశించి నట్లు? అదానీ హస్తగతమైన ఓడ రేవులకు వ్యాపారం కోసం మోడీ ప్రభుత్వం ఈ తుగ్లక్ నిర్ణయం తీసుకుంది. తమ ఆదేశాన్ని పాటించకపోతే, అవసరమైన రైల్వే వ్యాగన్లను బొగ్గు రవాణాకు కేటాయించ బోమని కూడా కేంద్రం బెదిరిస్తున్నది.

డిస్కాములు వినియోగ దారులకు సరఫరా చేసే విద్యుత్లో కనీసం ఎంతశాతం మేరకు పునరుత్పత్తి అయ్యే విద్యుత్‌ను (సౌర, పవన, ఇతర సాంప్రదాయేతర విద్యుత్) కొనుగోలు చేసితీరాలో కేంద్రం నిర్దేశిస్తున్నది. విద్యుత్ నియంత్రణ కమిషన్లు ఇందుకు రెన్యూవబుల్ పవర్ పర్చేస్ ఆబ్లిగేషన్ (ఆర్‌పీఆర్ఓ) ఉత్తర్వులను నియతకాలికంగా జారీ చేస్తూ, డిస్కాములు కనీసం ఎంత శాతం మేరకు ఆర్‌ఈని కొనుగోలు చేయాలో నిర్దేశిస్తున్నాయి. అధికంగా ఉన్న ఆ కనీస శాతానికి మించి కూడా రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌ఈ కొనుగోలుకు డిస్కాములతో దీర్ఘకాలిక పీపీఎలు చేయిస్తున్నాయి. వీటికి రెగ్యులేటరీ కమిషన్లు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేస్తున్నాయి. ఎన్టీపీసీకి చెందిన వ్యాపార విభాగం ఎన్‌వీవీఎల్, ఎస్‌ఈసీఐ వంటి సంస్థల ద్వారా ఆశ్రిత పెట్టుబడి దారుల సౌర విద్యుత్ ప్రాజెక్టుల నుండి విద్యుత్‌ను కొనుగోలు చేయించి, రాష్ట్రాల డిస్కాములకు కేంద్రం అమ్మిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వార్థ ప్రయోజనాలకు ఆ విద్యుత్ కొనుగోలుకు దీర్ఘకాలిక పీపీఎలు చేయించి, కమిషన్ల ఆమోదం పొందు తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుమ్మక్కుతో, ఇలా అవసరానికి మించి విచక్షణా రహితంగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేయిస్తున్నందున వినియోగ దారులపై విపరీత భారాలు పడుతున్నాయి. ఆర్‌ఈని తప్పని సరిగా కొనుగోలు చేసితీరాలన్న నిబంధన అవసరం లేకపోయినా కొనితీరేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించాలని ఆదేశించి, ఆ ప్రాజెక్టులకు ఆ మేరకు స్థిరచార్జీలను డిస్కాములు చెల్లించాల్సి వస్తున్నది. ఆ విధంగా, అవసరంలేని ఆర్‌ఈ కొనుగోలుకు అధిక చార్జీలు చెల్లిస్తూ, మరోపక్క, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు ఉత్పత్తి తగ్గించినందుకు స్థిరఛార్జీల చెల్లింపు రూపంలో వినియోగ దారులపై రెండు విధాలుగా భారాలు మోపుతున్నాయి. ఆర్‌ఈ పీక్ డిమాండ్‌ను తీర్చలేదు గనుక, ఒక పక్క భారీగా మిగులు విద్యుత్ ఉన్నా, డిస్కామ్లు ఎక్స్ఛేంజీల ద్వారా అధిక ధరలకు అదనంగా విద్యుత్ కొనుగోలు చేయాల్సి వస్తున్నది. ఆర్‌ఈ కొనుగోలువల్ల తమకు ఏడాదికి రూ.5వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లుతున్నదని, ఆర్‌ఈ కొనుగోలు కోసమే తగ్గిస్తున్న ఉత్పత్తిలో 90 నుండి 95శాతం మేరకు థర్మల్ విద్యుత్ ఉంటున్నదని, ఏపీ డిస్కామ్లు పలుమార్లు ఏపీఈఆర్‌సికి నివేదించాయి. 2022-23 సంవత్సరానికి తెలంగాణ డిస్కామ్లు 5159 మిలియన్ యూనిట్లను ఎక్స్ఛేంజీల ద్వారా కొన్నాయి. తెలంగాణ డిస్కాములు 2023-24 సంవత్సరానికి ప్రతిపాదించిన విద్యుత్ విక్రయాలు 62970 మిలియన్ యూనిట్లను ఆర్‌ఈ లభ్యత 17375, 27.59శాతం అవుతుంది. అదే సంవత్సరానికి 13441 ఎంయూ మిగులు విద్యుత్ లభ్యతను చూపుతూ, ఆర్‌ఈని అనవసరంగా కొనటంవల్ల వినియోగదారులపై నివారించదగిన భారాలు పైన వివరించిన విధంగా పడుతూనే ఉంటాయి. ఇలాంటి భారాలన్నీ విద్యుత్ ఛార్జీల పెంపు, ట్రూ-అప్ ఛార్జీల రూపంలో పడుతున్నాయి.

-ఎం వేణుగోపాలరావు



ఛాందసం సింహాసనమెక్కి
శాసనాలు లిఖిస్తోంది
మిత్రమా..
మాట మౌనమవ్వాలట
పాట జోల పాడాలట.
శబ్దం నిశ్శబ్దమై ఉన్మాద నినాదమవ్వాలట.
రాతలు గీతలు చేతులు
ముడుచుకు కూర్చోవాలట.

కలల శిశువులకు జన్మనిచ్చే
కన్నులు వెన్నులు వంచాలట.
వెలుగు దారులకై పరుగులు తీసే
కాళ్ళు... సంకెళ్ల చెప్పులు తొడగాలట.

"ఒకటికి" మాత్రమే కిరీటం పెట్టాలట.
ఒక్కడికే పట్టాభిషేకం చేయాలట.
భిన్నత్వం వైవిధ్యం ధ్వంసం కావాలట.
సనాతన సంస్కృతి నిర్మితమవ్వాలట.

మనువు అంగాలు మన జన్మస్థానాలట
తరాలు మోస్తున్న అంతరాలు కర్మ ఫలాలట.
అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అరువు తెచ్చిందట
అది నిత్యం భరతమాత పరువు తీస్తున్నదట.

కార్పొరేటుతో చుట్టరికం కలుపుకొని
రాజ్యం మౌఢ్యం దోస్తులయ్యాయి.
గనులు మణులు వనరులు... చివరికి
నింగీ నేల వారికి ఆస్తులయ్యాయి
జాతి సంపదను అమ్మకానికి పెట్టి
దేశానికి అడ్డ నిలువుల పంగనామం పెట్టి
దొంగ కొంగ జపం చేస్తున్నాయి.

రాష్ట్ర రాష్ట్రాన రబ్బరుస్టాంపుల రాజకీయాలు
కేడీలు ఈడీలు మూలవాసిపై మూకదాడులు
వీధివీధిన గోడీ మీడియాలు సీబీఐ ఐడియాలు
ప్రశ్న విధ్వంసం ప్రజాస్వామ్యం అపహాస్యం.

ఈవైపు శిఖరమెత్తు సంపద పోగులు,
ఆ వైపు ఇంకా సరిపడా నిండని
శ్రమ జీవుల పేగులు
కుహనా భక్తి, దేశభక్తి నిస్సిగ్గుగా
నాకుతుంటే నల్ల చట్టాల బూట్లు
బందిపోట్లై కార్పొరేట్ ఖజానాకు
పెడుతున్నరు తూట్లు

మిత్రమా..
ఛాందసం చెలరేగిపోతున్న తరుణంలో
రణం ఆపి...చేతులు ముడుచుకు కూర్చుంటే
ప్రశ్న ప్రమాదంలోకే... బ్రతుకు అగాధంలోకే

అందుకే.. అందుకే..
ఊపిరి పీల్చుకుందాం. ఊరిని కలుసుకుందాం
రచ్చబండ కాడ చైతన్య కాగడా వెలిగిద్దాం
ఫాసిస్టు పోకడలపై పోరు జేయ కదులుతున్న
"జన చైతన్య యాత్ర"కు స్వాగతం పలుకుదాం..
'జన చైతన్య యాత్ర'కు స్వాగతం పలుకుదాం...

(ఈ నెల 17 నుంచి 29 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న "జన చైతన్య యాత్ర"లకు సంఘీభావంగా...)

- బండారు రమేష్


భూమి, భుక్తి, విముక్తి ధీరుడు కామ్రేడ్ ధానునాయక్

ఆ పోరాటం దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించబడిన ఘట్టం. ఆనాటి భూస్వాముల వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ప్రజా విముక్తి కోసం, దున్నే వాడికి భూమి కావాలనే నినాదంతో జరిగిన మహత్తరమైన పోరు. అదే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా భూస్వాములు, రజకార్ల ఆగడాలను ఎండకట్టడమే ఏకైక లక్ష్యంగా సాగిన ఉద్యమం. ఆ పోరులో నాలుగు వేల ప్రాణాల బలిదానం, మూడు వేల గ్రామాల స్వరాజ్యం, పన్నెండు లక్షల ఎకరాల భూ పంపిణీ. ఇది ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర. ఈ విప్లవ కార్యాచరణలో భాగ స్వాములైన వారు, ప్రజల కోసం ప్రాణత్యాగాలు చేసినవారు అనేకం. ఆ ఎర్ర సంద్రం నుంచి పుట్టిందే కామ్రేడ్ ధానునాయక్ కుటుంబం. నమ్ముకున్న పార్టీ కోసం, ఎర్రజెండా చైతన్యాన్ని ఇంటింటికీ, వాడ వాడకూ రెపరెపలాడించడంలో ఆ కుటుంబ సభ్యులంతా శత్రుమూకలకు బలయ్యారు.



ఎం. ధర్మానాయక్

అప్పటి నల్లగొండ జిల్లా జనగామ తాలూకా ధర్మపురం తండాలోని లంబాడీలకు ఉన్న 80 ఎకరాల మెట్ట 25 ఎకరాల మాగాని భూమిపై పుసుకూరు రాఘవరావు అనే జమీందారు కన్ను పడి స్వాధీనం చేసుకోచూశాడు. సంఘం నాయకత్వాన లంబాడీలు ఏకమై ప్రతిఘటించారు. పంటలను కాపాడుకోవడం వడిసెలను చేతబట్టి గుండాలను ఎదుర్కొన్నారు. తమ పొలాల్లో ఎర్రజెండాలను నాటారు. పొలం చుట్టూ కాపలా కాశారు. ఈ పోరాటానికి నాయకత్వం వహించింది ఎర్రజెండా అయితే సంఘానికి అండగా నిలిచింది కామ్రేడ్ ధానునాయక్ కుటుంబం. ఆంధ్ర మహాసభ జనగాం తాలూకాలో పార్టీని విస్తరింపచేయాలని నిర్ణయిస్తే తోడ్పాటునందించి, దేశ్‌ముఖ్ ఆగడాలకు వ్యతిరేకంగా నిలిచింది ధానునాయక్ కుటుంబం. అందుకే ఆ కుటుంబాన్ని తలుచుకుంటే చాలు శత్రువుకు గంగ వెర్రులెత్తేది. లంబాడీలను సర్వనాశనం చేయాలని శత్రువు ఎన్నోసార్లు ప్రయత్నించి విఫలయ్యాడు. స్థానిక నాయ కుడు మోహన్ రెడ్డిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో ఉంచినప్పుడు ఎక్కు పెట్టబడి ఉన్న పోలీస్ తుపాకులను కూడా లెక్క చేయకుండా పోలీసులను నిలదీసింది ఈ కుటుంబమే. 300మంది మిలిటరీ వీరి గ్రామంపై దాడి చేయ వచ్చినప్పుడు గ్రామ ప్రజలందరినీ కదిలించి వడిశాలతో మూడు గంటల పాటు సైన్యాన్ని అడుగు ముందు వేయకుండా చేసింది ఈ కుటుంబమే. కమ్యూనిస్టు పార్టీ కోసం పనిచేస్తున్న కుటుంబంలోని యువకులను వెంటాడి అంతం చేయాలని పోలీసులు, గుండాలు ఎన్నో ప్రయత్నాలు చేయగా చివరకు ధాను నాయక్ మూడో అన్న కామ్రేడ్ శంకర్ దొరికాడు. అతన్ని చిత్రహింసలకు గురిచేసి జైల్లోపెట్టారు. 1947 భువనగిరిలో పల్లేరుల గ్రామంలో పెద్దవాడైన కామ్రేడ్ జోద్యనాయక్‌ను పట్టుకుని అతన్ని కూడా జైలుకు పంపారు. రజాకార్లు వారి ఇంటిని రెండుసార్లు తగలబెట్టారు. ధాను నాయక్ రెండో అన్న కామ్రేడ్ సోమ్లను పట్టుకుని ఆయన చేతనే కట్టెలు పేర్పించి చితిమంటలో సజీవ దహనం చేశారు. కమ్యూనిస్టు ఆశయానికి బద్ధుడైన ఆయన చివరి క్షణాల్లో కూడా ఎర్రజెండాకు జై అంటూ అమరుడయ్యాడు. ఈ చితిలో రెడ్యా, బలరాం, చంద్రు, రాము కూడా ఉన్నారు. ఆయన ఆ కుటుంబం వెనకితగ్గకపోవడంతో మళ్ళీ వారి ఇంటిపై దాడి చేసి ఇద్దరు పసి పిల్లలను చంపేశారు. అయినప్పటికీ ఈ కుటుంబం ఎర్రజెండాను వదల్లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ కమ్యూనిస్టు ఆధ్వర్యాన ఏర్పాటైన దళాలకు రక్షణ ఇవ్వడం, వారికి తోడ్పాటునందించడంలో ముందునే నిలిచాడు ధానునాయక్. శత్రువులు ఆయన తండ్రి హము, తల్లి 80ఏండ్ల వృద్ధుల చేతులు విరగ్గొట్టినా



బెదరలేదు. వారికి ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీని కంటికి రెప్పలా చూసుకున్నారు. ధాను నాయక్ తమ్ముడు దర్గ్య నాయక్ దళ కమాండర్‌గా ప్రజలకు సేవలందించాడు. 1949 ఫిబ్రవరి 26న దర్గ్యను కూడా తీవ్రంగా చిత్ర హింసలు పెట్టి అరెస్టు చేసి మరణదండన విధించారు. పెద్దన్న జోద్య కుమారుడు పద్దెని మిది సంవత్సరాల కిషన్‌ను కూడా జైల్లో పెట్టారు. భారత సైన్యాలు

భారత సైన్యాలు ప్రవేశించిన క్షణం నుండి కామ్రేడ్ ధాను కోసం అతన్ని సజీవంగా పట్టుకునేందుకు సైన్యం చేయని ప్రయత్నం చేయలేదు. వెతకని చోటులేదు. అయితే ఏడాది వరకు అతడు శత్రువులకు చిక్కలేదు. కానీ చివరకు ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం వల్ల 1950 మార్చి 20న ముండ్రాయి గ్రామంలో పట్టుకున్నారు. పార్టీ రహస్యాల కోసం ఆయన్ను అనేక రకాల చిత్రహింసలు పెట్టినా ఆయన నోరు విప్పలేదు. అతని మొండితనం, ధైర్యం సైన్యాధికారులకు కూడా అద్భుతం అనిపించింది వారతన్ని చంపేందుకు నిరాకరించారు. చివరకు రామవరం దేశ్‌ముఖ్ కటారు నరసింగరావు అతన్ని బండికి కట్టించి చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు.

ప్రవేశించిన క్షణం నుండి కామ్రేడ్ ధాను కోసం అతన్ని సజీవంగా పట్టుకునేందుకు సైన్యం చేయని ప్రయత్నం లేదు. వెతకని చోటులేదు. అయితే ఏడాది వరకు అతడు శత్రువులకు చిక్కలేదు. కానీ చివరకు ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం వల్ల 1950 మార్చి 20న ముండ్రాయి గ్రామంలో పట్టుకున్నారు. పార్టీ రహస్యాల కోసం ఆయన్ను అనేక రకాల చిత్రహింసలు పెట్టినా ఆయన నోరు విప్పలేదు. అతని మొండితనం, ధైర్యం సైన్యాధికారులకు కూడా అద్భుతం అనిపించింది వారతన్ని చంపేందుకు నిరాకరించారు. చివరకు రామవరం దేశ్‌ముఖ్ కటారు నరసింగరావు అతన్ని బండికి కట్టించి చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు. ధాను నాయక్ వీరమరణం పొందుతూ కూడా కమ్యూనిస్టు పార్టీ వర్ధిల్లాలి, ఎర్రజెండా జిందాబాద్, పేదల రాజ్యం వర్ధిల్లాలి అంటూ చేసినా నినాదాలు శత్రువుల్ని కూడా భయపెట్టాయి. లంబాడీ కుటుంబంలో పుట్టి భూస్వాములను ఎదిరించి భూమి, భుక్తి, విముక్తి కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన ధానునాయక్ కుటుంబం పేద ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయమే.

(మార్చి 20న కామ్రేడ్ ధానునాయక్ 73వ వర్థంతి)

సెల్:9490098685



వాణి దేవులపల్లి... చిన్నతనం నుండి సాహిత్య వాతావరణంలో పెరిగాను. దాంతో చదవడం, రాయడం తన దిన చర్యలో భాగమయింది. తన అక్షరాలు సమాజంలో కొంతైనా మార్పు తీసుకొస్తాయనే నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. జ్ఞాపకాల చేద బొక్కెనతో జాతియ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. ఫ్యూడల్ వ్యవస్థలో స్త్రీ ఆర్థిక స్వాలంభన తోనే పురుషాధిక్య సమాజాన్ని విజయ వంతంగా ఎదుర్కోగలదని అంటున్న ఆమె పరిచయం నేటి **మానవి**లో...

సాహిత్యంతో సమాజ పురోగమనం

మా ఊరు వంగపహాడ్, వరంగల్ జిల్లా. తాతయ్య వేంకట పాపారావు, నాయనమ్మ సామ్రాజ్యలక్ష్మి, ఒద్దిరాజు సోదరులలో ఒకరైన ఒద్దిరాజు రాఘవ రంగారావు గారి కుమార్తె. దేవులపల్లి రామానుజరావుగారు మా చిన్నతాత. వారి ఇల్లు మా ఇంటి ఎదురుగానే ఉండేది. మా అమ్మ వెంకట లక్ష్మి, నాన్న గోపాల్ కిషన్ రావు. నా ప్రాథమిక విద్యాభ్యాసం మా ఊరిలో, హైస్కూల్ చదువు మా ఊరికి అయిదు మైళ్ళ దూరంలో ఉన్న పక్క ఊరు దామెరలో పూర్తి చేశాను. ఇంటర్ వరంగల్‌లో, డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో, పీజీ, పీహెచ్‌డీ కాకతీయ యూనివర్సిటీలో చేశాను.

చదవడం ఇష్టంగా మారింది

మాది ఉమ్మడి కుటుంబం. తాతగారు జమీందారు. ఊళ్ళో ఏ సమస్య వచ్చినా ఆయనే పరిష్కరించేవారు. చాలా మానవీయ దృక్పథం కల వాడిగా పేరుపొందారు. మా అమ్మకు పుస్తకాలు చదివే అలవాటు. బాపు (నాన్న) అన్ని రకాల దినపత్రికలు, ఆంగ్ల సాహిత్యం, రాజకీయ పత్రికలు తెప్పించేవారు. దాంతో నాకూ చిన్నప్పటి నుండే పుస్తకాలు చదివే అలవాటు ఇష్టంగా మారింది. మొట్టమొదటి సారి నేను అయిదవ తరగతిలో ఉన్నప్పుడు ఓ పత్రికలో నేను రాసిన ఒక జోక్ అచ్చయింది. తర్వాత కొన్ని వ్యాసాలు కూడా అచ్చయ్యాయి.



స్కూల్లో వ్యాస రచన, పాటలు, ఆటల పోటీల్లో నాదే ప్రథమ స్థానం. దామెర స్కూల్లో ప్రతి రోజూ ఆంగ్ల వార్తలు చదవడం మా బాపు ఆలోచనతో నేనే మొదలుపెట్టాను. హెడ్మాస్టర్, టీచర్‌లందరూ ప్రశంసించేవారు. డిగ్రీలో కవిత్వం, కథలు, వక్తృత్వ పోటీలలో ప్రథమ బహుమతులు అందుకున్నాను. సోషియాలజీ మాది ఫస్ట్ బాచ్ యూనివర్సిటీలో. అందులో నేను యూనివర్సిటీ టాప్ రావడం, మా రాములు సార్ ప్రత్యేకంగా బహుమతివ్వడం మర్చిపోలేని జ్ఞాపకం.

జ్ఞాపకాల చేద బొక్కెన

చిన్నప్పటి నుండే రాస్తున్నప్పటికీ నా మొదటి కవితా సంపుటి 'జ్ఞాపకాల చేద బొక్కెన' 2016లో వచ్చింది. ఇది నాకు జాతీయ స్థాయిలో పేరు తెచ్చింది. 2017లో ఓ పత్రికలో వచ్చిన నా 'సంపెంగల యాసంగి' కవిత చదివి స్వయానా ముఖ్య మంత్రిగారు ఫోన్ చేసి అభినందించడం ఓ గొప్ప అవార్డు. మాటలకందని అనుభూతి. ఇప్పటివరకు దాదాపు 200 వరకు కవితలు రాసాను. అలాగే 'అస్తిత్వ పరిమళాలు' (వ్యాస సంపుటి), విజయ్ టెండుల్కర్ పైన ఆంగ్ల పరిశోధనా గ్రంథం వచ్చింది.

తృప్తిగా ఉండేది

1990 నుండి వివిధ జూనియర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో పని చేశాను. 1993లో నాకు వివాహమయింది. మా వారు ప్రభాకర్ రావు, ఆంధ్రా బ్యాంక్ మేనేజర్‌గా రిటైర్ అయ్యారు. మా బాబు భరద్వాజ్, అమెరికాలో ఉన్నత విద్య పూర్తి చేసి ఇటీవలే ఉద్యోగంలో చేరాడు. కుటుంబ సహకారంతోనే ఉద్యోగమైనా, రచనలైనా చేయగలుగుతున్నాను. మా వారు నేను రాసుకోవాలనుకుంటే అవసరమైన పనులన్నీ చేసి పెడతారు. ఇకపోతే అనుక్షణం నా రచనల గూర్చి అడుగుతూ నన్ను ప్రోత్స హిస్తూ, నా రచనలకు మొదటి శ్రోత గా ఉంటాడు మా బాబు ఇంట్లో ఎంత పని చేసినప్పటికీ కాలేజీలో చెప్పి వచ్చే క్లాస్‌లతో ఎనర్జిటిక్‌గా ఫీలయ్యేదాన్ని. సామాజిక ఉత్పాద కతలో నేనూ భాగస్వామిని అను కుంటే ఎంతో తృప్తిగా ఉండేది.

ఖాళీగా ఉండలేక


ఇంజనీరింగ్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తూనే పీహెచ్‌డీ ఎంట్రన్స్ రాసి ఫస్ట్ ప్లేస్‌లో నిలిచాను. చాలెంజింగ్ గా తీసుకుని మూడేండ్లల్లో పరి శోధన పూర్తి చేసాను. కానీ ఉద్యోగం చెయ్యాలన్న నా కల కలగానే మిగిలిపోయింది. నా పీజీ అయినప్పటి నుండి జాబ్ నోటిఫికేషన్స్ లేవు. ప్రభుత్వ ఉద్యోగాలు లేవు. ఇన్నేండ్లు ప్రైవేట్ కాలేజీల్లోనే పని చేసాను. కార్పొరేట్ కాలేజీల గురించి తెల్సిందే కదా... పని ఎక్కువ. వేతనం తక్కువ. అయినప్పటికీ ఇంత చదువుకొని ఖాళీగా ఉండలేక కంటిన్యూ చేసాను. ఇటు రాత్రిళ్ళు కూర్చుని చదవడం, రాయడం ద్వారా సాహితీ ప్రపంచానికి దగ్గరయ్యాను. అడ్డంకులను అధిగమిస్తూ ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాను.

సాహితీ సేద్యమే చేస్తున్నాను


పెళ్లి కాక ముందునుండే ఉద్యోగం చేస్తున్నప్పటికీ పెళ్లయ్యాక ఉద్యోగం, ఇల్లును సమన్వయం చేసుకోవడంలో అనేక సవాళ్లు ఎదుర్కొన్నాను. ఇంట్లో అత్తగారు నుండి సహకారం ఆశించలేని పరిస్థితి. ఆవిడకు ఆరోగ్యం బాగోదు. కుటుంబ బాధ్యతలతో, బంధువులతో ఇల్లు ఎప్పుడూ రణగొణ ధ్వనులతో ఉండేది. ఇటున్న పుల్ల అటు పెట్టే వారు లేక పని భారంతో ఒత్తిడికి గురయ్యేదాన్ని. దాంతో ప్రస్తుతం ఉద్యోగం చెయ్యడం లేదు. సాహితీ సేద్యమే చేస్తున్నాను.

పేరు తెచ్చిన కథలు

కవితలు వ్యాసాలతో పాటు సుమారు 20 కథల వరకు రాశాను. అందులో గురవయ్య సారు కానిగీ బడి, సిల్కు చీర, నుమాయిష్, రాగ బంధాలు, క్షమయా ధరిత్రి, ఇసు ర్రాయి, అర్ర, బంగారు జడ కుప్పెలు, ఉన్నది ఒకటే జీవితం, తప్యాల చెక్క, పనిమనిషి మొదలైన కథలు నాకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. కొన్ని కథలు బహుమతి, పురస్కారాలు అందుకున్నాయి. అలాగే డా. మూడ నాగభూషణ గుప్త పురస్కారం, లక్ష్మీ నారాయణ జైనీ కవి పురస్కారం, సత్కారం, తెలంగాణ రాష్ట్రం గూర్చి రాసిన పాటకు ద్వితీయ పురస్కారం వీటితో పాటు అనేక సత్కారాలు పొందాను.







– సలీమ

ఫ్యూడల్ వ్యవస్థ వేళ్లూనుకున్న సమాజంలో ఓమహిళగా చాలా కష్టాలే పడ్డాను. కేవలం విద్య వల్లనే కాక, స్త్రీలకు ఆర్థిక స్వావలంబన ఉంటేనే ఈ పురుషాధిక్య సమాజంలో వివక్షతను సమర్థంగా ఎదుర్కోవచ్చని నా అభిప్రాయం.

వివక్షను ఎదుర్కోవచ్చు

రచయితల సంఘాలలో కూడా పురుషుల ఆధిక్యత కొనసాగడం బాధాకరం. సామాజిక విలువలతో కూడుకున్న సాహిత్యం మంచి ప్రభావాన్ని చూపి, సమాజ పురోగమనానికి దారితీస్తుంది. అదే విలువలు లోపించిన సాహిత్యం చెడు ప్రభావంతో సమాజ తిరోగమనానికి కారణ మవుతుందని నా బలమైన అభిప్రాయం. అయితే సంక్లిష్ట పరిస్థితులను కూడా జయించాను. నాకిది మా అమ్మా నాన్నల నుండి వచ్చింది. వాళ్ళు అంతే. చివరగా ఒక్క మాట "ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక" లాగ నా రచనల ద్వారా సమాజంలో లేదా ఓ వ్యక్తిలో చిన్న మార్పు చోటుచేసుకున్నా చాలనుకుంటున్నాను.

ఉత్సాహంగా గడిపేద్దాం

రోజూ 'అప్పుడే తెల్లారిందా..' అనుకుంటూ లేవడమేనా? అలాకాకుండా ఉల్లాసంగా నిద్రలేచి.. అంతే ఉత్సాహంగా రోజంతా గడిపేయాలనుందా! అయితే ఈ చిన్ని మార్పులు చేసుకోమంటున్నారు నిపుణులు.



- ఆరోగ్యకరమైన జీవనశైలిలో నిద్రది ప్రధాన పాత్ర. కాబట్టి 7 గంటల నిద్ర.. నియమం పెట్టుకోండి. అలాగని నచ్చిన వేళలను ఎంచుకోవద్దు. రోజూ ఒకే సమయానికి పడుకోవడం లేవడం చేయాలి. అప్పుడే శరీరానికీ ఆరోగ్యకరమైన శైలి అలవాట వుతుంది. పడుకొనే ప్రదేశమూ నీట్‌గా ఉండాలి. తరచూ పక్క, కప్పుకొనే దుప్పట్లు, దిండు గలీబులు మారుస్తూ ఉండండి. సుఖనిద్ర ఖాయం.
- పడుకోవడానికి గంట ముందు గ్యాడ్జెట్లను దూరంగా ఉంచండి. వాటి నుంచి వెలువడే నీలికాంతి నిద్రను దూరం చేస్తాయి. ఫలితమే లేచాక చిరాకు వంటివి. బదులుగా పుస్తకం చదవడమో, ఉల్లాసంగా సాగే మ్యూజిక్ వినడమో చేయండి. నాణ్య మైన నిద్రను చేరువ చేస్తాయివి.
- మరుసటి రోజు చేయాల్సినవి.. చిన్నా, పెద్దా అన్నీ ఒక జాబితాగా రాసి పెట్టుకోండి. ఆరోజు ఎలా గడవాలి అను కుంటున్నారన్నదీ పైన రాయండి. ఇవి పూర్తి చేయాలన్న ప్రేరణని ఇవ్వడమే కాదు.. ముందే ప్లాన్ చేసుకు న్నామన్న భావన సుఖనిద్రని ప్రసాదిస్తాయట. దీంతో ఉల్లాసంగా నిద్ర లేవొచ్చు.
- లేవగానే పనిలో పడిపోవద్దు. ఓ పావుగంట చల్లగాలికి నడక, చిన్నపాటి వ్యాయామం తప్పక చేయాలి. శరీరంతో పాటు మెదడు చురుగ్గా తయారవుతుంది. ఎంత తీరిక లేకుండా ఉన్నా దీన్ని తప్పక కొనసాగించాలి.
- తర్వాత చేద్దాంలే అన్న పద్ధతే సగం కంగారుకి మూలం. దేన్నీ వాయిదా వేయొద్దు. ముందు ఇది చేసి పక్కన పడేద్దాం అనుకుంటూ సాగండి. టెన్షన్ మీ దరి చేరదు. పూర్తిచేసిన పని మనసుకు తెలియకుండానే ప్రశాంతతను ఇస్తుంది. మీ రోజును ఇలా ప్లాన్ చేసుకోండి. ఉత్సాహంగా లేవడం ఖాయం.

ప్రతిపక్షాల భారీ మానవహారం



(మొదటిపేజీ తరువాయి)

సర్కార్, అదానీ అక్రమాలకు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. దీంతో పార్లమెంట్ ఆవరణం దద్దరిలింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, డీఎంకే ఎంపీ టిఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్ గోపాల్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, సీపీఐ(ఎం) ఎంపీలు ఎలమారం కరీం, ఎఎం ఆరీఫ్, సీపీఐ ఎంపీ బినయ్ విశ్వం, జేడీయూ ఎంపీ రాజీవ్ రంజన్ సింగ్, శివసేన (ఠాక్రే వర్గం) నేతలు ప్రియాంక చతుర్వేది, అరవింద్ సావంత్, బీఆర్ఎస్ ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరరావు, ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఆర్ఎల్‌డీ ఎంపీ జయంత్ చౌదరి, కేరళ కాంగ్రెస్ ఎంపీ మణితో సహా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం మల్లిఖార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ అదానీ విషయంలో విచారణకు జేపీసీ ఏర్పాటుచేయాలని ప్రతిపక్షాలన్నీ పట్టుబడుతుండటంతో.. ఆ అంశాన్ని పక్కదోవ పట్టించాలనే కుట్రతోనే బీజేపీ నాయకులంతా రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలంటూ కొత్త ఎత్తుగడ వేశారని విమర్శించారు. అదానీ గ్రూప్‌పై విచారణకు ప్రతిపక్షాలన్ని ఒకేతాటిపైకి వచ్చాయనీ, తన ప్రియ మిత్రుడు అదానీని కాపాడేందుకు ప్రధాని మోడీ ప్రయత్నించడం దురదృష్టక రమని ఎంపీ గౌరవ్ గొగోయ్ అన్నారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తడానికి ప్రతిపక్ష నేతలకు అనుమతి లేదనీ, తమ మైకులు ఆఫ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అంతకు ముందు ఖర్గే కార్యాయలయంలో ప్రతిపక్ష పార్టీల సమావేశం జరిగింది. కాంగ్రెస్, డీఎంకే, ఎన్సీపీ, ఎస్పీ, ఆప్, ఆర్‌జేడీ, బీఆర్ఎస్, సీపీఐ(ఎం), సీపీఐ, శివసేన (ఠాక్రే వర్గం), జేడీయూ, జేఎంఎం, ఎండీఎంకే, వీసీకే, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్, ఆర్ఎస్‌పీ సహా పలు ప్రతిపక్ష పార్టీల నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

స్తంభించిన పార్లమెంట్

అదానీ వ్యవహారం, రాహుల్ వ్యాఖ్యలపై పార్లమెంట్ స్తంభించింది. ఇదే అంశంపై పార్లమెంట్ ఉభయసభల్లోనూ అధికార, ప్రతిపక్షాలు ఆందోళన నాలుగో రోజు కూడా కొనసాగింది. అదానీ వ్యవహారంపై విచారణ చేపట్టేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటు చేయాలని ప్రతిపక్షసభ్యులు పట్టుపట్టగా.. లండన్ చేసిన వ్యాఖ్యల పై రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని అధికార బీజేపీ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఎలాంటి చర్చోపచర్చలు లేకుండానే ఉభయసభలు నేటికి (శుక్రవారం) వాయిదా పడ్డాయి.

దేశ వ్యతిరేక ప్రసంగం చేయలేదు

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంటు సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్తూ రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. "దేశానికి వ్యతిరేకంగా నేను ఏమీ మాట్లాడలేదు. ఒకవేళ నన్ను అనుమతిస్తే సభలో మాట్లాడతా. అవకాశం ఇవ్వకపోతే పార్లమెంట్ బయట మాట్లాడతా" అని తెలిపారు. పార్లమెంటు ముగిసిన తరువాత ఏఐసీసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. 'పార్లమెంటులో మాట్లాడేందుకు వారు నన్ను అనుమతిస్తే, నేను ఏమనుకుంటున్నానో అది చెబుతాను' అని అన్నారు. 'పార్లమెంటులో లోక్‌సభ స్పీకర్‌ను కలిశాను. ప్రభుత్వంలోని నలుగురు మంత్రులు నాపై ఆరోపణలు చేశారు. కాబట్టి నా అభిప్రాయాలను సభలో ఉంచే హక్కు నాకు ఉంది. శుక్రవారం పార్లమెంటులో మాట్లాడేందుకు అనుమతించాలని కోరారు. ఆయన అనుమతిస్తారని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం తాను ప్రధాని మోడీ, అధానిపై ప్రశ్నలు లేవనెత్తుతూ సభలో ప్రసంగించానని, ఆ ప్రసంగాన్ని తొలగించారని అన్నారు. ప్రభుత్వం, ప్రధానమంత్రి అదానీ సమస్యతో భయపడుతున్నారనీ, అందుకే వారు దృష్టి మల్లుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ, అదానీల మధ్య సంబంధం ఏంటన్నది ప్రధాన ప్రశ్న అని అన్నారు. 'పార్లమెంటులో తనపై ఆరోపణలు చేసినందున, మాట్లాడే అవకాశం పొందటం నా ప్రజాస్వామ్య హక్కు. ప్రజాస్వామ్యం పనిచేస్తుంటే నేను పార్లమెంటులో మాట్లాడగలిగేవాడిని. కాబట్టి, నిజానికి మీరు చూస్తున్నది ప్రజాస్వామ్యానికి పరీక్ష' అని పేర్కొన్నారు.

ఈడీ విచారణకు కవిత గైర్హాజరు

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థించాను. అయితే, నా అభ్యర్థనను తిరస్కరించారు' అని ఆమె లేఖలో పేర్కొన్నారు. ఈ అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని ఆమె ఈడీకి తెలియజేశారు.

మంత్రులు, న్యాయ నిపుణులతో భేటీ

ఈడీ విచారణ నేపథ్యంలో మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్ తదితరులు గురువారం ఢిల్లీకి చేరుకున్నారు. సీఎం కేసీఆర్ నివాసంలో మంత్రులు, న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపారు. ఎమ్మెల్సీ కవితపై ఈడీ అధికారులు అన్యాయంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆమె తరపు న్యాయవాది భరత్ అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం మహిళను ఇంటి వద్దే విచారించాలని తెలిపారు. కవితకు ఈడీ సమన్లపై సుప్రీంకోర్టులో తాము దాఖలు చేసిన పిటిషన్ ఈ నెల 24న విచారణకు రానుందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తదుపరి ఆదేశాల ప్రకారమే తాము ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

పిళ్లైకి నాలుగు రోజుల కస్టడి పొడిగింపు

ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న అరుణ్ రామచంద్ర పిళ్లై కస్టడి ముగియడంతో ఈడీ అధికారులు గురువారం రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ఈడీ వాదనలు వినిపిస్తు 'ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరికొందరితో కలిపి పిళ్లైని ప్రశ్నించాల్సి ఉంది. 20 రోజుల కస్టడిలో పిళ్ళై ముందు హెూటల్ రికార్డ్స్, పత్రాలు ఉంచి, విచారణ చేశాం. కొందరు నిందితులు, సాక్షులను కలిపి జరుపుతున్న విచారణ ఇంకా పూర్తి కాలేదు. అందుకని వారిని మరోసారి విచారణకు రావాలని ఆదేశించాం. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవిత గురువారం ఈడీ విచారణకు హాజరుకాలేదు. ఈ పరిస్థితుల్లో పిళ్లై కస్టడి ఐదు రోజులు పొడిగించాలి. పిళ్లై కస్టడీ పొడిగిస్తే శుక్రవారం బుచ్చిబాబుతో కలిసి ప్రశ్నిస్తాం" అని సీబీఐ ప్రత్యేక కోర్టును కోరింది. వాదనలు విన్న సీబీఐ ప్రత్యేక కోర్టు మరో నాలుగు రోజుల పాటు పిళ్లై కస్టడి పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ కేసులోనే వైసీపీ ఎంపి శ్రీనివాసుల రెడ్డికి నోటీసులు ఇచ్చినట్టు న్యాయస్థానానికి ఈడీ తెలిపింది. బెయిల్‌పై బయటున్న బుచ్చిబాబును విచారణకు రావాలని ఈడీ నోటీసులు ఇచ్చింది. దీంతో ఆయన 17న ఈడీ విచారణకు హాజరుకానున్నారు.

మతోన్మాదం దేశానికి విఘాతం

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలు, మతోన్మాదాన్ని రెచ్చగొట్టే పద్ధతిని ఎండగట్టడమే లక్ష్యంగా జనచైతన్య యాత్ర కొనసాగుతున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు తెలిపారు. శుక్రవారం నుంచి రాష్ట్రంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'జనచైతన్య యాత్ర' సాగుతున్న నేపథ్యంలో 'జయహెూ..జన చైతన్య యాత్ర' పాటల సీడీని గురువారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో డీజీ నర్సింహారావు, సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు టీ సాగర్, టి జ్యోతి, రాష్ట్ర నాయకులు ఆర్ శ్రీరాంనాయక్, పీఎన్ఎం అధ్యక్షులు ఆనంద్, నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, కోట రమేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీ నర్సింహారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మూడు బస్సుయాత్రలు సాగుతాయని చెప్పారు. వీటి ప్రారంభ సభలకు సీపీఐ(ఎం) జాతీయ నాయకులు హాజరవుతున్నారన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సామాజిక న్యాయం, ఫెడరల్ వ్యవస్థపై కేంద్రం దాడికి నిరసనగా ఈ యాత్రలను చేపడుతున్నామని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగనుందన్నారు. మొదటి యాత్ర శుక్రవారం వరంగల్‌లో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని చెప్పారు. ఈనెల 23న ఆదిలాబాద్‌లో రెండో యాత్రను ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవి రాఘవులు ప్రారంభం చేస్తారనీ, ఈనెల 24న నిజామాబాద్‌లో మూడో యాత్రను ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ ఎ విజయరాఘవన్ ప్రారంభిస్తారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని ప్రముఖ రచయితలు, కళాకారులతో సీడీని రూపొందించినట్టు తెలిపారు. 60మంది కళాకారులతో మూడు దళాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తమ కళా రూపాలు, పాటల ద్వారా కళాకారులు ప్రజల్ని చైతన్యపరుస్తారన్నారు.

నేటినుంచి సీపీఐ(ఎం) 'జనచైతన్య యాత్ర'

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే ముగింపు సభకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా బీజేపీ–ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్న మతోన్మాదం, కార్పొరేట్ అనుకూల విధానాలపై ప్రజలను అప్రమత్తం చేయడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగనుంది. రాజ్యాంగాన్ని రక్షిద్దాం, దేశాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లనుంది. ప్రజాస్వామ్యం, లౌకికత్వం, ఫెడరలిజం, సామాజిక న్యాయం పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగనుంది. రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్న బీజేపీ విధానాలను ప్రజల్లో ఎండగట్టి వారిలో చైతన్యం పెంపొదించడం కోసమే ఈ యాత్రను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ చేపడుతున్నది. గవర్నర్ వ్యవస్థ ద్వారా ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలే లక్ష్యంగా బీజేపీ వ్యవహరిస్తున్న తీరు దేశానికి ఎంత ప్రమాదకరమో ప్రజలను మత ప్రాతిపదికన విభజించి విద్వేషాలను రెచ్చగొట్టి పాలన సాగించడం వల్ల లౌకికత్వానికి ఎంతటి ముప్పో ఈ యాత్ర వివరించనుంది.

రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయడం, సీబీఐ, ఈడీ, ఐటీ, ఎన్ఐఏ వంటి వాటిని రాజకీయ ప్రయోజనాల కోసం ఎలా వాడుకుంటున్నదో ప్రజల్లోకి తీసుకెళ్తారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారు ప్రతిపక్ష నాయకులే లక్ష్యంగా దాడులు చేయడం, అరెస్టులకు పాల్పడడం గురించి ప్రస్తావిస్తుంది.

ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణతో రిజర్వేషన్లకు నష్టం

ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేసి కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా ఎలా అమ్ముతున్నదో, దానివల్ల దళితులు, వెనుకబడిన తరగతుల ప్రజలు రిజర్వేషన్లను ఎలా కోల్పోతారో, నిరుద్యోగులు ఉద్యోగాలను ఎలా నష్టపోతారో ఈ యాత్ర తెలియజేయనుంది. బీజేపీ–ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతం అయిన మనువాద భావజాలాన్ని చాతుర్వర్ణ వ్యవస్థను, కులవ్యవస్థను కొనసాగించడం కోసం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టనుంది. మనువాదం వల్ల ప్రమాదాలను, సామ్యవాదం వల్ల ప్రయోజనాలను ప్రజల ముందుంచనుంది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తోపాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వల్ల సామాన్యులు ఎంత సతమతమవుతున్నారో గుర్తు చేయనుంది. ప్రజాసంక్షేమానికి కోతలు పెడుతూ కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పించే మోడీ విధానాలను ప్రజలకు ఈ యాత్ర ద్వారా అర్థం గావించనుంది. వామపక్ష, అభ్యుదయ భావజాలం ఉన్న తెలంగాణలో ప్రజల ఐక్యతకు చిచ్చుపెట్టే బీజేపీ విభజన రాజకీయాల గుట్టు విప్పనుంది. ఇంకోవైపు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలనూ సీపీఐ(ఎం) నాయకులు ఈ యాత్రలో ప్రస్తావిస్తారు. ముఖ్యంగా ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇండ్లు, పోడు భూములకు పట్టాల వంటి సమస్యలపై ప్రజలను సంఘటితం చేసేలా ఈ యాత్ర కర్తవ్యాల్లో భాగంగా ముందుకు సాగనుంది. జనచైతన్య యాత్రలో నేతల ప్రసంగాలతోపాటు పది లక్షల కరపత్రాలు, రెండు లక్షల పోస్టర్లు, బుక్‌లెట్లు, ఆడియో, వీడియో సందేశాల ద్వారా బీజేపీ ప్రమాదం పట్ల ప్రజలను మేల్కొల్పడమే లక్ష్యంగా ఈ యాత్ర ముందుకెళ్లనుంది.

అకాల వడగండ్ల వర్షం

(మొదటిపేజీ తరువాయి)

సృష్టించింది. దాంతో పొట్ట కొచ్చిన వరి, నిమ్మ, మామిడి, బత్తాయి, తోటలకు తీవ్ర నష్టాన్ని చేకూర్చింది. నాంపల్లి మండలంలో వడగండ్ల వర్షానికి నివాస గృహాలపై ఉన్న సిమెంటు రేకులు పలుచోట్ల పగిలిపోగా కొన్నిచోట్ల గాలికి ఎగిరిపోయాయి. బత్తాయి, నిమ్మ, మామిడి, సపోటా తోటల్లో పిందెలు రాలిపోయి రైతులకు అపార నష్టం వాటిల్లింది. నివాస గృహంలోకి వరద నీరు ప్రవేశించి బియ్యం బస్తాలు, బట్టలు, ఎలక్ట్రికల్ సామగ్రి తడిసి ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. మర్రిగూడలో ఈ ఏడాది పత్తితో తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్న రైతులు, వడగండ్ల వాన తెచ్చిన నష్టాన్ని చూసి కన్నీరు మున్నీరవుతున్నారు. చెట్లు నేలకొరిగాయి. మిర్యాలగూడ పట్టణకేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో శ్రవణ్‌రెడ్డి ఇంట్లో పిడుగు పడటంతో షార్ట్‌సర్క్యూట్ అయి రూ.9లక్షల విలువగల ఫర్నీచర్ దగ్ధమైంది. పెద్దవూర మండలంలో కల్లాల్లో ఎండబెట్టిన మిర్చి తడిసిపోయినట్టు తెలుస్తోంది. చేతికి వచ్చిన మిర్చి పంటను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. రైతులకు సమయానికి పట్టాలు లేకపోవడంతో మిర్చి తడిసిపోయిందని ఆందోళన చెందుతున్నారు.మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వడగళ్ళ వానతో చేతికొచ్చిన పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసి ముద్దయింది. రూ.లక్షలు అప్పులు చేసి పంటలకు పెట్టుబడి పెట్టుకోగా ఆకాల వర్షంతో రైతులు పంటలు తీవ్రంగా నష్టపోయారు. జయశంకర్–భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు, గణపురం మండల్లాలోని పలు గ్రామాల్లో మిర్చి పంట తడిసి ముద్దయింది. సుమారు రెండు గంటలపాటు కురిసిన వర్షానికి రహదారులు, మురికి కాల్వలు పొంగిపొర్లాయి. మామిడి తోటలో కాయలు నేల రాలిపోయాయి.


ఖమ్మం జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షానికి రోడ్లు, వాగులు, డ్రయినేజీలు పొంగిపొర్లాయి. ఆయా మండలాల్లో మొక్క జొన్న పంట నేలకొరిగింది. ఎకరాకు సుమారు రూ.50 వేల పెట్టుబడి పెట్టామని, మాయదారి వర్షం వచ్చి పంట నష్ట పరిచిందని రైతులు వాపోయారు. తమకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. సుమారు రెండు గంటలపాటు వర్షం కురవడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో భారీగా కురవడంతో గోదావరి బ్రిడ్జిలపై వాహనరాకపోకలు నిలిచిపోయాయి. అన్నపురెడ్డిపల్లి మండలంలో వరి పంట కోతకు వచ్చే దశలో ఉండటంతో నేలకొరిగింది. చర్ల మండలం మామిడిగూడెం గ్రామ శివారులో గొర్రెలు మేత మేస్తున్న ప్రదేశంలో పిడుగుపడటంతో 15 జీవాలు మృత్యువాతపడ్డాయి.

50 ఎకరాల్లో మామిడి తోట దెబ్బతింది : కౌలు రైతులు తబీరేస్, ఇస్సాం, వికారాబాద్ జిల్లా

50 ఎకరాల మామిడి తోట కౌలుకు తీసుకున్నాం. ఏడాది పాటు కాయకష్టం చేసి తోటను పసిబిడ్డలా కాపాడుకున్నాం. ఏ తెగుళ్ళ రాకుండా ఖరీదైన మందులు పిచికారి చేసి పూత నుంచి కాత వరకూ జాగ్రత్తగా చూసుకున్నాం. ఇప్పటి వరకు రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టా. పంట చేతికి వస్తాదని అనుకున్న సమయంలో అకాల వర్షం.. గద్ద వచ్చి కోడి పిల్లలను ఎత్తికెళ్లిన చందంగా పంట అంతా నాశనం చేసింది. మామిడి కాయలు మొత్తం నేలరాలాయి. తోట మొత్తం దెబ్బతింది. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలంటూ తమ గోడు వెల్లబోసుకున్నారు.

మనీశ్ సిసోడియాపై సీబీఐ మరో కేసు

(మొదటిపేజీ తరువాయి)



వల్ల ప్రభుత్వ ఖజానాకు లక్షల్లో నష్టం వాటిల్లిందని సీబీఐ అభియోగాలు మోపింది. సిసోడియాతో పాటు మరో ఐదుగురిపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సిసోడియాను ఇక జైలుకు పరిమితం చేసేందుకే మరో కేసు పెట్టారని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు.

బిజినెస్

స్టాక్ మార్కెట్లపై 65 శాతం ఇన్వెస్టర్లకు అవగాహన లేదు

- రిటర్న్‌లో 67 శాతం మంది విఫలం
- సామ్కో చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెల్లడి
- 'మిషన్-ఎస్ ద ఇండెక్స్' ఆవిష్కరణ



హైదరాబాద్ : దేశీయ స్టాక్ మార్కెట్లలో 67 శాతం మంది ఇన్వెస్టర్లు రిటర్న్‌లు సాధించడంలో విఫలం అవుతున్నారని ఇన్వెస్ట్‌మెంట్ టెక్ కంపెనీ సామ్కో వ్యవస్థాపకులు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) జిమీత్ మోడీ పేర్కొన్నారు. కొత్తగా తమ సంస్థ మిషన్-ఎస్ ద ఇండెక్స్‌ను విడుదల చేసిందన్నారు. భావితరపు క్యాపిటల్ రిసోర్స్ ప్లానింగ్ (సిఆర్‌పి) ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ను వెబ్, యాప్‌పై ఆవిష్కరించడం ద్వారా వ్యాపారులు, మదుపరులు తమ పెట్టుబడుల పనితీరు మెరుగు పరుచుకునేందుకు దోహదం చేయనుందన్నారు. గురువారం ఆయన వర్చ్యువల్ సమావేశంలో మాట్లాడుతూ.. నీల్సన్ సర్వే ప్రకారం.. "63 శాతం మంది మదుపరులకు తమ లక్ష్యం లేదా సూచీలను ఎలా చేరుకోవాలనే దానిపై ప్రణాళిక లేదు. 65 శాతం మంది మదుపరులకు తమ స్టాక్ మార్కెట్ రిటర్న్పు పట్ల కచ్చితంగా అవగాహన లేదు. 77 శాతం మంది మదుపరులకు తాము స్థిరంగా బెంచ్‌మార్క్ సూచీలను అందుకోవాలన్న అంశంపై అవగాహన లేదు. మిగిలిన 23 శాతం మంది మదుపరులకు బెంచ్‌మార్క్ సూచీ అందుకోవాలన్న అంశం పట్ల అవగాహన ఉంది. అయితే వీరిలో 50 శాతం మందికి బెంచ్‌మార్క్ సూచీలు ఏ విధంగా ఆ రాబడి సాధిస్తాయన్నది తెలియదు." అని జిమీత్ పేర్కొన్నారు. "అధిక శాతం మంది భారతీయ మదుపరులు, వ్యాపారులు కనీసం బెంచ్‌మార్క్ రిటర్న్‌ను కూడా పొందలేకపోతున్నారు. దీనికి పలు కారణాలు ఉన్నాయి. వీటిలో సరైన ట్రేడింగ్ వ్యవస్థ, తప్పు పనితీరు కొలత, దురాశ, భయంతో కూడిన సమయాల్లో భావోద్వేగాలతో తీసుకునే చర్యలు, సలహాలు, ఫిన్ ఇన్ప్యుయర్స్‌పై అధికంగా ఆధారపడటం మొదలైనవి ఉన్నాయి. ఈ సవాళ్లను అధిగమించడం కోసం 'మిషన్-ఎస్ ద ఇండెక్స్'లో చేరాల్సిందిగా ఆహ్వానిస్తున్నాం." అని జిమీత్ తెలిపారు.

52 వారాల కనిష్టానికి రిలయన్స్ షేర్

ముంబయి : రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ గురువారం 52 వారాల కనిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యింది. ఉదయం రూ.2,243 వద్ద ప్రారంభమైన సూచీ.. ఓ దశలో రూ.2,202కు పడిపోయి ఏడాది కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. మరో దశలో రూ.2,254 గరిష్ట స్థాయికి చేరి.. తుదకు 0.34 శాతం నష్టంతో రూ.2,229 వద్ద ముగిసింది. గడిచిన ఐదు సెషన్లలో ఈ సూచీ 4.31 శాతం లేదా రూ.100 నష్టపోయింది. గురువారం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ ఇంట్రాడేలో 57,887-57,158 కదలాడి.. తుదకు 79 పాయింట్ల లాభంతో 57,634కు చేరింది. దీంతో వరుసగా ఐదు రోజులుగా నష్టాల్లో కొనసాగిన మార్కెట్లకు స్వల్ప ఉపశమనం లభించినట్లయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 13 పాయింట్లు పెరిగి 16,985 వద్ద ముగిసింది. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి.

బజాజ్ ఆటో కొత్త పల్సర్ బైకుల ఆవిష్కరణ

న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ బజాజ్ ఆటో సరికొత్త ఫీచర్లతో 2023 బజాజ్ పల్సర్ ఎన్ఎస్200, ఎన్ఎస్ 160 స్ట్రీట్ మోడళ్లను విడుదల చేసింది. ఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద వీటి ధరలను వరుసగా రూ.1.47 లక్షలు, రూ.1.35 లక్షలుగా నిర్ణయించింది. కొత్త ఎన్ఎస్‌డి ఫోర్క్, డ్యూయల్ చానల్ ఎబిఎస్ ప్రత్యేక ఫీచర్లుగా ఉన్నాయని పేర్కొంది. ఇంతక్రితం మోడల్‌తో పోల్చితే ఎన్ఎస్ 200 వేరియంట్ 1.5 కిలోలు తక్కువ బరువు ఉందని ఆ కంపెనీ తెలిపింది. ఎన్ఎస్200ను 200 సిసి ఇంజిన్‌తో 24.5 బిహెచ్‌పితో విడుదల చేసింది. ఆరు గేర్ల స్పీడ్ గేర్‌బాక్స్‌తో దీన్ని రూపొందించడం విశేషం.

దురుద్దేశంతోనే బీజేపీ ఆరోపణలు: మంత్రి తలసాని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై బీజేపీ ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పేపర్ లీకేజీ కుట్రలో బీజేపీకి చెందిన రాజశేఖర్ రెడ్డి నిందితుడిగా ఉన్నాడని గుర్తుచేశారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఉద్యోగాల భర్తీలో అనేక స్కాంలు జరిగాయని తెలిపారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ఎవరున్నా వదిలిపెట్టొద్దని సిట్ అధికారులను మంత్రి కోరారు.

దుబాయ్‌లో సూర్యాపేటవాసి మృతి

- డెడ్ బాడీ కోసం కుటుంబం ఎదురుచూపులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సూర్యాపేట జిల్లాకు చెందిన ధరావత్ వెంకటేశ్వర్లు (39) దుబాయ్‌లో మూడు రోజుల క్రితం మరణించారు. ఆయన స్వస్థలం మల్లెల చెరువు మండలం కప్పలకుంట తండా. ఉపాధి కోసం దుబాయ్ వలస వెళ్లిన వెంక టేశ్వర్లు అక్కడ కూలీగా పనిచేశాడు. ఏం జరిగిందో గానీ మూడు రోజుల క్రితం మరణించినట్లు ఆయన భార్య ధరావత్ రమాదేవికి సమాచారం అందింది. దీంతో ఆయన కుటుంబంతోపాటు కప్పలకుంట తండా విషాదం లో మునిగిపోయింది. ధరావత్ వెంకటేశ్వర్లు భౌతిక కాయాన్ని తమకు అప్ప గించాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని రప్పించడానికి ఎవరిని సంప్రదించాలో తెలియక ఆందోళన చెందుతున్నా రు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని వెంక టేశ్వర్లు భౌతికకాయాన్ని రప్పించే ఏర్పాట్లు చేయాలని వారు వేడుకుంటున్నారు.

ప్రభుత్వ తప్పిదంతోనే పేపర్ లీకేజీ

- కుల నిర్మూలన వేదిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటన రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జరిగిందని కుల నిర్మూలన వేదిక(కేఎన్‌పీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాపని నాగరాజు, కోట ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్షలాది నిరుద్యోగ అభ్యర్థులను ముంచిన ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేస్తున్న కుట్రలను గమనించి నిరుద్యోగులు కేసీఆర్‌ను గద్దె దించేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు.

బీసీలపై పాలకులు వివక్షను వీడాలి : దాసు సురేశ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై వివక్షను వీడాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రవాస భారతీయుల రక్షణ కోసం ప్రత్యేక పాలసీ తీసుకురావాలని కోరారు. ఆయా దేశాల కాన్సులేట్ ఆఫీసుల్లో పోలింగ్ బూతులు ఏర్పాటు చేయడమే కాకుండా ఆన్‌లైన్‌లో సైతం తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ ప్రణాళికలను చేపట్టాలని కోరారు. గల్ఫ్ బాధితుల కోసం తాము హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశంలో మహిళల సాధికారత కోసం చట్టసభలలో వారికి 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయంగా అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో సముచిత ప్రాధాన్యతనివ్వని ఏ రాజకీయ పార్టీ అయినా కాలగర్భంలో కలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో చాపర్తి కుమార్ గాడ్గే, దొంత ఆనందం, బోనం ఊర్మిళ, గల్ఫ్ నాయకులు మిద్దెల జితేందర్, ఎస్ యాదయ్య, మడత కిషోర్, సబ్బని సుధాకర్, బేగరీ రవి తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీకి కేటీఆర్ బాధ్యులు : బండి

- చంచల్‌గూడ జైలులో బీజేవైఎం నేతలకు పరామర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి కేటీఆర్‌నే బాధ్యులని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం చంచల్ గూడ జైలులో బీజేవైఎం నేతలను ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌ను బర్తరఫ్ చేసి లోపలేసి తొక్కే దమ్ము కేసీఆర్‌కు ఉందా? అని ప్రశ్నించారు.

నేడు గవర్నర్‌ను కలువనున్న బీజేపీ బృందం

రాష్ట్రంలో ఐటీ చట్టం అమలుతోపాటు టీఎస్పీఎస్సీ అక్రమాలపై విచారణ కోసం న్యాయపోరాటం చేయాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ నిర్ణయించింది. బండి సంజయ్ నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ కమిటీ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను కలువనున్నది.

అగ్నికి ఆరుగురు ఆహుతి

(మొదటిపేజీ తరువాయి)

వేసారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. కాంప్లెక్స్‌లో చిక్కుకున్న 13 మందిని భారీ క్రేన్ల సహాయంతో కిందకు తీసుకొచ్చారు. మంటలను అదుపుచేసేందుకు ఆరు ఫైరింజన్ల సహాయంతో అర్ధరాత్రి వరకు రెస్క్యూ సిబ్బంది శ్రమించాల్సి వచ్చింది. మంటల తీవ్రతకు కాంప్లెక్స్‌పైకి చేరుకున్న పలువురు బాధితులు.. తమను రక్షించాలంటూ సెల్‌ఫోన్ లైట్లతో సంకేతాలిచ్చారు. వారిని రెస్క్యూ టీం కాపాడింది. అయితే ఈ ఘటనలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు మృతి చెందారు. వారిని ప్రశాంతి, ప్రమీల, శ్రావణి, వెన్నెల, త్రివేణి, శివలు గా గుర్తించారు. ఇంకా కాంప్లెక్స్ లోపల చాలా మంది చిక్కుకున్నట్టు తెలుస్తోంది. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. దాదాపు 14 అంతస్తులు గల స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను 1980లో నిర్మించారు.



ఫోన్లో మాట్లాడుతూ బాధితులకు ధైర్యం చెప్పిన అధికారులు

కాంప్లెక్స్‌లో చిక్కుకున్న వారితో అధికారులు ఫోన్‌ల్లో మాట్లాడారు. భయాందోళన చెందవద్దని వారికి ధైర్యం చెప్పారు. విషయం తెలుసుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. సహాయక చర్యల్లో డీసీపీ చందనాదీప్తి, ఏసీపీ రమేష్, సీఐలు, ఎస్ఐలు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



7వ అంతస్తు నుంచి దూకే ప్రయత్నం

కాంప్లెక్స్‌లో చిక్కుకున్న వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఓ వ్యక్తి 7వ అంతస్తు నుంచి సెల్‌ఫోన్ లైట్ చూపిస్తూ కేబుల్ వైర్‌తో దూకేందుకు ప్రయత్నించాడు. అయితే గమనించిన డీసీపీ చందనాదీప్తి బాధితున్ని దూకొద్దంటూ సూచించారు. భయాందోళన చెందాల్సిన అవసరం లేదని అందరిని రక్షిస్తామంటూ భరోసా ఇచ్చారు. దాంతో బాధితుడు తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

జీడిమెట్లలోనూ భారీ అగ్నిప్రమాదం

జీడిమెట్లలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గురువారం రాత్రి ఫార్మా కెమికల్ కంపెనీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మూతపడిన ఫార్మా కెమికల్ కంపెనీలో మంటలు ఎగిసిపడడం, సాల్వెంట్ డ్రమ్‌లు గాల్లోకి ఎగిరిపడడంతో పరిసర ప్రాంతాల వారు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. కేసునమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాలల్లో విచారణ చేపట్టారు.



హయత్‌బక్షి బేగం జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రవీంద్రభారతి సాహిత్య అకాడమీ కార్యాలయంలో గురువారం హయత్ బక్షి బేగం జీవిత చరిత్ర పుస్తకాన్ని అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ సీతారామారావు, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మెన్, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్, ప్రొఫెసర్ అస్రఫ్ రఫీ, రచయిత్రి, ప్రొఫెసర్ సుధారాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రకు మూలమైన కుతుబ్షాహీ చరిత్ర తెలంగాణ అస్తిత్వానికి ఆయు పట్టు లాంటిదన్నారు. తెలంగాణలో జరిగిన స్వాతంత్ర పోరాటాన్ని రికార్డ్ చేయలేదని అన్నారు. తెలంగాణకు గొప్ప చరిత్ర ఉన ్నదనీ, చరిత్రను కేవలం చరిత్రకారులు మాత్రమే రికార్డు చేయరని అసలు చరిత్ర ప్రజలలో వారి జీవన విధానంలో ఉంటుందని తెలిపారు. హయత్‌బక్షి భాగమతి కుమార్తె అని వచ్చిన తొలి పుస్తకం ఇది అని అన్నారు. అంబేద్కర్ యూనివర్సిటీ ఉపకులపతి సీతారామారావు మాట్లాడుతూ చరిత్ర సత్యాలతో నిండి ఉండాలన్నారు. డెక్కన్ సోషల్ కల్చరల్ జీవన విధానాన్ని ఇంకా వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ చరిత్రలో హిందూ ముస్లింలు ఐక్యత వ్యక్తమవుతున్నదని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ ఉర్దూ విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ అష్రఫ్ రఫీ మాట్లాడుతూ హైదరాబాదుకు ఒక



సొంత సంస్కృతి ఉన్నదనీ, ప్రస్తుతం హైదరాబాదులో ఉన్న ప్రతి ప్రాంతానికి ఒక చరిత్ర ఉందని తెలిపారు. జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ చరిత్ర, సంస్కృతి సాహిత్యంతో కలగల్సి ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సాహిత్యకాడమీ కార్యదర్శి బాలాచారి, తెలంగాణ బుక్ ట్రస్ట్ ప్రతినిధి కోయ చంద్రమోహన్, ప్రొఫెసర్ శ్రీనివాస్, జర్నలిస్టు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

క్రీడలు, దేహధారుఢ్యంలోనూ పోటీ పడాలి

పోలీసులకు డీజీపీ అంజనీకుమార్ పిలుపు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల అదుపుతో పాటు క్రీడలు, దేహధారుఢ్యం పట్ల కూడా పోలీసులు శ్రద్ధ వహించాలని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ పిలుపు నిచ్చారు. గురువారం ఆర్‌బీవీఆర్ పోలీసు అకాడమీలో రిటైర్డు పోలీసు సూపరింటెండెంట్ మహ్మద్ ఖాసిం తాను పోలీసు అథ్లెటిక్ మీట్‌లో సాధించిన బంగారు పతకాలను పోలీసు మ్యూజియంకు ప్రదర్శన కోసం బహూకరించారు. ఈ సందర్భంగా జరిగిన ఖాసిం సత్కార సభలో డీజీపీ మాట్లాడుతూ శారీరకంగా పోలీసులు ఫిట్‌గా ఉంటేనే వారి దైనందిన విధుల్లో రాణించగలరని అన్నారు. పోలీసులు తమ విధి నిర్వహణకు తమ విజ్ఞానాన్నే గాక, అవసరమైతే దేహధారుఢ్యాన్ని కూడా ప్రదర్శించాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకు ప్రతి రోజు వారు ఏదో ఒక క్రీడలో పాల్గొనడం, శారీరక సమానత్వాన్ని పెంచడానికి అవసరమైన వ్యాయాన్ని చేయడం అత్యవసరమని అన్నారు. అప్పుడే మానసికంగా , శారీరక సౌష్టవాన్ని పోలీసులు కలిగి ఉంటారని చెప్పారు. కింది స్థాయి కానిస్టేబుల్ మొదలుకుని ఉన్నత స్థాయి ఐపీఎస్ అధికారుల వరకు ఈ విధానం వర్తిస్తుందని తెలిపారు. తన పోలీసు జీవితంలో మహ్మద్ ఖాసిం వివిధ హెూదాలలో పోలీసు విధులను నిర్వహిస్తూనే మరో వైపు క్రీడల్లో తన సామర్థ్యాన్ని చాటుకున్నారని ఆయన అభినందించారు. ఆయన సాధించిన 10 బంగారు పతకాలు, ఆరు వెండి పతకాలను అకాడమీలోని పోలీసు మ్యూజియంలో ప్రదర్శించడానికి ఇవ్వడం యువ పోలీసుల్లో స్ఫూర్తిని నింపడానికి ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. రిటైర్డు ఎస్పీ మహ్మద్ ఖాసిం మాట్లాడుతూ తన విధి నిర్వహణలో ఒక పక్క శాంతి భద్రతలు, నేరాల అదుపులో దృష్టిని సారిస్తూనే మరో వైపు అథ్లెటిక్స్ లో సైతం ఆసక్తిని చూపానని అన్నారు. ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగిన అథ్లేటికటిక్ మీట్స్‌లలో తాను గెలుపొందిన బంగారు, వెండి పతకాలను ఇంట్లో ఉంచుకోవడం కంటే పోలీసు మ్యూజియంలో ఉంచడం వల్ల ఇతర పోలీసులకు ప్రేరణ కలుగుతుందని ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. అనంతరం మహ్మద్ ఖాసింను రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌తో పాటు రాష్ట్ర పోలీసు క్రీడలు, వెల్ఫేర్ విభాగం అదనపు డీజీ అభిలాష బిస్త్, పోలీసు అకాడమీ డైరెక్టర్ సందీప్ శాండిల్య , ఐజీ కమలాసన్ రెడ్డి , అధికారులు సన్మానించారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర నేరస్తుల అరెస్టు

- సీఐడీకి చిక్కి...కటకటాల వెనక్కి.

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

గత పదమూడేండ్లుగా నేరాలు చేసి పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నేరస్తులను రాష్ట్ర సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన పరమేష్, కడప జిల్లాకు చెందిన రాజేష్‌లు వేరు వేరు నేరాలకు పాల్పడి గత పదిహేను ఏండ్లుగా పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. ఇందులో పరమేష్ ఎస్‌బీఐ బ్యాంకు నుంచి రూ. 18 లక్షలు రుణంగా తీసుకుని వాటిని తిరిగి చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఇతని కోసం తీవ్రంగా గాలించిన సీఐడీ అధికారులు తర్వాత ఈ కేసును సీఐడీకి అప్పగించారు. అలాగే మరో కేసులో సాఫ్ట్‌వేర్ నిపుణుడు రాజేష్ ప్రముఖ కంపెనీలకు చెందిన డేటాబేస్ సాఫ్ట్‌వేర్‌ను తస్కరించి ఇతర కంపెనీలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నాడు. ఇతనిపై హైదరాబాద్ పోలీసులు గతంలో కేసు నమోదు చేయగా అప్పటి నుంచి రాజేష్ తప్పించు కుని తిరుగుతున్నాడు. ఈ రెండు కేసుల్లో నిందితులిద్దరిపై నాన్ బెయిలబుల్ కేసులు ఉన్నాయి. ఈ పెండింగ్ ఎన్‌బీ డబ్ల్యూ కేసులను పరిగణనలోకి తీసుకుని సీఐడీకి చెందిన ప్రత్యేక టీమ్‌లు రంగంలోకి దిగాయి. చివరికి పరమేష్‌ను మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో అరెస్టు చేసిన సీఐడీ అధికారులు, రాజేష్‌ను కూడా కడపలో పట్టుకున్నారు. ఇద్దరు పాత నేరస్తులను పట్టుకున్నందుకు గానూ సీఐడీ అదనపు డీజీ మహేష్ భగవత్ తమ అధికారులను అభినందించారు.

2024నాటికి లక్ష గ్రామాల్లోకి ఆర్ఎస్ఎస్

- తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్నాం
- ఉద్యోగులు, వ్యాపారులతోనూ శాఖలు వేస్తున్నాం : ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో 2024 నాటికి లక్ష గ్రామాల్లో ఆర్ఎస్ఎస్ శాఖలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ(ప్రధాన కార్యదర్శి) కాచం రమేశ్ తెలిపారు. తెలంగాణ లోనూ వేగంగా విస్తరిస్తున్నామనీ, ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, రైతులతో ప్రత్యేకంగా శాఖలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ, తమిళ నాడు, కర్నాటక క్షేత్ర ప్రచార ప్రముఖ్ నడింపల్లి ఆయూష్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ లో ఆరేడు గ్రామాలను కలిపి 1616 ఉపమండలాలను గుర్తించామనీ, 1138 రెగ్యులర్ శాఖలు, 280 శాఖ లు వారానికి,



నెలకోసారి సమావేశం అవుతున్నాయని తెలిపారు. రాష్ట్రం లోని పట్టణాల్లో 10వేల జనాభాకొకటి చొప్పున 1447 సేవాబస్తీలను (మురికివాడలను) విభజించామనీ, 1075 బస్తీల్లో శాఖలు జరుగుతున్నా యని తెలిపారు. మురికివాడల్లో తమ కార్యకర్తలు నిరంతరం యాక్టివ్‌గా ఉండి సంఘ్‌ను విస్తరిస్తున్నారని చెప్పారు. త్వరలో 500 మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు హైదరాబాద్ లో రెండు శిక్షణాశిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. నైజాం విముక్త అమృతోత్సవ సమితి ఆధ్వర్యంలో తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను కలిశామన్నారు. సెప్టెంబర్ 17న 491 మండల కేంద్రాల్లో త్రివర్ణపతాకావిష్కరణలో 31వేలకుపైగా మంది పాల్గొన్నారని చెప్పారు. జనవరి ఒకటో తేదీ నుంచి 15 వరకు రాష్ట్రంలోని ఏడువేల గ్రామాలలో ఇంటింటికి వెళ్లి 15లక్షల కుటుంబాలకు తెలంగాణ విముక్తి పోరాట చరిత్రను వివరించే కరపత్రం, పుస్తకాలను పంచామని తెలిపారు. రాష్ట్రంలో 33 జిల్లాల్లో 61 యువ సమ్మేళనాలు జరిగాయనీ, అందులో లక్షన్నరకుపైగా విద్యార్థులు పాల్గొన్నా రని చెప్పారు. స్వ ఆధారితంగా (స్వభారత్, స్వదేశీ, స్వజాతీకరణ...) ముందుకెళ్తున్నామని చెప్పారు. సంఘ్ పై వారు ఎక్కువ ఆసక్తి చూపుతున్నా రనీ, అఖండ భారత్ నిర్మాణంలో యువతదే కీలక పాత్ర అని చెప్పారు. తెలంగాణలో ప్రతి జిల్లాలో ఐదారు గ్రామాలను ఎంచుకుని సమగ్రంగా సర్వేలు చేయాలని తమ శాఖలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గ్రామాల్లో అక్షరాస్యత పెంచడం, శాఖ సభ్యులు ప్రజలతో సత్సంబంధాలను పెంపొందించుకోవడం, దేవాలయాల పునరుద్ధరణ, పాఠశాలల్లోని సమస్యల ను పరిష్కరించడం, పర్యావరణ పరి రక్షణ ఆవశ్యకత, విద్యార్థులకు వసతి గృహాలు నిర్మించడం, వైద్యపరంగా సహకారం అందేలా చూడటం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల అవసరా లకు అనుగుణంగా పనిచేస్తూనే సంఘ్‌ను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

ముస్లింలపై దాడులను నివారించాలి

- ఐరాస చీఫ్ గుటెరస్ పిలుపు



వాషింగ్టన్ : ముస్లింలపై జరుగుతున్న దాడులను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ సమాజానికి ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ పిలుపునిచ్చారు. మార్చి 15ను అంతర్జాతీయ ఇస్లాం ఫోబియో వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించుకుంటున్న నేపథ్యంలో గుటెరస్ ఈ పిలునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాదాపు 200 కోట్ల మంది ముస్లింలు మానవత్వం, దాని అద్భుతమైన వైవిధ్యానికి ప్రతిబింబిస్తున్నారనీ, అయితే వారి విశ్వాసం కారణంగా వారు తరచూ దాడులకు, పక్షపాతానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత దాడులకు, విద్వేష వ్యాఖ్యలకు ముస్లింలు బలిపశువులు అవుతున్నారని తెలిపారు. నియో నాజీల ఆధిపత్య సిద్ధాంతాలు, జాతీయ వాదం, హింస యొక్క పునరుజ్జీవనం కారణంగా ముస్లిం వ్యతిరేక భావజాలం పెరుగుతుందని గుటెరస్ విమర్శించారు. 'వివక్ష మనందరినీ నాశనం చేస్తున్నది. హింసకు వ్యతిరేకంగా నిలబడ్డం మనందరి బాధ్యత' అన్నారు. 'మానవ హక్కులను

ఇంటర్ పరీక్షకు 14,667 మంది గైర్హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థుల పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఒక ప్రకటన విడుదల చేశారు. రెండోరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2కు 4,34,862 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో 4,20,195 (96.63 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 14,667 (3.37 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రెండో రోజు బి సెట్ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. వికారాబాద్, యాదాద్రి భువనగిరి, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఇంటర్ బోర్డు పరిశీలకులు పర్యటించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారని తెలిపారు. కరీంనగర్‌లో ముగ్గురు, వరంగల్‌లో ఒకరు చొప్పున నలుగురు మాల్‌ప్రాక్టీస్ కింద కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో కమిషన్ వేసి విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఉన్నత స్థాయిలో ఉన్న బాధ్యులను విధుల నుంచి తప్పించాలని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైతే గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను తిరిగి పరీక్ష నిర్వహించాలని కోరారు. లక్షలాది మంది నిరుద్యోగుల్లో ఉన్న ఆందోళనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకుల జనవరి జీతాల బడ్జెట్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న 3,541 మంది కాంట్రాక్టు అధ్యాపకులకు జనవరి వేతనాల బడ్జెట్ రూ.16.80 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారికి జీతాలందేలా జిల్లా ఇంటర్ విద్యా అధికారులు, ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలని కోరారు. జీతాల బడ్జెట్ విడుదల చేయడం పట్ల తెలంగాణ ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (టీఎస్‌జీసీసీఎల్ఏ-475) రాష్ట్ర అధ్యక్షులు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేశ్ ధన్యవాదాలు తెలిపారు.

మన విధానాన్నే...అస్సాం అనుసరిస్తున్నది

- బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనివర్సిటీల్లో అధ్యాపక ఖాళీల భర్తీ కోసం కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిల్లును ఆమోదించిన నేపథ్యంలో... అదే విధానాన్ని బీజేపీ పాలిత రాష్ట్రం అస్సాం కూడా అనుసరిస్తున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు.

మన రాష్ట్ర విధానానికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఆమోదం లభిస్తోందనీ, కానీ రాష్ట్ర గవర్నర్‌కు మాత్రం ఈ విధానం ఎందుకు అర్థం కావడం లేదు అని వినోద్ కుమార్ విస్మయం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన అస్సాంలో అమలు చేసేందుకు ఆ రాష్ట్ర క్యాబినెట్ తాజాగా నిర్ణయం తీసుకున్నదని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

భారత నాస్తిక సమాజం నుంచి బైరి నరేష్ తొలగింపు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులే నరేష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత నాస్తిక సమాజం సంఘంలో రాష్ట్ర అధ్యక్షునిగా కొనసాగుతున్న బైరి నరేష్‌ను ఆ సంఘం నుంచి తొలగించినట్టు భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా ఉన్న బైరి నరేష్ సంఘానికి. కమిటికి ఎలాంటి సమాచారం లేకుండా తన వ్యక్తిగత ఆలోచనతో ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. సొంత నిర్ణయాలతో పనిచేస్తూ ఆర్థిక ఉల్లంఘనలకు పాల్పడినందున అతనిపైచర్య తీసుకున్నదని తెలిపారు. అయ్యప్ప జననంపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు, వివిధ వార్తా ఛానళ్లలో తన ఇష్టం వచ్చినట్టు మాట్లాడటంతో అతన్ని కమిటీ రాష్ట్ర కమిటీ అధ్యక్ష పదవి నుంచి పక్కకు పెట్టినట్టు ప్రకటించారు.

పేపర్ లీకేజీపై నేడు బండి సంజయ్ దీక్ష

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలనీ, దీనికి కారణమైన మంత్రి కేటీఆర్‌ను భర్తరఫ్ చేసి నష్టపోయిన నిరుద్యోగులకు లక్ష రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బండి సంజయ్ కుమార్ శుక్రవారం నిరసన దీక్షకు దిగనున్నారు. తొలుత ఆయన గన్‌పార్కులోని అమరవీరులకు నివాళులు అర్పిస్తారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన దీక్షకు దిగుతారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.

బీజేవైఎం కార్యకర్తల అరెస్టును ఖండిస్తున్నాం : తరుణ్‌చుగ్

టీఎస్‌పీఎస్సీ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగిన బీజేవైఎం కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్టు బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయం కోసం ఓయూలో శాంతియుత ర్యాలీ చేసిన విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని తప్పుబట్టారు.

ప్రస్తుత సంక్షోభానికి కేసీఆర్ అసమర్థత, నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. పేపర్ లీకేజీలపై కేసీఆర్ ఇప్పటి వరకు ఎందుకు పెదవి విప్పలేదని ప్రశ్నించారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కరోనా కేసులు పెరుగుతున్నాయి..

- టెస్టులూ పెంచాలి : రాష్ట్రానికి కేంద్రం లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో టెస్టుల సంఖ్య పెంచాలని కేంద్రం సూచించింది. ఈ మేరకు గురువారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి రాజేశ్ భూషణ్ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీకి లేఖ రాశారు. దేశవ్యాప్తంగా ఈ నెల 8 నాటికి 2,082 కేసులు రాగా15 నాటికి (వారం రోజుల్లో) 3,264 కేసులొచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కేసులు పెరుగుతున్న ప్రాంతాలను గుర్తించాలనీ, ఇన్‌ఫ్లూయెం జా కేసుల పెరుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. జీనోమ్ సీక్వెన్సింగ్‌ను కొనసాగించాలనీ, ప్రికాషన్ డోస్ ఇవ్వడాన్ని వేగవంతం చేయాలని లేఖలో పేర్కొన్నారు. రద్దీ ప్రాంతాల్లో కోవిడ్ నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బయ్యారంపై బీజేపీ ఉక్కుపాదం

- స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఆశలు లేనట్టే..!
- గుజరాత్ అదానీ ఫ్యాక్టరీకి బైలడిల్లా ఖనిజం
- కేంద్రం తీరుపై బీజేపేతర పక్షాల ఆగ్రహం
- విభజన హామీలను నిర్లక్ష్యం చేస్తున్న బీజేపీ
- కేంద్రం తీరుకు నిరసనగా సీపీఐ(ఎం) 'ప్రజాగర్జన'





నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి (శ్రీనివాస్‌రెడ్డి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన హామీలను కేంద్రం ఒక్కొక్కటిగా తుంగలో తొక్కుతోంది. దీనిలో బయ్యారంలోని ఉక్కు ఫ్యాక్టరీ ప్రధానమైనది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 13వ షెడ్యూల్‌లో పార్లమెంట్ సాక్షిగా కేంద్రం ఇచ్చిన హామీని బీజేపీ ప్రభుత్వం నీరుగారుస్తోంది. బయ్యారం ఇనుప ఖనిజం సరిపోదనుకుంటే బైలడిల్లా నుంచి దిగుమతి చేసుకుని సరఫరా చేస్తామని తెలంగాణ ప్రభుత్వం పలుమార్లు కేంద్రాన్ని కోరింది. అయినప్పటికీ గుజరాత్‌లో అదానీ గ్రూపు నిర్మిస్తున్న ఉక్కు ఫ్యాక్టరీకి బైలడిల్లా నుంచి ఇనుప ఖనిజాన్ని కేటాయించడంతో బయ్యారం ఇనుప పరిశ్రమపై ఆశలు అడుగంటాయి. ఇదే కాదు ఇంకా అనేక ప్రజావ్యతిరేక విధానాలను కేంద్రం అనుసరిస్తోంది. వీటిపై సీపీఐ(ఎం) ఈనెల 17 నుంచి 'ప్రజాగర్జన' యాత్రలకు శ్రీకారం చుట్టింది.

సట్టుబండైన చట్టబద్ధ హామీ..

పునర్విభజన చట్టంలో బయ్యారంలో ఉక్కు కర్మాగారం రూ.36వేల కోట్లతో సెయిల్ ఆధ్వర్యంలో నిర్మిస్తామని చట్టబద్ధమైన హామీ ఇచ్చారు. తొమ్మిదేండ్లుగా దీనికోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు నిరీక్షిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల 20వేల మందికి ఉపాధితో పాటు ఏజెన్సీ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని ప్రజాప్రతినిధులు నివేదించారు. దీంతో స్టీల్‌ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్రం చట్టబద్ధమైన హామీ ఇచ్చింది. కానీ దాన్ని ఆచరణలో పెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపడమే కాకుండా ఆ హామీని పూర్తిగా తుంగలో తొక్కేందుకు పూనుకుంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రజాప్రతినిధులు పలుమార్లు ప్రధాని, ఉక్కుశాఖ మంత్రిని కలుస్తున్నారు. పార్లమెంట్ సమావేశాలు, ముఖ్యంగా బడ్జెట్ సమావేశాల్లో దీనిని ప్రస్తావిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో పలురకాల సర్వేలు నిర్వహించి బయ్యారం ఇనుప ఖనిజం నాణ్యత, ఖనిజ నిక్షేపాల లభ్యత చాలినంతగా లేదని సర్వే సంస్థలు తేల్చాయి. ప్లాంట్ లాభదాయకం కాదని ప్రకటించాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైతం బయ్యారం ఉక్కుపై కొన్ని నెలల కిందట అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుకూలాంశాలపై రాష్ట్రప్రభుత్వం నివేదిక సైతం సమర్పించింది. కానీ ఇవేవీ కేంద్రం పట్టించుకోలేదు. పైగా ఇనుప గనులే లేని గుజరాత్‌కు బైలడిల్లా ఖనిజాన్ని కట్టబెట్టారు.

180 కి.మీ వదిలి.. 1800 కి.మీలకు కేటాయింపు..

బయ్యారం సమీపంలోని సింగరేణి నుంచి బొగ్గు, కేటీపీఎస్ నుంచి విద్యుత్, నీటి వనరులు, మాధారం డోలమైట్ గనులు, రైలుమార్గం అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి ఖనిజ నిక్షేపాలు సరిపోకపోతే 180 కి.మీ దూరంలోని బైలడిల్లా నుంచి ముడి ఇనుమును సొంత ఖర్చుతో దిగుమతి చేసుకుంటామని రాష్ట్రప్రభుత్వం సూచించింది. అయినా కేంద్రం పట్టించుకోకుండా 1800 కి.మీ దూరంలోని గుజరాత్ ముద్రా ప్లాంట్‌కు, 500 కి.మీ దూరంలోని విశాఖ ఉక్కు కర్మాగారానికి కేటాయించడంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.



బయ్యారం ఉక్కుపై బీజేపీది ప్రతికూల వైఖరే..



బయ్యారం ఉక్కుపై మొదటి నుంచి బీజేపీ ప్రతికూల వైఖరితోనే వ్యవహరిస్తోంది. ఇక్కడ ఇనుప ఖనిజం నాణ్యమైనది కాదనే కల్లబొల్లి కబుర్లు చెబుతోంది. ఇక్కడ ఖనిజం నాణ్యమైనది కానప్పుడు అనేక ప్రయివేటు కంపెనీలు ఎందుకు తరలించుకు వెళ్లాయని ప్రశ్నిస్తున్నా. ఇప్పటికే 200 కంపెనీలు ఇక్కడి ఇనుప ఖనిజం కోసం అప్లికేషన్లు పెట్టాయి. మాజీ సీఎంలు వైఎస్ రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి.. రక్షణ, విశాఖ స్టీల్స్‌కు ఇక్కడి ఖనిజాన్ని కేటాయించారు. నాణ్యత లేకుండా ఇవన్నీ ఎలా సాధ్యం.

- గౌని ఐలయ్య, బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కమిటీ కన్వీనం

కేంద్రానికి తెలంగాణపై వివక్ష



కేంద్రం తెలంగాణపై వివక్ష పూరిత వైఖరితో ఉంది. దానికి బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీయే ప్రత్యక్ష నిదర్శనం. రాష్ట్రప్రభుత్వమే సొంత ఖర్చుతో రైలుమార్గం నిర్మించి బైలడిల్లా నుంచి ఇనుప ఖనిజం దిగుమతి చేసి ఇస్తామని చెప్పినా కేంద్రం పట్టించుకోలేదు. ఏజెన్సీ ప్రజల బాగోగులు, గిరిజన అభివృద్ధి ఇవేవీ కేంద్రానికి పట్టడం లేదు.

- బానోత్ హరిప్రియ, ఎమ్మెల్యే ఇల్లందు

కేంద్రానికి చిత్తశుద్ధి లేదు..



కేంద్ర ప్రభుత్వానికి బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై చిత్తశుద్ధి లేదు. అందుకే నాణ్యత ప్రమాణాలను కుంటిసాకుగా చూపుతోంది. ఇక్కడి ఖనిజం నాణ్యత 45 ప్లస్ అని నిపుణులు తేల్చినా కేంద్రం నాణ్యతాప్రమాణాలను సాకుగా చూపుతుండటంతో ఆశ్చర్యం గొల్పుతోంది. అదానీ, గుజరాత్ తప్ప కేంద్రానికి మిగిలిన ప్రాంతాలతో పనిలేదు. అందుకే వివక్షపూరితంగా వ్యవహరిస్తోంది. అందుకే కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) ప్రజాగర్జన యాత్ర 17 నుంచి చేపడుతుంది. ఈ యాత్రను విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి. మన హక్కులను మనం పొందాలి.

- అన్నవరపు కనకయ్య, సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి



కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై బీజేపీ దొంగాట

దశాబ్దాల ఎదురుచూపు.. మోడీ విధానాలపై ప్రజల ఆగ్రహం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి (దయాసాగర్)

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో రైల్వే ప్రధాన కూడలిగా ప్రసిద్ధిగాంచిన కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. 1980 నుండి ఇప్పటి వరకు ఈ ప్రాంత ప్రజలు కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం ఎదురుచూస్తూ వున్నారు. 1982లో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మంజూరైంది. కానీ రాజకీయ కారణాలతో వేరే రాష్ట్రానికి తరలిపోయింది. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని అనేక ఉద్యమాలు జరిగాయి. ఒకవైపు రైల్వే జేఏసీ నేతృత్వంలోనూ రాజకీయ పార్టీల నేతృత్వంలోనూ ఉద్యమాలు జరిగాయి. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లో పేర్కొన్నా...కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దొంగాట ఆడుతోంది. విభజన చట్టంలో హామీలను అమలు చేస్తామని మొదట ప్రకటించి... ఆ తర్వాత కేంద్రప్రభుత్వం కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో లేదని ప్రకటించింది. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహంతో వున్నారు. బీజేపీ చేసిన మోసాన్ని తట్టుకోలేకపోతున్నారు.

మోడీ సొంత రాష్ట్రంలో రూ.20 వేల కోట్లతో లోకోమోటివ్..

ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక తాజాగా 2022లో గుజరాత్ రాష్ట్రంలోని దహోడ్‌లో రైల్వే వ్యాగన్ పరిశ్రమను లోకోమోటివ్ ప్రొడక్షన్ ఫ్యాక్టరీగా ఉన్నతీకరించారు. దీనికి రూ.20 వేల కోట్లను కేటాయించారు. మోడీ సొంత రాష్ట్రంలో రూ.20 వేల కోట్లను కేటాయించుకొని ఉత్తర తెలంగాణ రైల్వేకు గుండెకాయగా వున్న కాజీపేట జంక్షన్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి ముందుకు రాలేదు. దక్షిణ మధ్య రైల్వేలో కాజీపేట సెక్షన్‌లోనే అత్యధిక ఆదాయం వస్తుంది. అలాంటి కాజీపేట జంక్షన్‌ను నిర్లక్ష్యం చేయడం పట్ల రైల్వే కార్మికులు మాత్రమే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి.

ఊరించి ఉసూరుమనిపించి..

కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అందని ద్రాక్షనా అన్న చందంగా మారిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సింగరేణి మైన్స్ ఈ ప్రాంతంలో వుండడంతో దక్షిణ మధ్య రైల్వేలోనే కాజీపేట సెక్షన్‌లో అత్యధిక ఆదాయం ఈ ప్రాంతం నుండే వస్తోంది. అలాంటి రైల్వే జంక్షన్‌లో కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయకుండా, బీజేపీ ప్రభుత్వం డ్రామాలు చేయడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ప్రతి రైల్వే బడ్జెట్‌లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్‌లు ప్రధాన డిమాండ్‌లుగా వుండేవి. అలాంటిది ఏకంగా మోడీ ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌నే ఎత్తివేసి కేంద్ర బడ్జెట్‌లోనే రైల్వేను ఒక సబ్జెక్ట్‌గా మార్చివేసింది. ప్రధాని మోడీ అవలంబిస్తున్న విధానాలపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్
- పెద్దపల్లిలో ఆందోళన.. కార్మికుల వంటావార్పు



నవతెలంగాణ - పెద్దపల్లి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే సమ్మె తప్పదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం దగ్గర వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న విధంగా పీఎఫ్, ఈఎస్ఐ, ఆదివారం, ఇతర సెలవులు ఇవ్వాలన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లతో నెల రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అయినా ప్రభుత్వం స్పందించకుండా మొండిగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. పెద్దపల్లి జిల్లాలో మూడు నెలలుగా బకాయి వేతనాలు ఉన్నాయని.. అధికారులకు, ఉద్యోగులకు నెలనెలా వేతనం వస్తేనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కానీ కార్మికులకు మూడు మాసాల నుంచి వేతనాలు లేకుండా ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రికి, ఉన్నతాధికారులకు వేతనాలు పెంచుకోవడానికి, నెల నెలా తీసుకోవడానికి డబ్బులు ఉన్నాయిగానీ గ్రామాల్లో పనిచేస్తున్న పేద కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి, వేతనాలు పెంచడానికి చేతులు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, పాదయాత్రలో పెట్టిన మిగతా డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. అనంతరం రోడ్డుపైనే వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.జ్యోతి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.మహేశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కళ్ళేపల్లి అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిపెల్లి రవీందర్, బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష పాల్గొని సంఘీభావం తెలిపారు. గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.కాజా, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య, ఎం.రామాచారి తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌సీఐకి గోల్డెన్ పీకాక్ అవార్డు

దుబాయిలో అందుకున్న డైరెక్టర్ రామేశ్వర్‌రావు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)కు 'గోల్డెన్ పీకాక్ నేషనల్ ట్రైనింగ్ అవార్డు-2023' దక్కింది. ఇప్పటి వరకు ఈఎస్‌సీఐ ఏడు గోల్డెన్ పీకాక్ అవార్డులను సొంతం చేసుకోగా ఇది ఎనిమిదోది కావడం విశేషం. దుబాయిలోని హడ్‌టూర్ ప్యాలెస్‌లో యూనైటెడ్ ఎమిరేట్స్ క్యాబినెట్ మంత్రి షేక్ నహయాన్ బిన్ ముబారక్ అల్ నహయాన్ చేతుల మీదుగా గురువారం ఈఎస్‌సీఐ డైరెక్టర్ జి.రామేశ్వర్‌రావు అవార్డును అందుకున్నారు. ఈఎస్‌సీఐకి గోల్డెన్ పీకాక్ అవార్డు దక్కడం గర్వకారణంగా ఉందని జి.రామేశ్వర్‌రావు తెలిపారు. 1981లో ఏర్పాటైన ఈఎస్‌సీఐ ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, పర్యావరణ రంగంలో క్వాలిటీ ట్రైనింగ్, ఎడ్యూకేషన్ అందిస్తోందని చెప్పారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్(ఇండియా) ఆర్గాన్ అయిన ఈఎస్‌సీఐ స్వతంత్ర సంస్థగా జాతీయ స్థాయిలో అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

- ఇందిరాపార్కు వద్ద 48 గంటల రిలే నిరాహార దీక్ష



నవతెలంగాణ-అడిక్ మెట్

రవాణారంగ కార్మికుల సంక్షేమ కోసం ప్రభుత్వం వెంటనే ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 48 గంటల రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ జీడీపీలో 4 శాతం వ్యాట్ అందిస్తున్న రవాణా రంగాన్ని ప్రభుత్వాలు అశ్రద్ధ చేస్తున్నాయన్నారు. రాష్ట్ర రవాణా రంగంలో 20 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. అయితే, కార్మికులకు ఏమైనా ప్రమాదాలు జరిగితే ఆదుకునే దిక్కులేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేరళ, తమిళనాడు, బెంగాల్, కర్ణాటక రాష్ట్రాల్లో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు యాక్సిడెంట్ బెనిఫిట్స్, వైద్యసహాయం, వారి పిల్లల చదువులకి స్కాలర్‌షిప్ వంటివి అందిస్తున్నారని తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి కార్మికులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మోటార్ వెహికల్ యాక్ట్ 2019ను తెచ్చి అగ్రిగేటర్స్ పేరుతో రవాణారంగాన్ని మల్టీ నేషనల్ కంపెనీలకు అప్పగించే కుట్ర చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగిల్ ఓనర్ కం డ్రైవర్స్‌గా ఉండే వారు తట్టుకోలేని విధంగా భారాలు వేసి వేధిస్తున్నదని విమర్శించారు. ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ ఫెడరేషన్ నగర కార్యదర్శి అజయ్ బాబు మాట్లాడుతూ.. రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగాన్ని ఆదాయ వనరుగా చూస్తూ భారాలు వేయడం, స్పెషల్ డ్రైవ్స్ పేరుతో చలానాలు వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

2019 మోటార్ వాహన చట్టంలో తెచ్చిన సవరణలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నాయకులు ఎండీ కలీమ్, ఉమేష్ రెడ్డి, అహ్మద్‌ఖాన్, గౌస్, సురేష్, మహేష్, జునైద్, అర్బాస్ ఖాన్, ఇమ్రాన్, అనీఫ్ తదితరులు కూర్చున్నారు. అలాగే హరి, వాహిద్, ఇర్ఫాన్, మోయిన్, చాంద్‌బాషా, సుహన్,నాగరాజు, సమీర్ తదితరులు పాల్గొన్నారు.



కెమికల్ కంపెనీ పనులను నిలిపివేయాలంటూ..

- గ్రామస్తుల ఆందోళన

నవతెలంగాణ-రఘునాథపల్లి

జనగామ జిల్లా రఘునాథ పల్లి మండలం ఖిలాషాపురం గ్రామంలో తారా కెమికల్ ఇండస్ట్రీస్ ముందు గురువారం పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. బాధిత గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కెమికల్ కంపెనీ పనులను నిలిపి వేయాలని గతంలో కంపెనీ నుంచి వెలువడే వాయువు వల్ల చాలా ఇబ్బందులు పడ్డామని, పక్కనే ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులు కూడా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. కంపెనీ చుట్టుపక్కల అరకిలోమీటర్ వరకు ఉన్న వ్యవసాయ పంట భూముల్లో పంటలు రాకుండా, బోరుబావుల నీరు తాగడానికి కూడా వీలులేకుండా పోయిందన్నారు. కంపెనీ దగ్ధమయ్యి మూడేండ్లు గడుస్తున్నా అ చుట్టుపక్కల ఇంకా చెడు వాసనలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బోర్లలో నీళ్ళు కలుషితమై కెమికల్ వాసన వచ్చి తాగడానికి కూడా పనికి రావడంలేదని తెలిపారు. ఇక ఫ్యాక్టరీ తెరిస్తే వ్యవసాయ భూములతో పాటు గ్రామాన్ని కూడా వదిలి వెళ్లే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులు జిల్లా కలెక్టర్ శివలింగయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్, ఎంపీటీసీ అల్లిబిల్లి కృష్ణ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కలకలం రేపిన పావురం

- కాళ్లకు ట్యాగ్లు, రెక్కలకు స్టాంపు
- భయపడాల్సిన అవసరం లేదన్న ఎస్ఐ

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ఓ పావురం ఖమ్మం జిల్లాలో కలకలం సృష్టించింది. కాళ్లకు ట్యాగ్లు, రెక్కలకు స్టాంపు ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామంలో కాళ్లకు ట్యాగులు ఉన్న ఓ పావురాన్ని పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. దాని రెక్కల పైన డెల్టా 1000 కేఎం అని స్టాంపు ముద్రించగా, కాళ్లకు వేసిన ట్యాగ్‌లు ఒక కాలికి 999 టీఎన్ అని, మరొక కాలుకి 1417 అని ఉన్నట్టు తెలిపారు. విచారించగా .. తమిళనాడులోని తంజావూరులో ఓ సంస్థకు చెందిన ఆర్గనైజర్లు పావురాల పోటీలు నిర్వహిస్తారని, ఆ పోటీల్లో పాల్గొన్న ఈ పావురం ఆకాశంలో విహరించి తిరిగి తన గమ్య స్థానానికి వెళ్లాల్సి ఉండగా దారి తప్పి తెలంగాణలోకి ప్రవేశించిందని తెలిపారు. తిరిగి తిరిగి అలిసిపోయి గ్రామంలో వాలడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. ప్రజలు దాన్ని చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. .

పేపర్ లీక్ కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్

నవతెలంగాణ-ఓయూ



టీఎస్‌పీఎస్‌సీలో ప్రశ్నాపత్రాల లీకేజీపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్‌సీలో ప్రశ్నాపత్రం లీకేజీపై గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్‌సీ చైర్మెన్‌ను తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రం లీకేజ్‌లో ప్రభుత్వ పెద్దల కుట్ర కూడా దాగుందన్న అనుమానం వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, నిరుద్యోగులకు న్యాయం చేసే వరకు పోరాడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవి నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా జరగకపోవడం బాధాకరం అన్నారు. టీఎస్‌పీఎస్‌సీలోని సభ్యులందరినీ తొలగించి నూతన సభ్యులను, చైర్మెన్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు రామాటేంకి శ్రీను, సాయికిరణ్, రాజు, నాయకులు సందీప్, పునీత్, నీరజ్, రాజశేఖర్, ప్రవీణ్, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో గోడకూలి విద్యార్థి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- చివ్వెంల మండల కేంద్రంలో ఘటన

నవతెలంగాణ -చివ్వెంల



మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలుర హాస్టల్‌లో వాటర్ ట్యాంక్ గోడ కూలి విద్యార్థి మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్ర శివారులో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలానికి చెందిన మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలేబాలుర హాస్టల్‌ను చివ్వెంల మండల కేంద్రంలోని ప్రయివేటు బిల్డింగ్‌లో నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు రావుట్ల పవన్, కొప్పుల యశ్వంత్, జిల్లోజు సుశాంత్ పాఠశాల ప్రాంగణంలోని వాటర్ ట్యాంక్ వద్ద స్నానం చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ట్యాంక్ గోడ కూలింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, వారిని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో మోతె మండలం అప్పన్నగూడెం గ్రామానికి చెందిన పవన్(13) మృతిచెందాడు. శాలిగౌరారం మండలం లింగోటం గ్రామానికి చెందిన యశ్వంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తున్నట్టు తెలిసింది. మద్దిరాల మండలం చందుపట్ల గ్రామానికి చెందిన సుశాంత్ పరిస్థితి కూడా విషమంగానే ఉంది. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. సంఘటనా స్థలాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్‌రెడ్డి, జెడ్పీటీసీ సంజీవ్‌నాయక్, తహసీల్దార్ రంగారావు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

నాలుగేండ్ల చిన్నారిపై లైంగికదాడి

- మద్యం మత్తులో నిర్మాణ కార్మికుడి దుర్మార్గం

నవతెలంగాణ-శంషాబాద్



మద్యం మత్తులో ఓ కామాంధుడు నాలుగేండ్ల చిన్నారిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఏసీపీ భాస్కర్ వేముల తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దండు వెంకటయ్య కొంతకాలంగా శంషాబాద్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం వీడీపీ ప్రయివేట్ లేబర్ కంపెనీలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. లేబర్ పని చేసే కూలీలంతా శంషాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. వెంకటయ్య పీకల దాకా మద్యం తాగి వాళ్ల ఇంటి పక్కన ఉన్న చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో తల్లి గమనించి ఘటనా స్థలానికి వెళ్ళింది. వెంటనే నిందితుడిని పట్టుకుని, చితకబాది పోలీసులకు అప్పగించారు. బాలికను హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలిక తల్లి ఫిర్యాదుతో వెంకటయ్యను అరెస్టు చేసి, విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. బాలిక కుటుంబ సభ్యులు కర్నాటకకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

పరీక్ష బాగా రాయలేదని..

- ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-హనుమకొండ



ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పరీక్ష బాగా రాయలేదని మానసిక ఆందోళనతో ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడు నూతల గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మురారిశెట్టి సమ్మయ్య-హైమల కుమార్తె నాగజ్యోతి (17) హనుమకొండ నక్కలగుట్టలోని సువిద్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. కాగా, బుధవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష రాసిన ఆమె.. పరీక్ష పూర్తయిన వెంటనే సాయంత్రం హాస్టల్ గదిలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన తల్లిదండ్రులు రాత్రి వరంగల్ ఎంజీఎం చేరుకున్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

కార్పొరేటర్ బైగళ్ల బాలమణి



నవతెలంగాణ - మీర్‌పేట్
కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ బైగళ్ల బాలమణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం డివిజన్ పరిధిలోని ఈస్టు గాయత్రి నగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈస్టు గాయత్రీనగర్ కాలనీ అధ్యక్షుడు కొత్త వెంకటయ్య, శ్రీరామ్ నాయక్, లక్ష్మణ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాన్యవార్ కాన్షీరాం జయంతి వేడుకలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్
బహుజన సమాజ్ పార్టీ పితామహులు మాన్యశ్రీ కాన్షిరాం 89వ జయంతి వేడుకలను బహుజన్ సమాజ్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ గ్రామం, ప్రగతినగర్‌లో బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి కిరణ్ ఆధ్వర్యంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు శివకాంత్ అధ్యక్షత జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఎస్పీ పార్టీ మహేశ్వరం అసెంబ్లీ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ మహరాజ్ పాల్గొన్నారు.
అతిథులుగా అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి భాగ్యరాజ్, అసెంబ్లీ మహిళా కన్వీనర్ ఇందుమతి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ క్రిష్ణ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీర్‌పేట్ నాయకులు అంజన్ కుమార్, సెక్టార్ అధ్యక్షుడు జ్ఞనేశ్వర్, శ్రీను, బస్తీ నాయకులు విజయ్, లక్ష్మణ్, ఎల్లయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని డివిజన్లను అభివృద్ధి చేస్తాం

- **నిధులున్నా ఏడాదిగా కల్వర్టు పనులు ఎందుకు చేపట్టలేదు?**
- **ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల**



నవతెలంగాణ-సంతోష్‌నగర్
సీఎం కేసీఆర్, కేటీఆర్ ఆదేశానుసారంగా మలక్‌పేట నియోజక వర్గంలోని ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలన్నది తమ అభిమతమని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల పేర్కొన్నారు. గురువారం జీహెచ్‌ఎంసి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అధికారులు, కార్పొరేటర్లతో కలిసి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. డివిజన్ పరిధిలోని తీగలగూడ అభివృద్ధి లక్ష్యంగా బస్తీలలో సుందరంగా తీర్చిదిద్దుతున్న బస్తీ కాలనీ పరిధిలో పరిశీలించారు. నియోజకవర్గంలో ఎక్కడైతే అభివృద్ధి పనులు చేపట్టలేదో అట్టి వార్డు, బస్తీ, డివిజన్ పరిధిలోని, డ్రైనేజీ, మ్యాన్‌హోల్, సీసీ రోడ్డు, ఏపుగా పెరిగిన చెట్లను, కరెంటు పోల్ మితిమీరిన వైర్లు ఉంటే టీవీ కేబులు, మంచినీరు సమస్యలని తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. డివిజన్ చేపట్టి వర్షాకాలంలో వచ్చే వరదల నియంత్రణకు చర్యలు తీసుకొనేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కొన్ని డివిజన్లలో అధికారులు పూర్తిగా ప్రశ్నించకుండా ప్రజా నాయకులు ఏది చెబితే అదే చూపడం వల్ల ప్రజలకు సమస్యలు తలెత్తుతుందని, ఎమ్మెల్యే అధికారులకు నాణ్యత పరిమాణం తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. బాక్సు కల్వర్టు నిర్మాణ పనులు పరిశీలించి ఆలస్యంపై నియోజకవర్గంలో పలు సర్కిల్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. నిధులున్నా ఏడాదిగా కల్వర్టు పనులు ఎందుకు చేపట్టలేదో వివరణ ఇవ్వాలని ఈఈ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీల్లో పర్యటించి కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, ఇంజినీరింగ్, జలమండలి అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంబదిత అధికారులు ఎంఐఎం ఆక్టివ్ సభ్యులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు

- **భద్రతను స్వయంగా పరిశీలించిన సీపీ డీఎస్ చౌహాన్**



నవతెలంగాణ-సిటీబ్యూరో
ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో రాచకొండ పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. ఎలాంటి అవాఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. గురువారం ఉదయం 8గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో మొదలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేపథ్యంలో సెంటర్‌ను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ స్వయంగా పరిశీలించారు. సరూర్‌నగర్ స్టేడియంలోని కౌంటింగ్ రూమ్‌తోపాటు స్ట్రాంగ్ రూమ్ భద్రతను పరిశీలించారు. లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల సిబ్బందితో పోలీసులు సమన్వయంతో పనిచేశారన్నారు. అధికారులకు సహకరిస్తూ ఎన్నికల ప్రక్రియను సజావుగా సాగేలా చూశారన్నారు. సీపీతోపాటు జాయింట్ సీపీ ఏ. సత్యనారాయణ, డీసీపీలు మురళీధర్, సాయి శ్రీ, డీ.శ్రీనివాస్‌తోపాటు ఏసీపీ శ్రీధర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ అంజి రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో
టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ 55వ పుట్టినరోజు వేడుకలు ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 2వేల మందికి అన్నదానం చేశారు. ఆ తర్వాత డాన్ బాస్కో అనాధ శరణాలయంలో చదువుకుంటున్న 50 మంది పిల్లలతో కేక్ కటింగ్ చేశారు. అక్కడి నుంచి నాంపల్లి హజరత్ యూసుఫ్ బాబా దర్గాలో చాదర్ సమర్పణ, పబ్లిక్ గార్డెన్స్ బంగారు మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ ఆయనకు అష్ట ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలగాలని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో మరిన్ని కీలక పదవులు చేపట్టి బంగారు తెలంగాణ నిర్మాణంలో తన వంతు కృషి ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు కె.ఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఖలీద్ అహ్మద్, బి.శంకర్, వైదీక్ శాస్త్ర, ముఖీమ్ ఖురేషి, శివ కుమార్, ఎం.ఏ.ముజీబ్, ఎం.వహీద్, మహమ్మద్ ముస్తఫా, ఉస్మాన్ అలీ ఉస్మాని పాల్గొన్నారు.

నగరంలో వర్షంతో చల్లబడిన వాతావరణం

మరో నాలుగు రోజులు, నగరంలో వర్షాలు

నవతెలంగాణ-ఎల్బీనగర్
హైదరాబాద్‌లో ఎండలు పోయి, వర్షాలు కురుస్తున్నాయి. నగరంలో వాతావరణం చల్లబడింది. ఎల్బీనగర్‌లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ తెలిపిన విధంగా ద్రోణి ప్రభావంతో పలుచోట్ల నగరంలో వర్షాలు, కొన్నిచోట్ల వడగళ్లవానలు కురుస్తున్నాయి. నగరంలో మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. ఎల్బీనగర్, నాగోల్, వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, చంపాపేట్, సంతోష్‌నగర్, సైదాబాద్, బి.ఎన్.రెడ్డి, పలు ప్రాంతాల్లో వర్షాలు పడ్డాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు రావడంతో సాయంత్రం వేళ స్కూల్స్ నుండి ఇంటికి వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. పశ్చిమ బెంగాల్ నుండి జార్ఖండ్ మీదుగా అల్పపీడన ద్రోణి కారణంగా బలమైన గాలులు వీస్తున్నాయి. గంటకు 40కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. వాతావరణ శాఖ మరో నాలుగు రోజులపాటు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. నగర ప్రజలు అప్రమత్తగా ఉండాలని కోరింది. కరెంట్ తీగలకు దూరంగా ఉండాలని, అదేవిధంగా కరెంట్ పోల్స్‌ను ముట్టుకోవద్దని, వాటకి దూరంగా ఉండాలన్నారు. హైదరాబాద్‌లో వాతావరణం మారిపోయింది మార్చి నెలలో ఎండలు వేళ వర్షాలు పడడంతో వర్షాకాల వాతావరణం నెలకొన్నది.



ఉదయం ఎండ.. సాయంత్రం వర్షం

నవతెలంగాణ - సరూర్‌నగర్
ఆర్కే పురం, సరూర్‌నగర్ డివిజన్‌లలో వర్షం కురిసింది. ఉదయం ఎండ, సాయంత్రం ఒక్క సారిగా వాతావరణం మారి వర్షం కురిసింది. పలు ప్రాంతాలలో రోడ్లపై నీరు చేరింది. దీంతో వాహనదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కంటైనర్‌లో తరలిస్తున్న 160కేజీల గంజాయి పట్టివేత

రూ.70లక్షల విలువ గల గంజాయి స్వాధీనం
ఇద్దరు డ్రైవర్లు అరెస్టు, పరారీలో నలుగురు



నవతెలంగాణ-హయత్‌నగర్
విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుండి గంజాయి తీసుకుని హైదరాబాద్ మీదుగా ముంబాయికి తరలిస్తున్న 160 కేజీల గంజాయిని రాచకొండ హయత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఎల్బీ నగర్‌లో ఉన్న డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సాయిశ్రీ నిందితుల వివరాలు వెల్లడించారు. ముంబాయికి చెందిన లాల్చ్ గులాం షైక్ మహారాష్ట్ర థానేకు చెందిన భరత్‌బాపురావ్ పంచన్, ఆకాష్ అనురాత్ కమలేలు డ్రైవర్లు, విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతం అయిన్ చింతపల్లిలో నివాసం ఉంటున్న ప్రసాద్, అన్వర్ పాషా, రాణిలు కలిసి ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలుచేసి కంటైనర్‌లో ట్రిప్‌కి ఒక లక్ష చొప్పున డ్రైవర్లు ఒప్పందం కుదుర్చుకుని విశాఖపట్నం నుండి ముంబాయి, విజయవాడకు సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా ముంబాయికి వెళ్లేందుకు గాను రాజమండ్రి, ఖమ్మం, సూర్యాపేట, పెద్ద అంబర్‌పేట ఓఆర్‌ఆర్ మీదుగా బయలుదేరే క్రమంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న హయత్ నగర్ పోలీసులు ఇద్దరు డ్రైవర్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి ఒక కంటైనర్, 2 ఫోన్లు, ఒక ఏటీఎం కార్డ్, 160 కేజీల గంజాయిని పట్టుకున్నారు. మొత్తం వాటి విలువ 70లక్షలు ఉంటుందని, పరారీలో 4గురు ఉన్నారని తెలిపారు. ఆమె వెంట వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, హయత్‌నగర్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ నిరంజన్, ఎస్‌ఐలు శ్రీనివాస్, శోభన్ బాబు, సిబ్బంది శ్రీను పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి



నవతెలంగాణ-ఎల్బీనగర్
ఏప్రిల్ ఐదో తారీకు చలో ఢిల్లీ, 18వ తారీకున జీపు జాతను జయప్రదం చేయాలని ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. సరూర్ నగర్ సర్కిల్ సీఐటీయూ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ సీఐటీయూ కార్యాలయం అధ్యక్షతన సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం గత 9 ఏళ్లుగా దేశంలో అమలు చేస్తున్న కార్పొరేట్ మతోన్మాద అనుకూల విధానాలను రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణం విరమించుకోవాలని అన్నారు. అఖిల భారత సంఘాల పిలుపులో భాగంగా రాష్ట్రంలో సీఐటీయూ తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామ స్థాయి నుండి మండల, జిల్లా కేంద్రాల వరకు ఫిబ్రవరి మార్చి నెలలో విస్తృత ప్రచారం జరిపి 2023 ఏప్రిల్ 5న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు యం.గోపినాయక్, భవన నిర్మాణ కార్మిక సంఘం రామకృష్ణాపురం లేబర్ అడ్డా సీఐటీయూ నాయకులు ఉడుగు వెంకన్న, బట్టు పరశురాములు, ఉడుగు ఎల్లయ్య, నిర్మల, సైదులు, బోడ నరసింహ, ఇరుగు యేసు, బోయినపల్లి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ-బడంగ్‌పేట్
బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఒక పూట పనివిధానం, వారి సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డికి బాలాపూర్ మండల సీఐటీయూ కన్వీనర్ దాసరి బాబు,పెంటయ్యల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు రెండు పూటలు పనిచేయడం జరుగుతుందని, అలా కాకుండా ప్రతి రోజు ఒక పూట పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఆదివారం సెలవు ఇవ్వాలని, కార్మికులకు సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇచ్చి దానికి సంబంధించిన కుట్టు మిషన్ ఖర్చులను ఇవ్వాలని, రెండు జతల చెప్పులు, కామాటీలకు గ్లౌజులు, స్వీపర్లకు చీపుర్లు, పొడవైన కర్రలు, బెల్లం, నూనె, మాస్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు రూ.21వేల వేతనం ఇస్తున్నారని, అదే విధంగా మన రాష్ట్రంలో కూడ చెల్లించాలని, మున్సిపల్ కార్మికులకు ప్రమాద బీమా రూ.6లక్షలు ఇస్తుండగా తెలంగాణలో రూ.10వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కూడా రూ.6లక్షల బీమా సౌకర్యం ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని వినతి పత్రంలో కోరారు. అంతేకాకుండా మున్సిపల్ కార్మికులందరికీ పిఎఫ్,ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.నర్సింహ, వెంకయ్య, శ్రీను, మల్లికార్జున్ ఉన్నారు.

మంత్రితో సంప్రదించి మంచినీటి సమస్య పరిష్కరిస్తా

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం
వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌లో మంచినీటి కోసం డబ్బులు కట్టకుండా రాష్ట్ర మంత్రితో సంప్రదించి ఈ సమస్యను పరిష్కరిస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌లో జరిగిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ హరిప్రియ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దానిలో భాగంగా ముఖ్యంగా డయాలసిస్ రోగులు, ప్రజల కోసం హాస్పిటల్ నందు లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. హాస్పిటల్ తరుపున 30,00,000 (ముప్పై లక్షల రూపాయలు) మంచినీటి సౌకర్యం కోసం అట్టి డబ్బులు హాస్పిటల్ నుంచి కట్టలేమని వారు తెలిపారు. దానికి గాను సుధీర్ రెడ్డి మంచినీటి సౌకర్యం కోసం ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుచే మాట్లాడి మంచినీటి కనెక్షన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే హాస్పిటల్‌లో లిఫ్ట్‌కు సంబంధించిన ఫైల్ మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ రిజ్వీచే మాట్లాడి లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. హాస్పిటల్‌కు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి సరిఅయిన వైద్యం అందించాలని సూచించారు. అలాగే మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, గఫర్, ఈశ్వరమ్మ, సునీత, రమేశ్ పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి చెందాలి

రంగా నర్సింహగుప్త

నవతెలంగాణ-ఎల్బీనగర్
మహిళా దినోత్సవం వేడుకలు గురువారం చైతన్యపురి డివిజన్‌లోని సాయినగర్ కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరిగాయి. మహిళా దినోత్సవం కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహగుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రంగానర్సింహగుప్త మాట్లాడుతు అన్ని రంగాలు, చట్ట సభలోనికి మహిళలు రావాలి అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు అవకాశం కల్పించాలని కోరారు. సమాజంలో మహిళల పాత్ర పెరుగాలని, మహిళల అభివృద్ధి జరిగితే నే సమాజం అభివృద్ధి చెందుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఏసీపీ ప్రసన్నలక్ష్మి, సీనియర్ న్యాయవాది రామసీత, చైతన్యపురి మహిళామండలి అధ్యక్షురాలు ఉషా, సెక్రెటరీ మహాలక్ష్మి, ట్రెజరర్ విద్యారెడ్డి, మహిళా సంఘం సభ్యులు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.



తప్పు చేయకపోతే ఈడీకి సహకరించొచ్చుగా

- **బీజేపీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీ విజయశాంతి**



నవతెలంగాణ-హయత్‌నగర్
ముఖ్యమంత్రి కుమార్తె, ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కామ్‌లో తప్పు చేయకపోతే సుప్రీంకోర్టులో స్టే తెచ్చుకునేందుకు ప్రయత్నాలు ఎందుకుచేయాలి, ఈడీకి సహకరించొచ్చుగా అని బీజేపీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీ విజయశాంతి ఆరోపించారు. గురువారం మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈ రెడ్డి గార్డెన్‌లో అర్బన్ బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె విచ్చేసి మాట్లాడుతూ తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం అవినీతిలో కూరుకుపోయిందని, కవిత లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కుపోవడంతో తెలంగాణ పరువు ప్రతిష్ఠ అంతా దేశానికి తెలిసేలా చేసిందని మండిపడ్డారు.
ప్రస్తుత సమాజంలో మహిళలు వారిపై జరిగే అన్యాయాన్ని ఎదుర్కొగలిగే శక్తి పెరుగుతుందని, డ్వాక్రా సంఘాల మహిళల రుణాలు మాఫీచేస్తామని చెప్పిన బీఆర్ఎస్ సర్కార్ ఇప్పటికి కూడా ఆ మాటలు నిలుపుకోలేదని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చాక మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నా కూడా నేరస్తులకు సరైన శిక్షలు పడకపోగా, వారికి ప్రభుత్వం అండగా ఉండడం చాలా సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ బీజేపీ కార్పొరేటర్‌లు, మహిళా అధ్యక్షురాళ్లు, జిల్లా అధ్యక్షురాలు నాగవాణి, ఉపాధ్యక్షురాలు గీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ మోసిన్‌ను యూనివర్సిటీ ఆదుకోవాలి

- **సీఐటీయూ ఓయూ కమిటీ డిమాండ్**

నవతెలంగాణ-సిటీబ్యూరో
ఉస్మానియా యూనివర్సిటీ ఎస్‌ఆర్‌ఎస్ హాస్టల్‌లో వార్డ్ బాయ్‌గా పనిచేస్తున్న అబ్దుల్ మోసిన్‌ను ఓయూ ఆదుకోవాలని ఓయూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు టి.మహేందర్ డిమాండ్ చేశారు. గురువారం డ్యూటీ నుంచి తార్నాకకు పనిమీద వెళుతుండగా అతను యాక్సిడెంట్‌లో చనిపోయాడు. గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లిన భౌతికకాయాన్ని యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్, ప్రధాన కార్యదర్శి సీతారాం, మేనేజర్ శ్రీనాథ్, కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ శ్రీకాంత్‌లు వెళ్లి మృతుని కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మోసిన్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఓయూ చీఫ్ వార్డెన్ శ్రీనివాస్‌రావును కోరగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్స్ ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్‌ను అమలు చేస్తూ నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. డ్యూటీలో ఉండగా యాక్సిడెంట్ గురైనందున ఈఎస్‌ఐ చట్టం ప్రకారం మోసిన్ కుటుంబానికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈరోజు వరకు హాస్టల్ కాంట్రాక్టర్లు ఈఎస్‌ఐ, పీఎఫ్ అకౌంట్ నెంబర్లు హాస్టల్స్ ఉద్యోగులకు ఇవ్వలేదని, కానీ మూడు నెలలుగా వీరి వేతనాల్లో ఈఎస్‌ఐ, పీఎఫ్ నిధులని కట్ చేస్తున్నారని తెలిపారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ చట్టం ప్రకారం మోసిన్ కుటుంబానికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. మోసిన్ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం, నాయకులు శ్రీధర్‌రావు, శ్రీను,నరేష్, నాగరాజు, లక్ష్మణ, అనసూయ, శ్యామల, నాగరాణి, స్వప్న, అంజమ్మ, తదితరులు డిమాండ్ చేశారు.

రాచకొండలో హోమ్‌గార్డులకు ఇంకా అందని వేతనాలు

నవతెలంగాణ-హయత్‌నగర్
నగరంలో ఉన్న మూడు కమిషనరేట్‌లలో ఉన్న హోమ్ గార్డ్‌లకు ప్రతి నెల జీతాలు సరైన సమయానికి అందడంలేదని, ముఖ్యంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో పనిచేసే 846 మంది హోమ్ గార్డులు ఉండగా, వారికి ఇప్పటికీ జీతాలు వారి ఖాతాలో పడలేదని, గత నెలలో 20వ తేదీన తమ ఖాతాలో జమ అయ్యాయని, ఈనెలలో కూడా ఇదే పరిస్థితి వస్తుందా అని, ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్‌లలో జీతాలు సరైన సమయానికి వారి ఖాతాలో జమ అయ్యాయని, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తమ జీతాలు వెంటనే వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

కార్పొరేటర్‌ను అరెస్టు చేయడంలో తాత్సారం ఎందుకు?

- **ప్రాణభయం ఉందని చెప్పినా చర్యలు శూన్యం**
- **అధికారం ఉందనే భౌతిక దాడులు ?**
- **కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్న పోలీసులు**
- **బాధితుడు శ్రీనివాస్ నాయక్ ఆవేదన**



నవతెలంగాణ-బోడుప్పల్
మేడ్చల్ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ కార్పొరేటర్ సుభాష్ నాయక్, అతని అనుచరులపై మేడిపల్లి పీఎస్‌లో నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసినా పోలీసులు అరెస్టు చేయడానికి ఎందుకు వెనుకంజ చేస్తున్నారో అర్థం కావడంలేదని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం నాడు మేడిపల్లిలో మీడియాతో మాట్లాడితే శ్రీనివాస్ నాయక్ కార్పొరేటర్‌గా ఉన్న సుభాష్ నాయక్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడడమే కాకుండా, అతనిపై వచ్చిన ఆరోపణల వార్తలను స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసినందుకు గాను తనపై వ్యక్తిగతంగా కక్ష పెంచుకుని ఫోన్‌లో బూతులు తిట్టడం జరిగిందని, అదే రోజు మేడిపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేసి కార్పొరేటర్ సుభాష్ నాయక్‌తో తనకు ప్రాణహాని ఉందని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని అన్నారు. నేను ఫిర్యాదు చేసిన వారం రోజులకు మేడిపల్లిలో నా స్వంత పనిమీద బయటకు వెళ్ళి వస్తుండగా అతని డ్రైవర్, అనుచరులతో భౌతిక దాడికి దిగడంతోపాటు హత్యచేసేందుకు ప్రయత్నం చేశారని, తీవ్రమైన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందడం జరిగిందని అన్నారు. కార్పొరేటర్‌పై రెండు ఫిర్యాదులు చేయగా కేసులు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేయడానికి ఇన్ని రోజుల సమయం ఎందుకు తీసుకుంటున్నారో తెలియని ప్రశ్నగా మిగిలిందని వాపోయారు. కార్పొరేటర్ కాబట్టే అతనిని అరెస్టు చేయడానికి వెనుకంజ వేస్తున్నారా? అని ప్రశ్నించారు. సామాన్య ప్రజలకు ఒక న్యాయం ఖద్దరు నేతలకు మరో న్యాయంలా పోలీసుల తీరు ఉందని శ్రీనివాస్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ సుభాష్ నాయక్‌ను అరెస్టు చేయడంలో పోలీసుల తీరుపై త్వరలోనే మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తానని తెలిపారు.

శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో మాక్ డ్రిల్



నవతెలంగాణ-బేగంపేట్

ఈస్ట్ మాడపల్లి శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఆర్ఎఫ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్యామ్ సుందర్ రెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో ఈ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఏమైనా అనుకోని ఘటనలు జరిగితే పిల్లలను ఎలా కాపాడాలో, పిల్లలు ఎలా ఉండాలి విద్యార్థులు తమ ఆత్మ రక్షణ కోసం ఎలా మెదిగాలో ఎలా బయటికి వెళ్లాలో అనే విషయాలపై అవగాహన కల్పించారు. వారికి మార్క్ డీల్ కండ్లకు కట్టినట్టుగా చూపించారు. విద్యార్థులకుతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం కృష్ణ, రీజినల్ ఇన్‌చార్జి హరికృష్ణ, ప్రిన్సిపాల్ రమ్య, జోనల్ డీన్ ప్రవీణ్ కుమార్, బ్యాచ్ ఇన్‌చార్జి భిక్షపతి, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను సహించేది లేదు



నవతెలంగాణ-జవహర్‌నగర్

అక్రమ నిర్మాణదారులను సహించేది లేదనీ, ఇకపై అలాంటి వారికి అరదండాలే పడుతాయని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ హెచ్చరించారు. గురువారం కార్పొరేషన్‌లోని పలు అక్రమ కట్టడాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ అమాయక ప్రజలకు ప్రభుత్వ భూములు కట్టబెడుతూ రూ.కోట్లు దండుకుంటున్న అక్రమదారులపై క్రిమినల్ కేసుదు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ వెహికల్స్ నిర్వాహకులకు అండగా ఉంటా

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

గూడ్స్ వెహికల్స్ నిర్వాహకులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామనీ, మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం రాంగోపాల్ పేట డివిజన్ రాణిగంజ్‌లో నిర్వహించిన మినీ గూడ్స్ వెహికల్స్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ వేడుకలలో మంత్రి మాట్లాడారు. వాహనదారులు ప్రజల ఇబ్బందులను ఆలోచించకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మోటార్ వాహన చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఆరోపించారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఈ వాహనాలను నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మీకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. యూనియన్‌ను మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 25 ఏండ్ల నుంచి యూనియన్ ను నిర్వహిస్తున్న నిర్వాహకులకు మంత్రి అభినందనలు తెలిపారు. స్థానిక వ్యాపారులతో స్నేహ, సోదరభావంతో మెలగాలని చెప్పారు. ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి క్రింద పేదింటి ఆడపడుచు పెండ్లికి ఆర్థిక సహాయం పంపిణీ, వృద్ధులకు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్‌లు అందించడం వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందనీ, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్, జహంగీర్, రాజు, మహేష్, ప్రేం కుమార్, రాఘవేంద్ర, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో సర్కారు దవాఖానాలు దేశానికే ఆదర్శం

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్



నవతెలంగాణ-జవహర్‌నగర్

పరిశుభ్రతలో సర్కారు దవాఖానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయనీ, వైద్య రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు మాడల్‌గా నిలుస్తుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం జవహర్ నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక దవాఖానాలో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ అధికారులు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు దవాఖానాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యంతోపాటు ఉచితంగా పరీక్షలు చేస్తూ మందులు అందజేస్తున్నామని తెలిపారు. తెలంగాణలోని ప్రతి పల్లె, పట్టణానికి వైద్యం అందుతుందనీ, మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి వైద్యరంగం మరింత దగ్గరవుతుందని తెలిపారు. జవహర్ నగర్ ప్రాథమిక దవాఖానా ఇప్పటికే రెండు సార్లు పరిశుభ్రతతో ప్రథమస్థానంలో నిలిచిందనీ, మరోసారి కూడా ముందువరుసులో 'నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రభుత్వ దవాఖానాలపై ప్రజలకు మరింత భరోసా కలిగిందన్నారు. అనంతరం జవహర్ నగర్ హాస్పిటల్ డాక్టర్ పద్మావతి, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ హర్షల సుధాకర్ వెదక్, అనుజ శర్మ, జవహర్ నగర్ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, సురేష్, బచ్చు, జిల్లా నాణ్యత మేనేజర్, సిబ్బంది విష్ణు, నర్సింహా, వెంకన్న పాల్గొన్నారు.

పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్
- మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అర్హులైన ఇండ్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వమంటే ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం భూ కబ్జాదారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రెడ్ కార్పొరేట్ పరుస్తూ అప్పనంగా ప్రభుత్వ భూములను అప్ప జెప్పుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ అన్నారు. గురువారం పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మల్కాజిగిరి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలు తుంగలో తొక్కాయన్నారు. మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు సిలిండర్ ధర రూ.410 ఉంటే 2023లో దాదాపు రూ.1200 లకు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపారన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసిందనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇండ్లస్థలాలు, డబుల్ బెడ్ రూమ్స్, దళితులకు 3 ఎకరాల భూమి పంపిణీ చేస్తామనీ, ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవడానికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం చేస్తామని చెప్పి ఇవ్వలేక పోయిందన్నారు. మరో పక్క భూ కబ్జాదారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఐటీ కంపెనీలకు రెడ్ కార్పొరేట్ పరిచి అప్పనంగా అమ్మివేస్తుందని చెప్పారు. పేదలు ఎక్కడైన ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే అధికారులు ఆగమేఘాల మీద వచ్చి గుడిసెలు పీకివేస్తూ, పేదలపై ఉక్కు పాదం మోపుతున్నారన్నారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారందరికీ తక్షణమే పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇండ్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డి.జి.సాయిలుగౌడ్ మాట్లాడుతూ జిల్లాలో ఇండ్లు లేని పేదలు పెద్ద సంఖ్యలో ఉన్నారనీ, ఇండ్ల కిరాయిలు కట్టలేక అవస్థలు పడుతున్నారనీ, వారందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే చలో కలెక్టరేట్ నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ ధర్నా అనంతరం మండల రెవిన్యూ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ ధర్నాలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి, తోటపల్లి శంకర్, సీపీఐ జిల్లా నాయకులు కె.సహదేవ్, మహిళా సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు రొయ్యల గిరిజ, మల్కాజ్గిరి మండల సహాయ కార్యదర్శి కైతి అశోక్ కుమార్, కాసర్ల నాగరాజు, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప, నాయకులు ఎస్.యాదగిరి, ఆర్.వెంకటేష్, జి.రాములు, భూమయ్య, లావణ్య, భారతి, అజీజ్, డి.రమణయ్య, సీపీఐ ఘట్కేసర్ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, నాయకులు జె.వెంకటరమణ, జె.రాములు, టి.సుజాత, రమ్య, వరలక్ష్మి, కొండమ్మ, శాంతి, సాయి బాబు, వెంకటేష్, కొంగ ప్రభాకర్ రావు, పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



చర్లపల్లి డివిజన్ చక్రిపురం నివాసి విశ్రాంత అధ్యాపకురాలు జయప్రద కొన్ని రోజుల క్రితం మోకాల చిప్పల ట్రీట్మెంట్ కోసం బీఆర్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మారెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఆయన మంత్రి హరీశ్‌రావు చొరవతో సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేయించారు. సిద్ధిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కి వెళ్లి, పరామర్శించి అండగా ఉంటారని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నేమురి మహేష్ గౌడ్, కటార్ల భాస్కర్, గుమ్మడి జంపాల్ రెడ్డి పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా



డా.ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ పరిధిలోని మహేష్ నగర్ కాలనీ ప్రధాన రహదారుల్లో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ సమస్యను స్థానికుల పిర్యాదు మేరకు మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి, వాటర్‌వర్క్స్ ఇంజనీర్ స్రవంతి రెడ్డి గురువారం పరిశీలించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి, వాటర్ వర్క్స్ స్రవంతి రెడ్డి, సిబ్బంది సహదేవ్, అరుణ్, గోవర్ధన్, కాలనీ సభ్యులు గంగయ్య, సింగ్, సురేందర్ రావు, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా

రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వెంకటాపురం గ్రామంలో నూతనంగా చేపడుతున్న రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్థానిక కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ గౌడ్ అన్నారు. గురువారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రూ.40 లక్షల అంచనా వ్యయం తో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో వెంకటాపురం డివిజన్‌ను సమగ్రాభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. ఆయా అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భాస్కర్, రాజేష్ గౌడ్, విజయ్ కుమార్, జనార్ధన్, అరుణ్ గౌడ్, విజయశేఖర్, ప్రభాకర్, మోసిన్, కుట్టి, సూరజ్, తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానను సందర్శించిన కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్



నవతెలంగాణ-కాప్రా

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోనీ ఇందిరానగర్ కాలనీ బస్తీ దవాఖానను సందర్శించిన స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్. ఈ సందర్భంగా వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలు పేదప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజూ 70 నుండి 80 ఓపీ సేవలు అందిస్తున్నామనీ, తెలంగాణ డయాగ్నొస్టిక్ 50 సాంపుల్ బ్లెడ్ టెస్టులు చేస్తున్నామని తెలిపారు. షుగర్, బీపీ, ఫీవర్, కోల్డ్, కాఫ్ లకు వైద్యం అందిస్తున్నామని తెలిపారు. బుధవారం, శనివారం చిన్న పిల్లలకి టీకాలు వేయడం, ప్రెగ్నెన్సీ రెగ్యులర్ చెకప్ చేస్తూ, ప్రసవాలకు వారు కోరిన దవాఖానకు సమన్వయం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సు మధుబాల, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సమస్యల పరిష్కారంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్ విమర్శించారు. గురువారం మౌలాలి డివిజన్‌లో 3వ రోజు "హత్ సే హత్ జో డో యాత్ర" ఆర్టీసీ కాలనీ సెకండ్ బస్ స్టాప్, కృష్ణానగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నందికంటి శ్రీధర్ ఇంటి ఇంటికీ తిరుగుతూ స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మం చినీరు, డ్రైనేజీ, రోడ్లు, స్మశాన వాటికలో సరైన సౌకర్యాలు లేవని, తమ సమస్యలను పట్టించుకునే నాధుడే లేడని వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే ప్రజలకు మంచి జరుగుతుంద న్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తయారు చేసిన కరపత్రాలను ఇంటి ఇంటికి వెళ్ళి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ జీడి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పోల్కం వెంకటేష్, జీవన్ రెడ్డి, కె.రాములు, వి.శ్రీనివాస్ గౌడ్, ఉమేష్ సింగ్, సంతోష్ ముదిరాజ్, మహేందర్ గౌడ్ కుట్టి శీను, రాజేష్ గౌడ్, విట్టల్ ముదిరాజ్, నరసింహగౌడ్, రెబ్బ వాసు, సాయి, డివిజన్ ప్రెసిడెంట్ వంశీ ముదిరాజ్, కంటెస్టెడ్ కార్పొ రేటర్ ఉమామహేశ్వరి వినోద్ యాదవ్, అరుణ్ గౌడ్, హమీద్, కిరణ్, హైదర్, మీడియా కన్వీనర్ రామచందర్, రైముద్దీన్, శ్యామ్, రవి, క్రాంతి, ముక్తర్, చంద్రకళ, భాగ్యరాణి, అన్నమ్మ, ఆశయాదవ్ పాల్గొన్నారు.

గాంధీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు వార్డు 4లో బోర్డు మాజీ సభ్యులు నళినీ కిరణ్ ఆధ్వర్యంలో గురువారం అరుంధతి హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నళినీ వెంకట్రావుని అభినందించి మాట్లాడారు. కంటోన్మెంట్ ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా అన్ని రకాల వైద్య పరీక్షలు అరుంధతి హాస్పిటల్‌లో ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు. సమాజంలో చాలామంది ఆర్థిక ఇబ్బందుల వల్ల ప్రయివేటు హాస్పిటల్స్‌లో పెద్ద మొత్తంలో అయ్యే బిల్లు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నారనీ, అలాంటి పేదవారిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే అరుంధతి హాస్పటల్ "గిఫ్ట్ ఏ స్మైల్ " క్రింద దాదాపుగా 2000 పై చిలుకు శస్త్ర చికిత్సలు పూర్తిగా ఉచితంగా చేసినట్టు తెలిపారు. ఇకముందు కూడా ఉచితంగా అన్ని రకాల వైద్య సేవలు అందించినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ హాస్పిటల్స్‌ను బలోపేతం చేసి పేద ప్రజలకు ఆధునిక వసతులతో వైద్య సదుపాయాలు అందిస్తున్నట్టు తెలిపారు. మంత్రి హరీష్‌రావు నిరంతరం వైద్య సదుపాయాలు కల్పించడంలో రాజీలేని పోరాటం చేస్తున్నారని తెలిపారు. కంటి వెలుగు, కేసీఆర్ కిట్ వంటి వినూత్న పథకాలు ప్రజాదరణ పొంది దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారు తెలిపారు. అరుంధతి హాస్పిటల్ ద్వారా తాము అందిస్తున్న వైద్య సేవలను తమ వైద్య అవసరాల నిమిత్తం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకో వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, పాండు యాదవ్, సీనియర్ నాయకులు పెద్దల నరసింహా, ముప్పిడి మధుకర్, వార్డ్ 4 ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, గాంధి హాట్స్ కాలనీ ప్రెసి డెంట్ రాజేంద్ర, ప్రవీణ్ యాదవ్, సురేష్, ఇస్మైల్, నూర్, శ్రీకాంత్ యాకుబ్, గంగారాం, కిరణ్, సుజిత్, బంటీ, ఆశా వర్కర్స్ సంగీత, యదలక్ష్మి పద్మావతి, ఏడో అధ్యక్షుడు తేజ్ పాల్ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి గార్డెన్‌లో జాతీయ పట్టు వస్త్రాల ప్రదర్శన

నవతెలంగాణ-కంటోన్మెంట్



గ్రామీణ హస్తకళా వికాస్ సమితి నేతృత్వంలో కంటోన్మెంట్ సిక్ విలేజ్ శ్రీ రాజరాజేశ్వరీ గార్డెన్‌లో గురువారం జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన -2023ను ఇండియన్ బ్యాడ్మింటన్ ప్లేయర్ ఎం.నవ్య రావు ప్రారంభించి మాట్లాడారు. భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందనీ, నేటికి వాటిపై వన్నె తగ్గలేదన్నారు. నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో మోజు చూపుతున్నారని చెప్పారు. డిజైనర్లు సైతం దేశంలో చేనేత కారులు నేస్తున్న ఈ హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను సృజనాత్మకంగా డిజైన్ చేస్తున్నారని పేర్కొన్నారు. నిర్వాహకులు జి.గుప్తా మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో దేశంలోని 14 నగరాల నుంచి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటిరియల్ వంటి 50 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. చేనేతను ప్రతి ఒక్కరూ మరింత ఆదరించాల్సిన అవసరం ఉందనీ, పరోక్షంగా నేతకారులను ఆదుకున్న వారవుతామన్నారని చెప్పారు.

రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని ఓయూ ఉద్యోగి మృతి



నవతెలంగాణ-ఓయూ

తార్నాక చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉస్మానియా యూనివర్సిటీ ఇన్స్పెక్టర్ ఎల్. రమేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం ఓయూలోని ఎన్ఆర్ఎస్ హాస్టల్‌లో పనిచేసే అబ్దుల్ మోసిన్ (64) గురువారం సాయంత్రం చాయ్ తాగేందుకు సన్మాన్ హెూటల్ కు వెళ్లడానికి రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో మెట్టుగూడ నుంచి ఉప్పల్ వైపు వేగంగా వస్తున్న పల్సర్ బైక్ ఢీకొట్టడంతో తీవ్రగా యాలై అక్కడికక్కడే మరణించాడు. బైక్ పై ఉన్న వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతుడితో పాటు క్షతగాత్రుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అబ్దుల్ మెసీన్ ఎంతో మంచి వ్యక్తి, అని వృత్తిని చిత్తశుద్ధి తో నిర్వహిస్తున్నారని ఓయూలో ఆయన పని చేస్తున్న వసతి గృహ విద్యార్థులు పేర్కొన్నారు.

'కాలేజీలకు కొత్త భవనాల పనులను త్వరలో ప్రారంభిస్తాం'




నవతెలంగాణ-ఓయూ

సితాఫలమండీ ప్రభుత్వ హై స్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీలకు కొత్త భవన సముదాయాలు నిర్మించే పనులను త్వరలో ప్రారంభిస్తామని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ వెల్లడించారు. కొత్త భవనాల నిర్మాణానికి రూ.29.75 కోట్ల మేరకు నిధులను ముఖ్యమంత్రి నుంచి ప్రత్యేక అభివద్ధి నిధి నుంచి పద్మారావు గౌడ్ సాధించిన నేపథంలో కొత్త భవనాల నిర్మాణానికి వీలుగా పాత భవనాల కూల్చివేత పనులను అధికారులు గురువారం చేపట్టారు. ఈ పనులను పద్మారావు గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త భవనాల నిర్మాణం పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని, కొత్త భవనాలను మోడల్‌గా తీర్చిదిద్దాలన్నారు.

ఓయూ ఆర్ట్స్ కళాశాలకు మహర్దశ

- టూరిస్ట్ స్పాట్‌గా ఆర్ట్స్ కళాశాల..
- రూ.3 కోట్లతో మరమ్మతులు
- కేంద్ర టూరిజం ప్రాజెక్టు కింద రూ.10 కోట్లతో లైట్ అండ్ సౌండ్ సిస్టమ్, ఆర్ట్స్ కళాశాల చరిత్ర చెప్పే వాయిస్ ఓవర్
- ఇక ఆర్ట్స్ కళాశాలలో మరొక 50 ఏండ్లు వరకు మరమ్మతులు ఉండవు : ప్రిన్సిపాల్ ప్రొ.గణేష్





కురుస్తున్న ఆర్ట్స్ కళాశాల (ఫైల్ ఫోటో)

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కళాశాలకు మహర్దశ రానుంది. కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులు, పర్యటకులు కోరుకుంటున్నట్టు ఆర్ట్స్ కళాశాలను టూరిస్ట్ స్పాట్‌గా కేంద్ర ప్రభుత్వ టూరిజం శాఖ అభివృద్ధి చేయనుంది. గత కొన్ని సంవత్సరాలుగా భారీ వర్షాలు వస్తే ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో కురవడంతో పాటుగా కొన్ని విభాగాల్లో పెచ్చులు ఊడి పడటం జరిగేది. మరి కొన్నిచోట్ల రూఫ్ లీకేజీలో నీరు కారడం, కొన్నిచోట్ల ఫెన్సింగ్ మధ్యలో గ్యాప్స్ వచ్చిన సంగతి తెలిసిందే. దీనితో ఎట్టకేలకు ఓయూ అంతర్గత నిధుల నుంచి రూ కోట్ల రూపా యలు వెచ్చించి పూర్తి స్థాయిలో ఈ వేసవి కాలంలో మరమ్మతులు చేపట్టడానికి ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ పనులు చేజికించుకుంది. ఈ కంపెనీ సంబంధించిన ఇంజ నీర్స్ ఇప్పటికే రూఫ్ పరిశీలించి కోలతలు తీసుకున్నారు. ఏప్రిల్ నెలలో పనులు చేసేందుకు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారు.

అధునాతన టెక్నాలజీతో, మన్నిక తో కూడిన మరమ్మతులు

ఇప్పుడు ఉన్న " బ్లాక్ లేయర్ " ను తొలగించి తరువాత ఇనుప జాలితో కవర్ చేసి దానిపై వాటర్ ప్రూఫ్ కాంక్రీటుతో సిమెంట్ వేసి, వర్షపు నీరు నిల్వ లేకుండా సులభంగా వెళ్లేందుకు స్లోప్ ఉండే లా చర్యలు తీసుకుంటారని తెలిసింది.పూర్తి స్థాయిలో ఈ హెరిటేజ్ కట్టడం ఔనత్యాన్ని దెబ్బ తినకుండా మరమ్మతులు చేయనున్నారు.

కేంద్ర ప్రభుత్వం సహాయంతో లైట్ అండ్ సౌండ్ సిస్టమ్

కేంద్ర ప్రభుత్వ టూరిజం శాఖ సుమారు రూ. 11 కోట్ల వ్యయంతో టూరిజం ప్రాజెక్టులో భాగంగా ఆర్ట్స్ కళాశాల ఎదుట చెట్ల కింద ఒక కంట్రోల్ రూమ్ నిర్మించి, ఇప్పుడు ఉన్న ఫౌంటెన్ లోనే నూతనంగా కొత్త ఫౌంటెన్స్ ఏర్పాటు చేసి వాటి మీదుగా ఆర్ట్స్ కళాశాల మీదకు వివిధ రంగుల్లో లైటింగ్ పడేలా చేస్తుంది. ఇంకొక గొప్ప విషయం ఏమిటంటే సౌండ్స్ తో కూడిన లైట్స్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌తో పాటుగా ,ఒక ప్రత్యేకంగా వాయిస్ ఓవర్‌లో ఆర్ట్స్ కళాశాల చరిత్రను వివరిస్తారు. ఇలా లైట్ అండ్ సౌండ్ సిస్టమ్ కేవలం శనివారం, ఆదివారం రోజే ఉంటుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు ఆర్ట్స్ కళాశాలను ఇటీవలే పరిశీలించి పనులు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు కింద నగరంలో గోల్కొండ కోటలో, ట్యాంక్ బండ్ లో పూర్తి చేశారు.ఇక ఆర్ట్స్ కళాశాల వద్ద త్వరలోనే ఆ సేవాలు అందుబాటులోకి రానున్నాయి.

మరొక 50 సంవత్సరాలు ఆర్ట్స్ కళాశాల భద్రం



ఈ మరమ్మతులు చేపట్టి మరొక 50 సంవత్సరాల పాటుగా ఆర్ట్స్ కళాశాల కు ఎలాంటి మరమ్మతులు చేసేందుకు సమస్యలు ఉండవు. ఇక కేంద్ర టూరిజం శాఖ ప్రాజెక్టు కింద ఆర్ట్స్ కళాశాల ఎదుట పరిసర ప్రాంతాల్లో సుందర భవనంగా కనిపిస్తుంది. ఇక్క డ విద్యార్థులు, ఉద్యోగుల, టూరిస్టులు ఇక కళశాల ఒక టూరిస్ట్ స్పాట్,ఆహ్లాదకరమైన వాతావరణం గా మారుతుంది. ఇక దీని వల న అకాడమీక్ ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రొ.గణేశ్ చెప్పారు.

- ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.చింత గణేష్

సెకండ్ ఇయర్ పరీక్ష ప్రశాంతం

- జిల్లాలో తొలి రోజు 76060 మంది హాజరు
- 2972 మంది విద్యార్థులు గైర్హాజరు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు హైదరాబాద్ జిల్లాలో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 76,060 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 2,972 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లోకి అర్ధగంట ముందే విద్యార్థులను అనుమతించారు. సెకండ ఇయర్ విద్యార్థులకు మొదటి పరీక్ష కావడంతో ఉరుకులు పరుగులు తప్పలేదు.

హైదరాబాద్ జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షల నిర్వహ ణకుగాను 233 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 74991 జనరల్ విద్యార్థులకు గాను 72160 మంది విద్యా ర్థులు హాజరుకాగా 2831 మంది గైర్హాజరయ్యారు. వొకేషన్ విభాగంలో 4041 మంది విద్యార్థులకు గాను 3900 మంది హాజరవ్వగా 141 మంది గైర్హాజరయ్యారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 52,649 మంది విద్యార్థులకు గాను 51,652 మంది హజరు కాగా.. 997 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీస్, మాస్‌కాపియింగ్ వంటి ఎలాంటి కేసులు నమోదు కాలేదు. పరీక్ష కేంద్రాలను డీఈసీతో పాటు హైపవర్ కమిటీలు ఆకస్మికంగా తనిఖీలు చేశాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని పరీక్ష కేంద్రాలకు చేరుకోగా ఆయా సెంటర్ల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యార్థులు కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-అడిక్‌మెట్

పేద ప్రజలకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. అప్స ఆధ్వర్యంలో అమ్మ ఫౌండేషన్ సహకారంతో కవాడిగూడ డివిజన్ లోని బండనగర్ లో వివిధ రంగాలలలో సేవలు అందించిన మహిళలకు అంతార్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పేద కుటుంబానికి చెందిన 50 మంది గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ అప్స, అమ్మ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టాము అని తెలిపారు. మహిళా అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థలు సేవలు సంతోషకరం అన్నారు. మహిళలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందినప్పుడే సమాజంలో మహిళలకు గౌరవం దక్కుతుంది అన్నారు. నేటి సమాజంలో మహిళలు పురుషులకు సమానంగా అన్ని రంగాలలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అనిల్ కుమార్, అరుణ, అప్స ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్, అప్స సామజిక కార్యకర్త బొట్టు రమేష్, శ్రావణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



విభజన రాజకీయలను ఎదుర్కొనే రచనలు రావాలి

- సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీ శంకర్

నవతెలంగాణ-కల్చరల్

దేశం పాకిస్తాన్ భారత్‌గా సరిహద్దులు గీసుకొని విడిపోయినా మనదేశం లో నేడు మతం పేరిట విభజన రాజకీయాలు మనుషులను వేరు చేస్తున్నాయని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీ శంకర్ అన్నారు. రాజకీయాలు సినిమాలు, ఇతర సామాజిక మాధ్యమాలు ద్వారా వ్యాప్తి చెందుతొందని దీనిని ఎదుర్కొనే రచనలునేటి తక్షణా వసరం అని ఆయన పేర్కొన్నారు. రవీంద్రభారతి సమావేశ మందిరం లోభాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభ్యుదయ రచయితల సంఘం తెలంగాణ రాష్ట్ర విభాగం, పాల పిట్ట బుక్స్‌ల నిర్వహణ లో సాదాత్ హసన్ మంటూ ఉర్దూలో రచించిన అనార్కలి కథల అంజద్ తెలుగు అనువాద సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా గౌరీ శంకర్ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడుతూ కథలు అన్నీ మధ్య తరగతి ముస్లిం కుటుంబాల స్థితి గతుల పైనే కాకుండా సమాజంలో వారి పట్ల జరుగుతున్న వివక్షతలను వాస్తవిక కోణంలో ఆవిష్కరించారని అన్నారు. నేటి యువతకు దేశం లో జరుగుతున్న సంఘటన ల పై అవగాహన లేకపోవటం విచారకరం అన్నారు అధ్యక్షత వహించిన అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ అంజద్ ఉర్దూలో మింటు రాసిన కథలు మూలనికి భంగం కలుగుకుండా తెలుగులో స్వేచ్ఛగా ప్రాంతీయ నుడికారంతో అనువాదించారని అన్నారు.విమర్శకుడు ఏ. కె.ప్రభాకర్ కథలను సమీక్ష చేశారు. వేదిక పై రూప్ కుమార్,అబ్దుల్ వహీద్‌లు అంజద్ కు శుభాకాంక్షలు తెలిపారు

'నిరుద్యోగ యువత హక్కులు హరించడం జరుగుతోంది'

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

టీఎస్‌పీఎస్సీలో తరచు ప్రశ్న పత్రాల లీకేజ్ వల్ల రాష్ట్రంలోని నిరుద్యోగ యువత హక్కులు హరించడం జరుగుతోందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ అన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజ్ ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించి వెంటనే జోక్యం చేసుకుని హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే సమగ్ర విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ లో సీపీఐ హైదరాబాద్ జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.. జూనియర్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ పరీక్ష పత్రాలు లీక్ పై కేసును సిట్‌కు బదిలీ చేస్తే ఉపయోగం ఉండదని, ప్రశ్నపత్రాల లీకేజీని నిరోధించడంలో టీఎస్‌పీ ఎస్సీ పుర్తిగా విఫలమైందని, పారదర్శకత లోపించిందని, అక్రమాలు, అసమర్థ పని తీరు బైటపడ్డందున టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలని కోరారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం గత 9 ఏండ్లలో 23 కోట్ల మందిని దారిద్య రేఖకు దిగువకు నెట్టిందని, దేశాన్ని దోచుకు తినే అదానీ, అంబానీ లాంటి వారికీ బీజేపీ ప్రభుత్వం ప్రపంచంలో అత్యంత ధనవంతుల జాబితాలో చోటు కల్పించిందని అన్నారు. మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు సామాన్య ప్రజల ఇబ్బందులను తీవ్రతరం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.సామాన్య ప్రజానీకానికి విపరీతమైన బాధను కలిగిస్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజా ఉద్యమాల ద్వారా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాలనీల్లో, బస్తీల్లో పాదయాత్రలు నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలనీ కోరారు.గుడిసెవాసులకు ఇండ్ల పట్టాలకు, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు హైదరాబాద్ నగరంలో ఉద్యమాలు నిర్మించాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్, కాంపల్లి శ్రీనివాస్, పడాల నళిని, ఏం.వెంకట్ స్వామి, ఎండి.సలీమ్, ఆర్.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు తెలుగుదేశం పార్టీ పెద్దపీట

- టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పీ సాయిబాబా



నవతెలంగాణ-అంబర్‌పేట

అణగారిన వర్గాలకు తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేసి చటసభల్లోకి పంపించిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి సాయిబాబా అన్నారు. ఈ మేరకు గురువారం అంబర్‌పేట నియోజకవర్గంలోని నల్లకుంట డివిజన్‌లో ప్రజల కోసం ప్రగతి కోసం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి సాయిబాబా, భూపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బాలరాజు గౌడ్, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్ర చారి హాజరయ్యారు. టీడీపీ అంబర్ పేట నియోజకవర్గం ఇన్‌చార్జి బిల్డర్ ప్రవీణ్ ఆదేశాల మేరకు నల్లకుంట డివిజన్ అధ్యక్షులు రాచర్ల భాస్కర్ సమక్షంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి బొట్టు పెట్టి కరపత్రం ఇచ్చి తెలుగుదేశం పార్టీకి మద్దతు పలకాలని కోరాలన్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకొని పార్టీకి బలోపేతం పెంచాలని తెలుగుదేశం పార్టీకి మళ్లీ పూర్వ వైభవంగా కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఓ వెంకటేష్ చౌదరి, పెంటెం రాజు,రాంచందర్ గుప్తా, మధుసూదన్, సత్యనారాయణ, బిక్షపతి చారి, భాను ప్రకాష్, కిరణ్, దశరథ్, నల్ల అనిల్ కుమార్, రాహుల్ యాదవ్, పరశురాం, సాయి, తదితరులు పాల్గొన్నారు.

భరత్ నగర్‌లో డ్రయినేజీ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-అంబర్ పేట

బాగ్ అంబర్‌పేట డివిజన్ భరత్ నగర్‌లో రూ.10.70 లక్షల వ్యయంతో నూతనంగా వేయనున్న డ్రయినేజీ పైప్ లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పొరేటర్ పద్మావెంకట్ రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీలో పాదయాత్ర నిర్వహించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భరత్ నగర్ అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేనంతగా నిధులను అందిస్తూ ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు అండగా నిలిచి ఉన్నామని తెలిపారు. ఇటీవల 14.75 లక్షలతో ఇదే ప్రాంతంలో ఒక డ్రైనేజీ పైప్ లైన్ పనులను ప్రారంభించామని గుర్తు చేశారు. ప్రజలు కోరినట్టు దశల వారీగా ఇక్కడి డ్రయినేజీ రోడ్ల పనులు పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. అన్నీ సౌకర్యాలతో త్వరలో భరత్‌నగర్ సుందరంగా రూపుదిద్దుకో నుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు విష్ణువర్ధన్ రావు, మాజీద్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, ఈఎస్ ధనుంజయ, కన్నేట నర్సింగరావు, శివాజీ యాదవ్, మిర్యాల రవీందర్, రమేష్ నాయక్, మహేష్, శివ, జ్ఞానేశ్వర్, బీజేపీ నాయకులు ఈ అజయ్ కుమార్, మిర్యాల శ్రీనివాస్, బాలు, శివ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీల పై న్యాయ విచారణ జరిపించాలి



- డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్

నవతెలంగాణ -హైదరాబాద్

టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీలపై వెంటనే న్యాయ విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫలకనుమా రైల్వే స్టేషన్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్‌సీ బాధ్యత రాహిత్యం వల్లనే పేపర్ లీకేజీ అయిందన్నారు. ఈ ఘటనకు టీఎస్‌పీఎస్‌సీ చైర్మెన్, సభ్యులు, కార్యదర్శి పూర్తి బాధ్యత వహించి రాజీనామా చేయాలన్నారు. ప్రశ్నాపత్రాలు ఉండే రహస్య విభాగంలోకి ఇతర సెక్షన్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎలా ప్రవేశించారనీ ప్రశ్నించారు. వారు లోపటికి ఎలా వెళ్లారో, యూజర్ ఐడీ పాస్‌వర్డ్ వారి చేతికి ఎలా వచ్చాయో చెప్పాలన్నారు. ఈ రోజుల్లో నిరుద్యోగులు హాస్టల్లో ఉంటూ కోచింగ్ సెంటర్‌లో లక్షల రూపా యలు ఖర్చు చేస్తూ నానా ఇబ్బందులు పడుతూ కాంపి టీషన్ పరీక్షల కోసం సిద్ధపడుతున్నారని తెలిపారు. వారికి ఇలాంటి ఘటన నష్టదాయకమన్నారు. ఇకనైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ పేపర్ లీకేజీ ఘటనపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శ్రీను, రాజేష్, భరత్, సంతోష్, వినోద్ కుమార్, ఐద్వా నాయకురాలు లక్ష్మమ్మ సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి కిషన్ తదితరులు పాల్గొన్నారు.



అవినీతి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ - అడిక్‌మెట్

ప్రజలకు లభించే బియ్యం,గోధుమలు మరే ఇతర వస్తువుల తూకం,నాణ్యత సరఫరాలో ఎలాంటి అవినీతి జరగకుండా రేషన్ షాపు యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. గాంధినగర్ డివిజన్, టీఆర్‌టీ లోని రేషన్ షాపు నెంబర్ : 624 ను వారు ఆకస్మిక తనిఖీ చేప ట్టారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడుతూ రేషన్ కార్డు తో లబ్ది పొందాలసిన సరుకుల నాణ్యత, తూకంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రతి నెలా సరుకులతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద ప్రతి ఒక్కరికీ ఉచితంగా 5 కేజీల బియ్యం, అదనంగా అందిస్తున్న పథకం అమలుపై వివరాలు సేకరించారు. ఇదివరకు రేషన్ షాపు ద్వారా ప్రజలకు బియ్యం, గోధుమలతో పాటు లభించే నిత్యావసరాల వస్తువులు తిరిగి సరఫరా చేయాలి స్థానిక ప్రజలు ఈ సందర్భంగా కోరారు. అందుకు కార్పొరేటర్ స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీజేపీ నగర యువ నాయకులు ఎ. వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, ఆకుల సురేందర్, నర్సింహ, అధికారులు బి.విద్యాసాగర్ సీనియర్ చెకింగ్ ఇన్స్పెక్టర్, రాకేష్ జూనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్, రేషన్ షాపు డీలర్ సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా కాన్సులేట్‌కు ప్రతీ 20 నిమిషాలకో బస్సు

- 20 నుంచి ప్రత్యేక సర్వీసులు : సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న



నవతెలంగాణ-సిటీబ్యూరో

అమెరికా కాన్సులేట్ కార్యాలయాన్ని బేగంపేట నుంచి నానక్‌రామ్‌గూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు మార్చడంతో ప్రయాణికులు ఎటువంటి ఇబ్బంది పడకుండా ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్టు సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సిహెచ్.వెంకన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి నానక్‌రా మ్‌గూడలోని అమెరికన్ కాన్సులేట్‌కు ఈనెల 20 నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ బస్సులు ఉదయం 7.30గంటల నుంచి సాయంత్రం 6గంటల 25 నిమిషాల వరకు, అదేవిధంగా తిరుగు ప్రయాణంలో ఉదయం 8గంటల 5 నిమిషాల నుంచి రాత్రి 7గంటల 5నిమిషాల వరకు ఉంటాయన్నారు. ప్రతీ 20 నిమిషాలకు ఒక బస్సు చొప్పున మొత్తం 18 ట్రిప్పులు ప్రభు త్వ కార్యాలయాల పనిదినాల్లో తిరుగుతా యన్నారు. ప్రజలు, ఉద్యోగుస్తులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలను దృష్టిలో పెట్టుకుని కల్పించిన ఈ సర్వీసులను అందరూ సద్విని యోగం చేసుకోవాలన్నారు. సుఖవం తమైన, క్షేమకరమైన ప్రయాణం కోసం ఆర్టీసీలో ప్రయా ణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాబురావు కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- జలమండలి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జీ రాంబాబు యాదవ్

నవతెలంగాణ-హైదరాబాద్

మీరాలంలోని వాటర్ ఫిల్టర్ బెడ్ సెక్షన్ లో పనిచేస్తూ ప్రమాదవశాత్తు వాటర్ లో పడి మరణించిన ఏ బాబురావు కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించి వారి కుటుంబంలో అర్హులైన వారికి పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలని జలమండలి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి రాంబాబు యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ గుర్తింపు సంఘం అధ్యక్షులు రాంబాబు యాదవ్ నేతృత్వంలో జల మండలి ఎండీ దాన కిషోర్‌ను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రాంబాబు యాదవ్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణించిన బాబురావు కుటుంబాన్ని జలమండలి మానవతా దృక్పథంతో ఆదుకోవాలని అన్నారు. వాటర్ ఫిల్టర్ బెడ్స్‌లో పనిచేసే ఉద్యోగులకు జలమండలి సేఫ్టీ సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ విషయం పట్ల సానుకూలంగా స్పందించిన జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ ధన కిషోర్ బాబురావు భార్యకు పర్మెంటు ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎక్స్గ్రేషియా విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించి వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకొని బాబురావు కుటుంబానికి సహాయం చేస్తామని తెలిపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు అక్తర్, లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి జయరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నమ్మకమైన బ్రాండ్‌గా గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ

- యాంకర్ సుమ
- 'వజ్రం - యాజ్ ప్రీషియస్ యాజ్ యుఆర్' ప్రారంభం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రపంచంలో పేరుగాంచిన గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ తన నూతన కలెక్షన్ 'వజ్రం - యాజ్ ప్రీషియస్ యాజ్ యుఆర్' ను ప్రముఖ యాంకర్ సుమ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెండి ఆభరణాల ఔత్సాహికుల అవసరాలను తీర్చే గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ అతి తక్కువ కాలంలోనే మార్కెట్లో నమ్మకమైన బ్రాండ్‌గా స్థిరపడిందని తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. 92.5 ప్రీమియం వెండి సేకరణ గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ ఇప్పటికే వినియోగదారుల మధ్య ప్రాచుర్యం పొందిందన్నారు. ఇప్పుడు "వజ్రం - యాజ్ ప్రీషియస్ యాజ్ యుఆర్" బ్రాండ్ దాని వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుందామన్నారు. 'వజ్రం' సేకరణ ప్రీమియం వెండి ఆభరణాల అద్భుతమైన శ్రేణీ, ఇది క్లిష్టమైన నమూనాలను అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుందని చెప్పారు. వజ్రాల ఆభరణాలను సామాజిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ అందుబాటు ధరల్లో అందించాలన్నదే వజ్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సేకరణలో రింగులు, చెవిపోగులు, నెక్లెస్లు, మరిన్ని ఉన్నాయని ప్రీమియం 1205 వెండితో తయారు చేయబడ్డాయనీ తెలిపారు. సొగసైన,అందం ఆకర్షణ సారాంశం ప్రతిబింబించేలా ప్రతీ ఆభరణం ప్రత్యేకంగా రూపొందించారన్నారు.

10 వేల రోబోటిక్ సర్జరీల

మైలురాయిని దాటిన అపోలో హాస్పిటల్స్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రపంచంలోనే అతిపెద్ద వెర్టికల్ ఇంటిగ్రేటెడ్ హెల్త్ కేర్ ప్రొవైడర్ అయిన అపోలో, భారతదేశంలో రోగుల సంరక్షణలో ముందంజలో ఉన్నది. ఆరోగ్య సంరక్షణలో రోబోటిక్స్ విప్లవానికి నాయకత్వం వహిస్తున్నది, అపోలో ఇప్పటి వరకు 10,000లకు పైగా రోబోటిక్స్-అసిస్టెడ్ శస్త్ర చికిత్సలను నిర్వహించింది. కేవలం గత రెండేండ్లలోనే అపోలో గ్రూప్ భారతదేశంలోని తన హాస్పిటల్స్‌లో రోబోటిక్-అసిస్టెడ్ ప్రక్రియల సంఖ్య 400 శాతానికి పైగా పెరిగింది. అదనంగా, రోబోటిక్-అసిస్టెడ్ విధానాలను 20 ప్లస్ స్పెషాలిటీలకు హెల్త్‌కేర్ గ్రూప్ విస్తరించింది, పరిచయం చేసింది. తద్వారా రోగులకు భారతదేశంలో విస్తృతమైన లోత్కైన టెక్-ఎనేబుల్డ్ సర్జికల్ సొల్యూషన్‌లను అందిస్తున్నది.

రోబోటిక్ సర్జరీలను యూరాలజికల్, గైనకాలజీ, ఆంకాలజీ, ఆర్థోపెడిక్, కార్డియోథొరాసిక్ విధానాలలో గరిష్టంగా ఉపయోగిస్తున్నారు. ఈ విధానం ఉన్నతమైన క్లినికల్ ఖచ్చితత్వం కారణంగా, శస్త్రచికిత్సలలో రోబోటిక్‌లను ఉపయోగించడం వలన రోగి ఆస్పత్రిలో ఉండే సమయాన్ని గణనీయంగా తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తున్నది. చాలా సందర్భాలలో రోగి వేగంగా కోలుకోవడానికి వీలు కల్పిస్తున్నది. ఉదాహరణకు, సగటున, అపోలో హాస్పిటల్స్ రోగులు ఆస్పత్రిలో ఉండే సమయాన్ని జాయింట్ రీప్లేస్‌మెంట్ ప్రక్రియలలో 25 శాతం వరకు, యూరాలజికల్ ప్రక్రియలలో 20 శాతం వరకు, కార్డియాక్ రోబోటిక్ సర్జరీలలో 50 శాతం వరకు తగ్గించింది.

అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మెన్, డాక్టర్ ప్రతాప్ రెడ్డి ఈ మైలురాయి గురించి మాట్లాడుతూ.. "40 సంవత్సరాలుగా, రోగులకు అత్యుత్తమమైన సంరక్షణను అందించడానికి అపోలో చికిత్సలలో ఆవిష్కరణలకు మార్గదర్శకత్వం వహించింది. రోబోటిక్స్ అనేది అందరికీ ఉత్తమమైన ఆరోగ్య సంరక్షణను అందించాలనే మా మిషన్‌లో మరో ముందడుగు. రాబోయే దశాబ్దంలో మన దేశ వైద్య మౌలిక సదుపాయాలకు ఇది వెన్నెముకగా నిలుస్తుందని గట్టిగా నమ్ముతున్నాము. గత 10 సంవత్సరాలలో, మేము మా అన్ని హాస్పిటల్స్‌కు అత్యుత్తమైన రోబోటిక్ పరికరాలు అందుబాటులో ఉండేలా, రోబోటిక్స్‌లో మా సిబ్బంది నైపుణ్యాన్ని పెంపొందించడంలో విస్తృతంగా పెట్టుబడి పెట్టాము. మేము అత్యధిక సంఖ్యలో రోబోటిక్ కార్డియో సర్జరీలను నిర్వహించడం మొదలుకుని, భారతదేశపు మొట్టమొదటి డెడికేటెడ్ రోబో-అసిస్టెడ్ కార్డియాక్ సర్జరీ యూనిట్‌ను ప్రారంభించడం ఇంకా మరెన్నో మా స్వంత బెంచ్‌మా ర్క్‌లను నిరంతరం అధిగమించాము. ప్రతీ రోగికి అత్యుత్త మమైన శస్త్రచికిత్సా సంరక్షణను అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము. భారతదేశం, అలాగే ప్రపంచంలోని ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తులో రోబోటిక్-అసిస్టెడ్ విధానా లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని నమ్ముతున్నామన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన దూలపల్లి మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గ సభ్యులు



నవతెలంగాణ-దుండిగల్

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దూలపల్లి మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గ సభ్యులు గురువారం శంభీపూర్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడు మంత్రి రఘునాథ్, ఉపాధ్యక్షులు బర్మా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి గంగయోల శివ, కార్యదర్శులు నాయికోటి కిషోర్, ప్రచార కార్యదర్శులు పూజారి మహేష్, కోశాధికారి ఆర్.వెంకటేష్, కార్య నిర్వాహక సభ్యులు వరగంతం నాగరాజు, సలహాదారులు బూర్గుబావి సత్యనారాయణ, గంగయ్యోల వెంకటేష్, మంత్రి రుషిరాజ్, పోశెట్టి అశోక్, బర్మా ప్రవీణ్, గరిశె సతీష్, గంగయ్యోల పెంటయ్య, దొడ్ల నాగరాజు, పోశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మీర్పేట్ హెచ్ బి కాలనీ పరిధిలో మెయిన్ రోడ్డు డీ-మార్ట్ పికప్ పాయింట్ ఎదురుగా డైమండ్ హిల్స్ కాలనీ మైనారిటీ సోదరులు ఏర్పాటు చేసిన చలివేంద్రంను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షులు గుండారపు శ్రీనివాస్ రెడ్డి. అనంతరం వారు మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. చలివేంద్రం ఏర్పాటుకు ముందుకు వచ్చిన నిర్వాహకులను అభినందించారు. సామాజిక సేవల్లో యువత ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్, ముజ్జు, సుమైర్ ఇబ్రహీం, సజ్జాత్, రిజ్వాన్, జమీర్, నాజీద్ జాన్, జుబైర్, ఫరాన్, ముజ్జూ, ఇలియాన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గరిక సుధాకర్, పిట్ట నరేష్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్, స్థానిక యువత పాల్గొన్నారు. **నవతెలంగాణ-కాప్రా**

కొండాపూర్‌లో మిల్లెట్ ఎక్స్‌ప్రెస్ అవుట్‌లెట్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

మిల్లెట్ ఆహారాన్ని చౌకగా, అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా మిల్లెట్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. మెనూలో 110 కంటే ఎక్కువ చిరుధాన్యాల వంటకాలతో, సంస్థ వేగంగా అభివద్ధి చెందుతూ, తన లక్ష్యాన్ని చేరుకుంటోంది. న్యూట్రిహబ్ (ఐఐఎంఆర్) డైరెక్టర్, సీఈఓ డాక్టర్ దయాకర్‌రావు కొండాపూర్‌లో మిల్లెట్ ఎక్స్‌ప్రెస్ 16వ అవుట్‌లెట్‌ను ప్రారంభించారు. వినియోగదారులకు ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించే అత్యంత ప్రియమైన ఆహార బ్రాండ్ కావాలనే దష్టితో మిల్లెట్ ఎక్స్‌ప్రెస్ 2019లో ప్రారంభమైంది. అవుట్‌లెట్‌ను ప్రారంభించిన సందర్భంగా డాక్టర్ దయాకర్‌రావు మాట్లాడుతూ, 'చిరుధాన్యాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వాటిలో పీచు పదార్థాలు (ఫైబర్), మాంసకత్తులు (ప్రోటీన్), ఇనుము (ఐరన్) పుష్కలంగా ఉంటాయి. రోజువారీ భోజనంలో బియ్యం బదులు చిరుధాన్యాలు తీసుకుంటే మధుమేహం పూర్తి నియంత్రణలో ఉంటుంది. న్యూట్రిహబ్ ఇంక్యుబేషన్ ప్రోగ్రాంలో మిల్లెట్ ఎక్స్‌ప్రెస్ ఒక భాగం. చిరుధాన్యాల విషయంలో ఈ బ్రాండ్ సష్టించిన అవగాహన పట్ల మేం గర్విస్తున్నాము. న్యూట్రిహబ్‌లో ఇలాంటి స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సపోర్ట్, టెక్నికల్ సపోర్ట్ అందిస్తున్నాం. ఇలాంటి మరిన్ని స్టార్టప్‌లను ప్రోత్సహించి న్యూట్రిహబ్ కింద ఈ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వారిని ఆహ్వానిస్తున్నాం. మిల్లెట్ ఎక్స్‌ప్రెస్ వ్యవస్థాపకులు తమ వ్యాపారాన్ని పెంచుకోవాలనుకుంటే వీరికి మద్దతు ఇవ్వడానికి మేము సదా సిద్ధంగా ఉన్నాం' అని చెప్పారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు వెంకటేష్, వెంకన్నబాబు, పవన్‌కుమార్ మాట్లాడుతూ 'ఆరోగ్యకరమైన ఆహారం అంటేనే అంత రుచిగా ఉండదని సాధారణంగా అనుకుంటారు. రుచికరమైన వంటకాలతో ఈ అపోహను దూరం చేయాలన్నదే మా లక్ష్యం. ఇక్కడ దక్షిణ భారత వంటకాల నుంచి ఉత్తర భారత వంటకాల వరకు అన్నీ ఉన్నాయి. వీటిలో మల్టీ గ్రెయిన్ ఇడ్లీ, రోటీ, మిల్లెట్ పూరీ, కిచిడీలు.. ఇలా ఎన్నో ఉన్నాయి. ఒక కిలో వరి ఉత్పత్తికి సుమారు 2200 లీటర్ల నీరు అవసరం. చిరుధాన్యాలకు అందులో సగం కంటే తక్కువ సరిపోతాయి. చిరుధాన్యాలకు మారడం ఆరోగ్యకరమైన నిర్ణయం మాత్రమే కాదు, మన భూగర్భ జలమట్టాలను రక్షించడానికి మంచి ఎంపిక. మేం ప్యాకేజింగుకు బయోడీగ్రేడబుల్ ఉత్పత్తులే వాడుతున్నాం' అని అన్నారు.



జాబ్ మేళాకు వచ్చే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయంలో ఏప్రిల్ 2వ తేదీన జరగబోవు మెగా జాబ్ మేళాకు సంబంధించి అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక అధికారులతో మాట్లాడుతూ ట్రాఫిక్, శాంతిభద్రతల విషయంలో ఎలాంటి సమస్య లేకుండా చూడాలనీ, ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. పారిశుధ్యం విషయంలో ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ, వచ్చిన వారికి మంచినీళ్ల సదుపాయం, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరు అవుతుండటంతో వారికి అవగాహన కల్పించేటట్లు సూచిక బోర్డులు, వాలంటీర్లు అందరూ అందుబాటులో ఉండేలా పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, అన్ని విభాగాల అధికారులు నాయకులు పాల్గొన్నారు. అనంతరం జాబ్ మేళా కరపత్రాన్ని ఆవిష్కరించారు.



అభివృద్ధి పనుల పరిశీలన

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు రోడ్ల వైడెంగ్ కోసం సన్నాహాలు చేపడుతున్నట్టు మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. గురువారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఖైత్లాపూర్ లో రోడ్ వైడింగ్ కోసం కేపీహెచ్‌బీ కాలనీ ధనలక్ష్మి సెంటర్ పార్క్ డెవలప్మెంట్ పనులను కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెంబర్ 2 లో జరుగుతున్న కల్వర్టు పనులను జీహెచ్ఎంసీ అధికారులు డిఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ డిఈ స్వప్నతో కలిసి ఆయన పరిశీలించారు. డివిజన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జరుగుతున్న పనుల పట్ల జాగ్రత్త వహించాలనీ, నాణ్యతతో కూడిన పనులు త్వరతగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దినేష్, సుశీల్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



దుండిగల్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద పర్యటన



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ గ్రామంలో 'ప్రగతి యాత్ర'లో భాగంగా 23వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్లతో కలిసి పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరలోనే పూర్తి చేసేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.

దుండిగల్ సింగపూర్ మైసమ్మ ఆలయం మీదుగా అన్నారం వరకు గల లింకు రోడ్డు ఏర్పాటుకు ఆర్టీపీ సిద్ధం చేసి తన దృష్టికి తీసుకురావాలనీ, త్వరలోనే ప్రభుత్వం ద్వారా ప్రత్యేక జీవో కింద ఉత్తర్వులు జారీ చేసి పూర్తి చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. చివరగా అపర్ణ నుంచి సింగపూర్ మైసమ్మ అలయంకు రోడ్డు ఏర్పాటుకు ఇబ్బందులు లేకుండా హెచ్ఎండీఏ, స్థానిక కమిషనర్‌తో ఎమ్మెల్యే చర్చించి సమస్యను పరిష్కరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చిన్నంగి వెంకటేశం, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ యాదవ్, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, జక్కుల కృష్ణా యాదవ్, ఆనంద్, స్థానిక మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణా రెడ్డి, పాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, సీనియర్ నాయకులు జక్కుల శ్రీనివాస్ యాదవ్, శ్రీను, ఉప్పరి కృష్ణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి వార్డు కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల వేతనాలపై సమావేశం ఏఐటీయూసీ నాయకులు పాలాబిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ మున్సిపాల్ కార్మికుల రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసు రత్నం, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాములు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిస్కారించడానికి ఎర్ర జెండా ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. రెండు నెలలుగా వేతనాలు రావటం లేదనీ, వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. రూ.24వేల వేతనం ఇవ్వాలనీ, అంబేద్కర్ జయంతి తర్వాత ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కె.శివ కుమార్, మున్సిపల్ నాయకులు ఆశి, యాదయ్య మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హైదర్ నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తా



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్ నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని మిత్ర హిల్స్ నుంచి మియాపూర్ మెట్రో స్టేషన్ వరకు ఉన్న లింక్ రోడ్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాస్ క్లీన్ డ్రైవ్ ప్రోగ్రామ్‌లో కాలనీ వాసులతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిత్యం లింక్ రోడ్‌ను ఎక్కువ మంది ప్రజలు ఉదయం సాయంత్రం ఆరోగ్యం కోసం వాకింగ్, సైక్లింగ్ చేస్తున్నారనీ, అందుకు అనుగుణంగా రోడ్లను శుభ్రత పాటిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి తన వంతు శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ శ్రీకాంత్, రాంకీ సిబ్బంది, నక్క శ్రీనివాస్, సత్యనారాయణ, హబీబ్, ఎల్ల స్వామి, కష్ణ రెడ్డి, ఇమ్రాన్, విమల, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్లీప్ సొసైటీతో ఒప్పందం కుదుర్చుకున్న పీఅండ్‌జీ

నవతెలంగాణ-హైదరాబాద్

కొన్ని రాత్రుళ్ల నిద్ర పోయేందుకు మీరు ఇబ్బంది ఎదుర్కొంటున్నారా..? లేదా నిద్ర లేచిన తర్వాత కూడా అలసి పోయినట్లు అనిపిస్తుందా.? కొన్నిసార్లు గడియారం అలారం మోగేందుకు ముందే లేదా రాత్రిపూట చాలా సార్లు మేల్కొంటారా.? అలా అయితే మీరు అప్పుడప్పుడు నిద్రలేమిని ఎదుర్కొంటు న్నారని స్పష్టంగా చెప్పవచ్చని పీఅండ్ (ఇండియా) హెల్త్కేర్ సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్, కేటగిరీ లీడర్ సాహిల్ సేథి తెలిపారు. కాంటార్, పీఅండ్ జీ నిర్వహించిన ఒక నేషనల్ స్లీప్ సర్వేలో దాదాపు 85శాతం మంది భారతీయులు తమ నిద్రతో సంతృప్తి చెందడం లేదని వెల్లడించారని ఆయన తెలిపారు. మరో 60శాతం మంది అప్పుడప్పుడు నిద్రలేమిని ఎదుర్కొంటున్నట్లు వెల్లడించారని ఆయన గుర్తు చేశారు. స్లీప్ హెల్త్ ప్రపంచ నాయకుడిగా, ప్రపంచ నిద్ర దినోత్సవం-2023కు గర్వించదగిన భాగస్వామిగా పీఅండ్ చేప ట్టిన ఉద్యమంతో భారతీయులు బాగా నిద్రపోయేలా చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. సంగీత నిర్మాత, స్వరకర్త యష్రరాజ్ ముఖాటే మాట్లాడుతూ ఆరోగ్యకరమైన నిద్ర కోసం ఏ విధంగా చర్యలు తీసుకొ "వాలనుకుంటున్నారో చూపడం ద్వారా మేక్ ఇండియా స్లీప్ బెటర్ కోసం ఉద్య మంలో చేరాలని కోరారు. పీఅండ్ జీ హెల్త్ గ్రూప్ హెడ్ సైంటిస్ట్, మెడికల్ అండ్ టెక్నికల్ అఫైర్స్ డా.యోంగ్ చియాట్ వాంగ్ మాట్లాడుతూ స్లీప్ మేనేజ్మెంట్ సొల్యూషన్స్ సింపోజియంను కూడా ప్రారంభిస్తోందని తెలిపారు.

ఉరేసుకుని 8వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్ నగర్ హనుమాన్ గుడి సమీపంలో నివాసముండే సుజిత్ కుమార్ కుమారుడు ప్రియాన్షు రాజ్ (14) బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీపంలో గల ఒక ప్రైవేట్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న ప్రియాన్షు రాజు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటన స్థలానికి చేరుకున్న పెద్దషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'అకాడమిక్ ఇయర్ పూర్తి కాకముందే అడ్మిషన్లా..?'



నవతెలంగాణ-మేడ్చల్

2022-2023వ అకాడమిక్ ఇయర్ పూర్తి కాకముందే అడ్మిషన్లు ప్రారంభించిన ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. అకాడమిక్ ఇయర్ పూర్తికాకముందే ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు బహిరంగంగా అడ్మిషన్లు ప్రారంభించి విద్యా సంస్థల ముందు బ్యానర్లు కట్టి, విద్యార్థుల ఇంటి దగ్గరకి వెళ్లి తమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభించామనీ, మీ పిల్లలను మా పాఠశాలలో చేర్పించండని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తూ డబ్బులు దండుకుంటునన్నారని తెలిపారు. అలాంటి విద్యాసంస్థలపై మండల, జిల్లా విద్యా శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మేడ్చల్ మండలంలో విచ్చలవిడిగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు డబ్బులు దండుకుంటున్నా మండల విద్యాశాఖ అధికారి పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క పాఠశాల పై కూడా చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కి విద్యాశాఖ అధికారుల మాటలు కూడా పట్టించుకోకుండా తాము అడ్మిషన్ ప్రారంభించుకుంటాం మీరు ఏం చేయదలుచుకుంటే అది చేసుకోండని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యంలు ఎస్ఎఫ్ఐ నాయకులకు సవాలు విసురుతున్నారని తెలిపారు. మేడ్చల్ జిల్లాలో మండల, జిల్లా విద్యాధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు దండుకుంటూ అడ్మిషన్లు ప్రారంభించాయని తెలిపారు.

ప్రభుత్వ తప్పిదంతోనే పేపర్ లీకేజీ ఘటన

- కుల నిర్మూలన వేదిక

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ అత్యంత ప్రతిష్టాత్మకంగా, పకడ్బందీగా నిర్వహించాల్సిన పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటన కేవలం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జరిగిందని, లక్షలాది నిరుద్యోగ అభ్యర్థులను నిండా ముంచిన ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ తక్షణమే రాజీనామా చేయాలని కుల నిర్మూలన వేదిక(కెఎన్‌వీ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణలోని పాలకులు, అధికారులు, దళారులతో కుమ్మక్కై అంగట్లో సరకుల్లాగా ఉద్యోగాలను అమ్ముకుంటున్నారని కెఎన్‌వీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాపని నాగరాజు, కోటా ఆనంద్ మండిపడ్డారు. సుదీర్ఘకాలం ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం విద్యార్థి నిరుద్యోగులు అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో దాదాపు 2.50లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం 50వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి ఆ ఉద్యోగాలనూ అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్కారు చేస్తున్న కుట్రలను రాష్ట్రంలోని నిరుద్యోగులు గమనించి కేసీఆర్ పాలనను గద్దె దించే విధంగా పోరాడాలన్నారు. కేసీఆర్‌ను గద్దె దించితేనే విద్యార్థి నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని వారు స్పష్టం చేశారు. ఆవైపుగా పోరాడాలని విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు కెఎన్‌వి రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

గ్రూపు-1 ఎంపిక విధానంపై సమీక్షించాలి

- తెలంగాణ ప్రజల పార్టీ నేత మురళీధర్‌గుప్త

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 ఎంపిక విధానంపై పునర్ సమీక్షించి, ఇంతవరకు జరిగిన అన్ని పరీక్షల లీకేజీలపై సీబీఐ చేత ఎంక్వైరీ చేయించాలని తెలంగాణ ప్రజల పార్టీ నేత మురళీధర్ గుప్త డిమాండ్ చేశారు. తెలంగాణలో అత్యంత ముఖ్యమైన గ్రూప్-1పోస్టులకు ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం ఇంటర్వ్యూ లేకుండా రిక్రూట్ చేయాలనే విధానాన్ని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ఎంపిక విధానంలో రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉంటే తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే కేవలం రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేయాలని ఎందుకు నిర్ణయించారని, దీనివల్ల ఎన్నో అనుమానాలకు దారితీస్తుందని అన్నారు. గ్రూప్-1 లాంటి ఉద్యోగానికి తప్పనిసరిగా నాయకత్వ లక్షణాల గురించి, నిర్ణయాలు తీసుకునే విధానం గురించి ఇంటర్వ్యూ ఉండాలని అన్ని రాష్ట్రాల కమిషన్లు, నిపుణులు సూచిస్తుంటే తెలంగాణలో ఎందుకు ఇంటర్వ్యూలు తీసేశారరో అర్థంకావడంలేదన్నారు. గ్రూప్-1, ఇతర రిక్రూట్మెంట్‌ల లీకేజీలపై సీబీఐ, సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి దోషులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సెక్రటరీ జనరల్ ఇసంపల్లి సుదర్శన్, జనరల్ సెక్రెటరీ నరసయ్యగౌడ్, వైస్ ప్రెసిడెంట్ పోలావంశీకష్ణ, అడ్వైజర్స్ డాక్టర్ కె.సూర్యనారాయణ, యువజన విభాగం అధ్యక్షుడు బండారి శ్రీనివాస్, యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ అబ్బురబోయిన అంజి, ప్రభు పాల్గొన్నారు.



వియ్ మేక్ స్కాలర్స్ స్టడీ ఎబ్రాడ్ ఫండింగ్ ఎక్స్‌పో ఆర్థిక సహాయం

నవతెలంగాణ-హైదరాబాద్

వియ్ మేక్ స్కాలర్స్ భారతదేశంలో అతి పెద్ద స్టడీ ఎబ్రాడ్ ఫండింగ్ ఎక్స్‌పో(సేఫ్)ను బేగంపేటలోని మనోహర్ హోటల్లో నిర్వహించింది. తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి ఈ ఎక్స్‌పోకు అపూర్వమైన స్పందన లభించింది. విదేశీ విద్యకు సంబంధించి విద్యార్థులకు సమగ్రమైన మార్గనిర్దేశకత్వమూ ఇక్కడ లభించింది. ఆర్థిక అవరోధాల కారణంగా ఏ ఒక్కవిద్యార్థి తమ విదేశీ విద్య కలను వదులుకోకూడదనే లక్ష్యంతో సేఫ్ 2023ను వియ్ మేక్ స్కాలర్స్ నిర్వహించింది. విద్యార్థులకు అంతర్జాతీయ స్కాలర్షిప్లను అన్వేషించే అవకాశం లభించడంతో పాటు, అతి తక్కువ వడ్డీ రేట్లకు విద్యా రుణాలను పలు బ్యాంకుల నుంచి పొందే అవకాశం సైతం లభించింది. విద్యార్థులు తమ ప్రొఫైల్‌కు అనుగుణంగా ముఖాముఖి మార్గ నిర్దేశకత్వం పొందారు. వియ్ మేక్ స్కాలర్స్ నిర్వహించిన ఈ స్టడీ ఎబ్రాడ్ ఫండింగ్ ఎక్స్పో 2023కు దాదాపు 2వేల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. వియ్ మేక్ స్కాలర్స్ కోఫౌండర్ దామిని మహాజన్ మాట్లాడుతూ విదేశీ విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు ఫండింగ్ సమస్యను తీర్చడం ఈ ఎక్స్పో ప్రధాన లక్ష్యమన్నారు. దాదాపు 1000మంది విద్యార్థులకు సూత్రప్రాయంగా విద్యారుణాలను మంజూరుచేయడం జరిగింది. ఒకే రోజు ఇంతమందికి రుణాలను మంజూ రు చేయడం ఓ రికార్డు అని అన్నారు.



కాంతారకు అరుదైన గౌరవం

● నేడు ఐక్యరాజ్య సమితిలో ప్రదర్శన

కేవలం 15 కోట్లతో రూపొంది ప్రపంచ వ్యాప్తంగా రూ.400 కోట్లని కొల్లకొట్టిన 'కాంతార' చిత్రానికి అరుదైన గౌరవం లభించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు, విమర్శకులు మెచ్చిన చిత్రంగానే కాకుండా తక్కువ బడ్జెట్‌తో రూపొంది భారీ కలెక్షన్లు సాధించిన సినిమాగా ఘనతకెక్కిన 'కాంతార' మరోమారు వార్తల్లో నిలిచి తన సత్తా చాటుకోవడం విశేషం. నేడు (శుక్రవారం) ఈ చిత్రం జెనీవాలోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ప్రదర్శితం కానుంది. ఈ సినిమా స్క్రీనింగ్ కోసం చిత్ర హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి ఇప్పటికే అక్కడికి చేరుకున్నారు.

ఐరాసలో ప్రదర్శితమవుతున్న మొదటి కన్నడ 'కాంతార' కావడం విశేషం. ఈ చిత్రం ఈ గౌరవాన్ని పొందడానికి కారణం సినిమాలో ఉన్న కంటెంటే. యూనివర్సల్ కంటెంట్‌తో తెరకెక్కిన చిత్రం కావడంతో ఐరాసలో ఈ చిత్రాన్ని స్క్రీనింగ్‌కు ఎంపిక చేశారు. ఐరాస పాథె బలెక్సెర్ట్ హాల్ నెం.13లో ఈ చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శనకు ఐరాస ప్రముఖులందరూ హాజరకానున్నారు. వారందరితో కలిసి రిషబ్‌శెట్టి ఈ సినిమాని వీక్షించనున్నారు. అలాగే ఈ సినిమా ప్రదర్శన అనంతరం ఆయన ఈ సినిమాలోని కంటెంట్ గురించి, భారతీయ సినిమా గురించి మాట్లాడబోతున్నారు.

ముఖ్యంగా ఈ సినిమా చిత్రీకరణ జరిగిన ప్రధాన అంశమైన అడవుల పరిరక్షణ, అటవీ ప్రాంతంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న గిరిజనుల సమస్యలు, అడవులలో ఉండే వాతావరణం, పర్యావరణానికి సంబంధించిన రక్షణ వంటి విషయాలపై ఆయన చర్చించనున్నట్టు తెలుస్తోంది. విశేష ఆదరణ పొందిన 'కాంతార' చిత్రానికి సీక్వెల్‌ని త్వరలోనే ప్రారంభించబోతున్నట్టు దర్శకుడు రిషబ్‌శెట్టి ఇటీవల ప్రకటించిన విషయం విదితమే.

నవచిత్రం



ఏ.ఆర్.రెహ్మాన్

రెండు ఆస్కార్ పురస్కారాలను కైవసం చేసుకుని యావత్ భారతదేశం గర్వపడుతున్న తరుణంలో ఆస్కార్ విజేత, సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహ్మాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మన దేశం నుంచి ఆస్కార్‌కి పంపిస్తున్న సినిమాలపై ఓ ఛానెల్‌లో కామెంట్స్ చేశారు. ఇప్పుడీ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఆస్కార్‌కు అర్హతలేని సినిమాలు

'కొన్ని సార్లు మన సినిమాలు ఆస్కార్ వరకు వెళ్లి నిరాశతో వెనక్కు వస్తున్నాయి. అర్హత లేని సినిమాలను ఆస్కార్‌కు పంపిస్తున్నారు. అలాంటప్పుడు చూస్తుండటం తప్ప మనం ఏమి చేయలేం' అని అన్నారు. అర్హత ఉన్న 'ఆర్‌ఆర్‌ఆర్'ని కాకుండా గుజరాతి సినిమా 'ఛెల్లో షో'ని ఆస్కార్ కోసం విదేశీ సినిమా విభాగంలో ప్రభుత్వం పంపడాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తున్నట్టు తేట తెల్లమవుతోంది. 95వ ఆస్కార్ పురస్కారాల్లో 'ఆర్‌ఆర్‌ఆర్'లోని నాటు..పాట, 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' షార్ట్ ఫిల్మ్ ఆస్కార్‌లను దక్కించుకుని విజయకేతనం ఎగురవేశాయి.



మొయిద ఆనందరావు

మిథునం నిర్మాత ఆనందరావు కన్నుమూత

టాలీవుడ్‌లో మరో విషాదం చోటు చేసుకుంది. 'మిథునం' వంటి అద్భుతమైన చిత్రాన్ని తెరకెక్కించిన మొయిద ఆనందరావు (57) కన్నుమూశారు.

డయాబెటిస్‌తో బాధపడుతున్న ఆయన కొంతకాలంగా వైజాగ్ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. విజయనగరం జిల్లా రేగిడి మండలం వావిలవలస గ్రామానికి చెందిన ఆనందరావు వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. సంఘసేవకుడిగా కూడా ఆయనకు మంచి పేరుంది. అందుకే తన స్వగ్రామంలో రూ.25 లక్షలు ఖర్చు చేసి ఓ లైబ్రరీని కూడా ఏర్పాటు చేశారు. సాహిత్యంపై కూడా ఆయనకు మక్కువ ఎక్కువ. పర్యావరణ హిత పద్యాలను రాసి 'కోటిగాడు' పేరుతో ప్రచురించేవారు. ఇక సినిమాల విషయానికొస్తే 2012లో 'మిథునం' సినిమాను నిర్మించారు. ఈ సినిమాలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మీ కీలక పాత్రల్లో నటించారు. తనికెళ్ల భరణి ఈ చిత్రానికి దర్శకుడు. ప్రేక్షకులను, విమర్శకులను కూడా ఎంతగానో మెప్పించిన ఈ చిత్రానికి నంది అవార్డు కూడా లభించింది. ఆనందరావుకు భార్య పద్మినితో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నేడు (శుక్రవారం) ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నట్టు సన్నిహితులు చెప్పారు.

మీరైనా.. ఆర్‌ఆర్‌ఆర్
నిర్మాతని గుర్తించారు

శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 25 ఏండ్లుగా తెలుగు సినీ పరిశ్రమలోని నటీనటులకు, సాంకేతిక నిపుణులకు అవార్డులు అందిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తోంది. ఈ సంస్థ ఈ ఉగాది సందర్భంగా తమ 25వ సిల్వర్ జూబ్లీ ఉగాది పురస్కారాలను అందించనుంది.

ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, '25 మంది అవార్డు గ్రహీతలకు వెండి మెమోంటోలు ప్రదానం చేయాలని నిర్ణయించాం. ఈ కార్యక్రమానికి ప్రముఖులు హాజరవుతున్నారు. ఉగాది రోజున చెన్నైలోని మ్యూజిక్ అకాడమీలో ఈ వేడుక జరగనుంది' అని అన్నారు.

'సినీ అవార్డులతో పాటు మహిళా రత్న పురస్కారాలను, అలాగే ఆస్కార్ అవార్డు పొందిన చంద్రబోస్‌కు సత్కారం, జీవిత సాఫల్య పురస్కారాన్ని దర్శకులు రమేష్ ప్రసాద్‌కి అందిస్తున్నారు. బాపు-రమణ అవార్డును హను రాఘవపూడికి, బాపు బొమ్మ అవార్డును సీనియర్ నటి ఈశ్వరి రావుకి అందజేయనున్నారు. ఆస్కార్ వాళ్ళు నిర్మాతను గుర్తించకపోయినా 'ఆర్‌ఆర్‌ఆర్' నిర్మాత దానయ్యను మీరు గుర్తించి ఉత్తమ నిర్మాతగా అవార్డు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది' అని నిర్మాతలు ప్రసన్న కుమార్, టి.రామసత్యనారాయణ తెలిపారు.



బేతిరెడ్డి శ్రీనివాస్, టి.రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్, రాంబాబు తదితరులు



మాళవిక నాయర్, నాగశౌర్య, వివేక్ కూచిభొట్ల

విజయం ఖాయం

నాగశౌర్య, శ్రీనివాస్ అవసరాల కాంబినేషన్‌లో 'ఊహలు గుసగుసలాడే', 'జ్యో అచ్యుతానంద' తర్వాత వస్తున్న హ్యాట్రిక్ ఫిల్మ్ 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, దాసరి ప్రొడక్షన్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించింది. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మాతలు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రంలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా నేడు (శుక్రవారం) థియేటర్లలో భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్‌ని నిర్వహించి, చిత్ర విజయం పట్ల వారికున్న నమ్మకాన్ని వ్యక్తం చేసింది.

చిత్ర సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల మాట్లాడుతూ, "నాగశౌర్య, మాళవికల సహజమైన నటన కోసం ఈ సినిమా చూడొచ్చు. శ్రీనివాస్ ఆయన గత చిత్రాల మాదిరిగానే ఈ చిత్రాన్ని కూడా ఎంతో హృద్యంగా రూపొందించారు. కళ్యాణి మాలిక్ సంగీతానికి ఇప్పటికే విశేష స్పందన లభించింది. ఈ సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. విజయోత్సవ సభలో మళ్ళీ కలుద్దాం' అని అన్నారు. 'ఇంత మంచి చిత్రంలో మమ్మల్ని భాగస్వాములు చేసినందుకు విశ్వకి, వివేక్‌కి కృతజ్ఞతలు' అని నిర్మాత దాసరి ప్రసాద్ చెప్పారు.

జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించండి

- భారత ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర ప్రతిపక్ష పార్టీల వినతి పత్రం
- దేశరాజధానిలో జాతీయ ప్రతిపక్ష పార్టీల నాయకులతో సమావేశం





న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లో పరిస్థితిపై చర్చించడానికి గురువారం ఢిల్లీలోని కానిస్టిట్యూషనల్ క్లబ్‌లో జాతీయ ప్రతిపక్ష పార్టీల నాయకులు, జమ్మూకాశ్మీర్ ప్రతిపక్ష పార్టీల నాయకులు సమావేశం నిర్వహించారు. జమ్మూకాశ్మీర్ ప్రజల హక్కులను, జమ్మూకాశ్మీర్ రాష్ట్రహోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జమ్మూలో ఇటీవల జరిగిన అఖిల పక్ష సమావేశంలో తక్షణమే జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేయాలని, ఈ విషయంపై జాతీయ ప్రతిపక్ష పార్టీల నేతలతో భేటీ కావాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం మేరకే ఢిల్లీలో గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షులు ఫరూక్ అబ్దుల్లా, ఎన్‌సీపీ నాయకులు శరద్ పవార్, కాంగ్రెస్, సీపీఐ, ఆర్‌జేడీ, ఆప్ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఈ సమావేశం తరువాత ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలో జమ్మూకాశ్మీర్ ప్రతిపక్ష పార్టీల ప్రతినిధుల బృందం భారత ఎన్నికల కమిషన్‌తో భేటీ అయ్యారు. వినతిపత్రం సమర్పించారు. ఈ తరువాత ఎన్‌సీ పార్టీ నాయకులు, ఎంపీ (అనంతనాగ్ నియోజకవర్గం) హస్నైన్ మసూది మీడియాతో మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ ప్రజలకు చెందిన అన్ని ప్రధాన సమస్యలను, ఆందోళనలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకుని వచ్చామని, ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేశామని చెప్పారు. ఎన్నికలు నిర్వహించడం ముఖ్యమైన అంశమని, జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికల నిర్వహించడం సంస్థ బాధ్యత అని గుర్తు చేశామని తెలిపారు. ఆప్‌కు చెందిన సీనియర్ నాయకులు తరంజిత్ సింగ్ టోని మాట్లాడుతూ 'జమ్మూకాశ్మీర్‌లో పరిస్థితి అంతా బాగుందని ప్రధానమంత్రి, హోం మంత్రి, లెఫ్టినెంట్ గవర్నర్ చెబుతున్నారు. పరిస్థితి అంతా బాగున్నప్పుడు ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదు' అని ప్రశ్నించారు. శాసనసభకు ఏ విధమైన ప్రత్యామ్నాయం ఉండదని, జమ్మూకాశ్మీర్‌లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అక్కడి అధికార యంత్రాంగం వారి మాట వినడం లేదని ఆరోపించారు.

ఎన్నికలు నిర్వహించకపోవడం రాజ్యాంగ ఉల్లంఘనే..

భారత ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన వినతిపత్రంలో అనేక కీలక విషయాలను ప్రతిపక్ష నాయకులు ప్రస్తావించారు. జమూకాశ్మీర్ గత ఐదేండ్ల నుంచి అసెంబ్లీ, ఎన్నికైన ప్రభుత్వం లేకుండానే కొనసాగుతుందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. పంచాయితీలు, ఇతర స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించినా అవి అసెంబ్లీకి ప్రత్యామ్నాయం కాదని, ఎలాంటి ఆలస్యం చేయకుండా జమ్మూకాశ్మీర్ ఎన్నికలను నిర్వహించాలని కోరారు. ఓటర్ల జాబితాతో సహా అన్ని ప్రక్రియలను పూర్తి చేశామని, తుది నిర్ణయం తీసుకోవాల్సింది ఎన్నికల కమిషన్ మాత్రమేనని గతంలో కేంద్ర ప్రభుత్వం చెప్పిన విషయాన్ని వినతిపత్రంలో నాయకులు గుర్తు చేశారు. జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల కమిషన్ రాజ్యాంగ పరమైన బాధ్యత అని, ఎన్నికలను ఆలస్యం చేయడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం, జమ్మూకాశ్మీర్ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను నిరాకరిండమేనని నాయకులు విమర్శించారు. జమ్మూకాశ్మీర్ ఎన్నికల నిర్వహించడం అనేది జమ్మూకాశ్మీర్‌కు భారత రాజ్యాంగం ప్రసాదించిన అన్ని హామీలను పునరుద్ధరించడానికి, ఈ ప్రాంత ప్రజల రాజకీయ అభిలాషలను నెరవేర్చడానికి మొదటి అడుగుగా నాయుకులు వినతిపత్రంలో అభివర్ణించారు. జమ్మూ కాశ్మీర్‌లో తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల షెడ్యూల్‌ను నోటిపై చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రంపై జమ్మూకాశ్మీర్ ప్రతిపక్ష నాయకులతో పాటు మల్లికార్జున ఖర్గే, సీతారాం ఏచూరి, టిఆర్ బాలు, శరద్ పవార్, సంజయ్ సింగ్ వంటి ఇతర జాతీయ ప్రతిపక్ష పార్టీల నాయుకులు కూడా సంతకం చేశారు.

గిల్, రాహుల్‌కు పరీక్ష

- ఆస్ట్రేలియాతో తొలి వన్డే నేడు..
- మధ్యాహ్నం 1.30గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ముంబయి: టెస్ట్ సిరీస్‌ను గెలిచిన టీమిండియా.. ఇక వన్డే సిరీస్‌పై దృష్టి సారించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఆస్ట్రేలియాతో జరిగే తొలి వన్డేలో ఓపెనర్లకు పరీక్ష ఎదురుకానుంది. కేఎల్ రాహుల్ ఫామ్ లేమితో బాధపడుతుండగా.. యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. తొలి వన్డేకు కెప్టెన్ రోహిత్ శర్మ దూరం కావడంతో ఓపెనింగ్ భారం వీరిద్దరిపైనే ఆధారపడి ఉంది. ఇక వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ కూడా ఓపెనర్‌గా రాణించగల సమర్థుడే. ఈ క్రమంలో జట్టు మేనేజ్‌మెంట్ వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని ఓపెనింగ్ జోడీలను పరీక్షించనుంది. ఆసీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో కేఎల్ రాహుల్ ఘోరంగా విఫలమయ్యాడు. ఆరు ఇన్నింగ్స్‌లో కలిసి కెఎల్ రాహుల్ 200 పరుగుల్లోపే.. వాంఖడే వేదికగా జరిగే తొలి వన్డేలో సారథ్య బాధ్యతలను హార్దిక్ పాండ్యాకు వరించింది. ఈ మైదానంలో చివరిసారిగా ఇరుజట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓపెనర్లు ఆరోన్ ఫించ్, డేవిడ్ వార్నర్ సెంచరీలతో రాణించడంతో ఆ జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.



జట్లు..

ఇండియా: హార్దిక్(కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లి, సూర్యకుమార్, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), జడేజా, కుల్దీప్, సుందర్, చాహల్, షమీ, సిరాజ్, ఉమ్రన్ మాలిక్, శార్దూల్, అక్షర్, ఉనాద్కట్.

ఆస్ట్రేలియా: స్మిత్(కెప్టెన్), డేవిడ్ వార్నర్, హెడ్, లబూషేన్, మిచెల్ మార్ష్, స్టోయినీస్, కామ్రే, మ్యాక్స్‌వెల్, గ్రీన్, ఇంగ్లిస్, అబాట్, అగర్, స్టార్క్, ఎల్లిస్, ఆడం జంపా.

ఐపిఎల్-2023 సీజన్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా వార్నర్



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా సీనియర్ ఆటగాడు డేవిడ్ వార్నర్‌కు మరోసారి సారథ్య బాధ్యతలు అందుకున్నాడు. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కెప్టెన్‌గా ఉన్న వార్నర్.. ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా ఎన్నికయ్యాడు. ఆ ఫ్రాంచైజీ ట్విటర్ వేదికగా.. కెప్టెన్ రిషబ్ పంత్ యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడడం, ఐపిఎల్ సీజన్‌కు అందుబాటులో ఉండడం కష్టమైన నేపథ్యంలో ముందే కెప్టెన్ ఎంపికను పూర్తి చేసినట్లు పేర్కొంది. ఇక వైస్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్ వ్యవహరించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. 2022 సీజన్‌లో ఢిల్లీ తరఫున ఆడిన వార్నర్ ఐదు అర్ధసెంచరీలతో సహా 150.52 యావరేజ్‌తో 432పరుగులు చేశాడు. ఇక ఢిల్లీ జట్టు తన తొలి మ్యాచ్‌ను ఏప్రిల్ 1న లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది.

ఫిఫా అధ్యక్షునిగా ఇన్ఫాంటినో మళ్లీ ఎన్నిక



రోమ్: ఫిఫా అధ్యక్షునిగా గిన్ని ఇన్ఫాంటినో తిరిగి ఎన్నికయ్యారు. ఇతర సభ్యులెవ్వరూ పోటీలో లేకపోవడం, ఇన్ఫాంటినో ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో తిరిగి ఆయనే ఈ పదవిలో కొనసాగనున్నట్లు ప్రపంచ ఫుట్‌బాల్ గవర్నింగ్ బాడీ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 52ఏళ్ల ఇన్ఫాంటినో 2016నుంచి ఫిఫా అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఫిఫా అధ్యక్షుని గరిష్ఠ పదవీ కాలం నాలుగేళ్లు కాగా.. తొలిదఫా ఎన్నికైనప్పుడు మూడేళ్ల కాలంలో కరోనా వైరస్ సోకిన కారణంగా ఆ కాలాన్ని పరిగణలోకి తీసుకోవద్దని గవర్నింగ్ బాడీకి లేఖ రాశారు. దీంతో ఇన్ఫాంటినో వరుసగా రెండోసారి ఫిఫా అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఆయన ఈ పదవిలో 2027వరకు కొనసాగనున్నారు. ఇక ఉత్తర అమెరికా వేదికగా 2026లో జరిగే ఫిఫా ప్రపంచకప్‌లో ఆడే జట్ల సంఖ్యను 32నుంచి 48కు పెంచిన సంగతి తెలిసిందే.

ఆటలు



నిఖత్ శుభారంభం

● మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ శుభారంభం చేసింది. గురువారం నుంచి ప్రారంభమైన ఈ టోర్నీలో నిఖత్ తొలిరౌండ్‌లో అజర్‌బైజాన్‌కు చెందిన అనాఖనిమ్‌ను చిత్తుచేసింఅ. 50కిలోల విభాగంలో బరిలోకి దిగిన నిఖత్ తొలిరౌండ్‌నుంచే ప్రత్యర్థిపై బలమైన పంచ్‌లతో గుక్కతిప్పుకోకుండా చేసింది. రెండోరౌండ్‌లో నిఖత్ టాప్‌సీడ్, 2022 ఆఫ్రికన్ ఛాంపియన్ రౌమోస్యా బ్యూలాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఇక 52కిలోల విభాగంలో సాక్షి ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. నేడు జరిగిన ఏకపక్ష పోటీలో సాక్షి 5-0పాయింట్ల తేడాతో కొలంబియాకు చెందిన మార్టినేజ్‌ను ఓడించింది. దీంతో టోర్నమెంట్‌లో ప్రి క్వార్టర్స్ ఫైనల్లో చోటు దక్కించుకున్న తొలి భారత బాక్సర్‌గా సాక్షి నిలిచింది.



క్వార్టర్స్‌కు త్రీషా-గాయత్రి జోడీ

● ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ

లండన్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్‌లో త్రీషా జోలీ-గాయత్రీ గోపీచంద్ జోడీ హవా కొనసాగుతోంది. గురువారం జరిగిన ప్రి క్వార్టర్స్ పోటీలో త్రీషా-గాయత్రి జోడీ 21-14, 24-22తో జపాన్‌కు చెందిన హిరోటా-ఫుకుషిమాపై విజయం సాధించారు. క్వార్టర్‌ఫైనల్లో భారత మహిళల జోడీ చైనా టాప్‌సీడ్ జోడీతో తలపడనుంది. ఇక పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ షట్లర్లు చిరాగ్‌శెట్టి-సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి జోడీ పోరాటం ప్రి క్వార్టర్స్‌కు ముగిసింది. చిరాగ్-సాత్విక్ జోడీ 21-19, 17-21, 19-21తో చైనాకు చెందిన లియాంగ్-వాంగ్ చేతిలో పోరాడి ఓడారు. మరో డబుల్స్ జోడీ అర్జున్-ధృవ్ కపిల 16-21, 15-21తో చైనా జంట చేతిలోనే పరాజయాన్ని చవిచూశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.